ఫిబ్రవరి
2025

226

సంపుటి : 20 సంచిక : 9

వెల రు. 15 /-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో ........

మన న్యాయ వ్యవస్థ : పతనం వైపుకు ప్రయాణం
అధ్యయనమె ఆనందం
దిగజారుతున్న కార్మికవర్గ పరిస్థితులు
మధ్య యుగాల్లో శాస్త్ర సాంకేతికత
చరిత్ర గమనంలో సైన్సు
వేగంగా పెరుగుతున్న నిరుద్యోగం
ప్రైవేటు విషకౌగిలిలో వైద్యరంగం
తమిళనాడు కార్మికోద్యమంలో నూతనోత్సాహం
పని గంటల పెంపు ఎవరి కోసం?
సమర్ధుడైన దౌత్యవేత్త చౌ ఎన్‌లై

స్ఫూర్తి

# సమర్థుడైన దౌత్యవేత్త చౌ ఎన్‌లై

**వై రాము**

నీలి మబ్బు కొండల్లో ఎర్ర పొద్దు అతడు. చైనా సమాజానికి దిక్సూచి అతడు. చైనా విప్లవ నేత మావో జె డాంగ్‌కి ఆప్త మిత్రుడు. నైపుణ్యం కలిగిన సంధాన కర్త. పాలసీ మేకింగ్‌లో మాస్టర్‌గా ఖ్యాతి గడించిన వాడు. అతడే చౌ ఎన్‌లై. చైనా విప్లవ విజయంలో త్రిమూర్తులైన మావో, చౌ ఎన్‌లై, ఛూటేల కృషి కీలకమైనది. ఈ త్రయమే చైనా విప్లవానికి రథ సారథులు. మావో రాజకీయంగా, సైద్ధాంతికంగా ప్రజల్ని నడిపించడంలో సిద్ధహస్తుడు. గెరిల్లా తంత్రాలను ఉపయోగించడంలో ఛూటే ఘనుడు. దౌత్య వ్యవహారాలు పరిపాలన–విధానాల రూపకల్పనలో దిట్ట చౌఎన్‌లై. చైనా ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో, చైనా సమాజ సంస్కరణల్లో, ప్రపంచ దేశాల ముందు చైనా ప్రతిష్టను పెంచడంలో చౌ కీలక పాత్ర పోషించారు.

చౌఎన్‌లై 1898 మార్చి 5న జియాంగ్సు రాష్ట్రంలోని హువాయన్ గ్రామంలో సాధారణ కుటుంబంలో జన్మించాడు. 1910వ సంవత్సరంలో తన మేనమామ సహాయంతో ఈశాన్య చైనాలోని ఫెంగ్టియన్‌లో ప్రాథమిక విద్యను అభ్యసించాడు. ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నా తల్లిని చిన్నతనంలోనే కోల్పోయినా చదువు పట్ల శ్రద్ధ తగ్గలేదు. కుటుంబ పోషణ కోసం పొలాల్లో పని చేశాడు. ఉన్నత విద్య చదవడానికి 1917లో జపాన్ వెళ్ళాడు. ఉపాధ్యాయుడు కావడం చౌ లక్ష్యం. జపాన్ భాష రాకపోవడంతో చదవడానికి ఇబ్బంది పడ్డాడు. ఈ క్రమంలో చైనా లోని నాంకై మీద జపాన్ దాడి చేసింది. ఈ సంఘటన చౌ ను ప్రభావితం చేసింది. మాతృదేశం పట్ల ప్రేమను, జపాన్ దురాక్రమణ పట్ల వ్యతిరేకతను పెంచింది. అనంతరం చౌ జపాన్‌ను వీడి మే 9 న టియాంజిన్‌కు చేరుకుని మే ఫోర్త్ ఉద్యమంలో పాల్గొన్నాడు. 6 నెలల జైలు శిక్షను అనుభవించాడు. విడుదలైన అనంతరం 1920లో చదువు నిమిత్తం ఫ్రాన్సు చేరుకున్నాడు. అక్కడ కొత్తగా ప్రారంభించిన చైనా కమ్యూనిస్టు పార్టీ శాఖలో సభ్యునిగా



చేరాడు. యూరోపియన్ దేశాల పోరాట చరిత్రలను వర్గ పోరాటాల నేపథ్యాలను అధ్యయనం చేశాడు. నాలుగు సంవత్సరాల కృషి చేసిన అనంతరం సోషలిస్టు యూత్ ప్రధాన రిక్రూటర్‌గా ఎన్నికయ్యాడు.

1924వ సంవత్సరంలో కామ్రేడ్ చౌ ఎన్‌లై చైనాకు చేరుకున్నాడు. సన్ యెట్ సేన్ నేతృత్వంలోని జాతీయ విప్లవంలో పాల్గొన్నాడు. వాంపోవా మిలటరీ అకాడమీకి డిప్యూటి డైరెక్టర్‌గా పని చేశాడు. 1925వ సంవత్సరంలో స్నేహితురాలు డెంగ్ యింగ్ చావోను వివాహం చేసుకున్నాడు. 1927వ సంవత్సరంలో చైనా కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సైనిక విభాగానికి డైరెక్టర్ అయ్యాడు. సన్ యెట్ సేన్ మరణం తరువాత చాంగ్‌కై షేక్ దళాలు కమ్యూనిస్టులపై దాడులు ప్రారంభించాయి. చౌ ఎన్‌లై నాన్ చాంగ్ తిరుగుబాటుకు నాయకత్వం వహించాడు. నాన్‌చాంగ్ తిరుగుబాటు విఫలమైన తరువాత చైనాలో కమ్యూనిస్టుల పై తీవ్ర నిర్బంధం ఉండటంతో చైనా కమ్యూనిస్టు పార్టీ 6వ జాతీయ మహాసభ 1928 జూన్–జూలై మాసాల్లో రష్యాలోని మాస్కోలో జరపాల్సి వచ్చింది. ఈ మహాసభలో విప్లవానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని గ్రామీణ ప్రజల మద్దతు ద్వారా లక్ష్యం చేరుకోవాలని చౌ ఎన్‌లై ప్రతిపాదించాడు. మహాసభ చౌ ప్రతిపాదనను అంగీకరించింది. పార్టీ జనరల్ సెక్రటరీగా జియాంగ్ జోంగ్బా ఎన్నుకోబడ్డాడు. చౌ సెంట్రల్ కమిటి అర్గనైజేషన్ విభాగానికి డైరెక్టర్‌గా ఎన్నుకోబడ్డాడు. చౌ ఎన్‌లై ప్రతిపాదనలకు విరుద్ధంగా ధనిక రైతులకు అనుకూలంగా పట్టణ కేంద్రాలను చేజిక్కించుకోవాలని లిలిసాన్ ప్రయత్నించాడు.

పట్టణాలను స్వాధీనం చేసుకునేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. వేల మంది కామ్రేడ్స్ ప్రాణాలు కోల్పోయారు. అనంతరం మావోతో చౌ కి స్నేహం బలపడింది. ఇరువురూ ధృడమైన రాజకీయ సఖ్యతతో విప్లవానికి వ్యూహాలు రచించారు. లాంగ్ మార్చ్ సమయంలో చౌ కీలక పాత్ర పోషించాడు. చౌ తను పైస్థాయి బాధ్యతల్లో ఉన్నప్పటికీ తన కన్నా అనుభవంలోనూ, వయస్సులోనూ తక్కువగా ఉన్నా వారి పట్లకూడా స్నేహభావం ప్రదర్శించాడు. పార్టీలో భిన్నమైన అభిప్రాయాలున్న వారిని ఒప్పించడంలో చౌ ది ప్రత్యేకమైన శైలి. అదేవిధంగా శత్రువులతో, విదేశీ శక్తులతో చర్చలు జరపటంలో చౌ నైపుణ్యం కీలకమైంది.

జపాన్ దురాక్రమణను ఎదుర్కోవటానికి ఏర్పడిన యునైటెడ్ ఫ్రంట్‌ను, చాంగ్ కైషేక్ కమ్యూనిస్టుల ఏరివేత కోసం ఉపయోగించుకున్నాడు. 1945లో జపాన్ లొంగిపోయింది. అనంతరం చాంగ్ కై షేక్‌తో మావో, చౌలు శాంతి చర్చలు జరిపారు. 1947లో పూర్తి స్థాయి అంతర్యుద్ధం ప్రారంభమైంది. 1949లో చైనా ప్రజా రిపబ్లిక్ ఏర్పడింది.

**చైనా మొదటి ప్రధాని**

1949లో చైనా ప్రజా రిపబ్లిక్ ఏర్పడిన అనంతరం చౌ ఎన్‌లై ప్రధాన మంత్రిగా, విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. విదేశీ సంబంధాలను మెరుగుపరుచుకుంటూ పార్టీ విధానాలను నేర్పుగా అమలు చేశారు. ప్రధాన మంత్రిగా 1949 నుండి 1970 వరకు 21 సంవత్సరాలు కృషి చేసి చెరగని ముద్రవేశాడు. చౌ ప్రధానిగా, దౌత్యవేత్తగా అనేక మైలు రాళ్లు సాధించాడు. కొరియన్

**(మిగతా 35వ పేజీలో)**

## ఈ సంచికలో...


1. సమర్థుడైన దౌత్యవేత్త చౌ ఎన్‌లై

వై రాము...........2

2. మన న్యాయ వ్యవస్థ : పతనం వైపుకు ప్రయాణం

ఇందిరా జైసింగ్........4

3. అధ్యయనమే ఆనందర్

ట్రైకాంటినెంటల్ రచన........7

4. దిగజారుతున్న కార్మికవర్గ పరిస్థితులు

సుధా భరద్వాజ్....... 12

5. మధ్య యుగాల్లో శాస్త్ర సాంకేతికత

ఎంవిఎస్ శర్మ........15

6. చరిత్ర గమనంలో సైన్సు

డా॥ గేయానంద్........19

7. వేగంగా పెరుగుతున్న నిరుద్యోగం

ఎస్ వెంకట్రావు........ 25

8. ప్రైవేటు విషకౌగిలిలో వైద్యరంగం

వందనా ప్రసాద్........28

9. తమిళనాడు కార్మికోద్యమంలో నూతనోత్సాహం

ఇళంగోవన్ రాజశేఖరన్..... ....31

10. పని గంటల పెంపు ఎవరి కోసం?

ఎ కోటిరెడ్డి.... ..32



సంపాదకుడు :
**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం :
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visitcpi(m)site at: cpim.org


# 'ట్రంపరితనం'

అమెరికా ఎన్నికల్లో అధ్యక్షపీఠాన్ని దక్కించుకున్న డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రకటనలు గమనిస్తే మారుతున్న ప్రపంచాన్ని మోకాలడ్డి ఆపుదామన్న తాపత్రయం వాటిలో కనిపిస్తుంది. అమెరికాను తిరిగి గొప్ప దేశంగా మారుస్తానని ట్రంప్ 'గర్జించాడు'. అమెరికా ఫస్ట్ నినాదంతో ఇతర దేశాల సరుకుల దిగుమతులపై ముఖ్యంగా చైనా నుండి దిగుమతులపై భారీగా సుంకాలు విధిస్తాననీ, అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న వారిని బలవంతంగా పంపేస్తాననీ, సరిహద్దుల్లో గోడలు కట్టి అమెరికాను 'పటిష్ట' దేశంగా మారుస్తాననీ ప్రకటించాడు. అక్కడితో ఆగలేదు. పనామా కాలువను, ఐస్‌లాండ్‌ను బలవంతంగా స్వాధీనం చేసుకుంటానని హూంకరించాడు. కెనడాను అమెరికాలోని 51వ రాష్ట్రంగా కలిపేస్తానన్నాడు. డాలరులో వ్యాపారం చేయని దేశాలపై ఆంక్షలు విధిస్తానన్నాడు.

కేవలం ప్రకటనలతో ఆగిపోలేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నుండి అమెరికాను ఉపసంహరించుకున్నాడు. వాతావరణ కాలుష్య నివారణపై కుదిరిన ప్యారిస్ ఒప్పందం నుండి వైదొలిగాడు. అక్రమంగా వలసదారులను క్రూరమృగాలను వేటాడినట్లు వేటాడి, కాళ్లకు, చేతులకు సంకెళ్ళు వేసి ప్రత్యేక విమానాల్లో వారి దేశాలకు పంపించాడు. ఆయన భారత దేశాన్నీ వదల్లేదు. మన దేశం నుండి దిగుమతులపై భారీగా సుంకాలు వేస్తాననీ, అక్రమ వలసదారులను పట్టుకుని పంపేస్తాననీ హెచ్చరికలు జారీ చేశాడు. ప్రధాని నరేంద్ర మోడీకి ప్రపంచంలో ఉన్న అత్యంత సన్నిహిత మిత్రుల్లో ట్రంప్ ఒకరన్న విషయం మనం మరిచిపోరాదు.

అమెరికాను తిరిగి అగ్రదేశంగా మారుస్తాననీ, అమెరికా ఫస్ట్ అనీ ట్రంప్ చేస్తున్న ప్రకటనల వెనుక తిరిగి అమెరికా కేంద్రంగా ఏకధృవ ప్రపంచాన్ని సృష్టించాలన్న దురాశ దాగుంది. సోవియట్ నాయకత్వంలో సోషలిస్టు వ్యవస్థ బలంగా ఉన్నప్పుడు ప్రపంచం రెండు ధృవాలుగా విడిపోయింది. సోవియట్ విచ్ఛిన్నం తరువాత అమెరికా నేతృత్వంలో ఏకధృవ ప్రపంచ ఏర్పడింది. భూగోళం మీద అన్ని చోట్లా అమెరికా పెత్తనం చెల్లుబాటు అయింది. అమెరికా అన్ని దేశాలనూ తను సృష్టించిన నయా-ఉదారవాద విధానాలకూ, దాని సంస్థలైన ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థల వినాశకరమైన షరతులకూ కట్టిపడేసింది. దాదాపు రెండు దశాబ్దాలపాటు దాని ఏకఛత్రాధిపత్యం నడిచింది.

కానీ గత రెండు దశాబ్దాలుగా భూగోళ రాజకీయాలు బహుళ ధృవ ప్రపంచం వైపుగా మారుతూ వస్తున్నాయి. అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేసే అనేక కేంద్రాలు ఏర్పడ్డాయి. చైనా నాయకత్వంలో ఏర్పడిన షాంఘై సహకార సంస్థ, బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణఅమెరికాలతో కూడిన బ్రిక్స్ కూటమి, లాటిన్ అమెరికాలో వామపక్ష ప్రభుత్వాలతో ఏర్పడిన కూటములు మొదలైనవి అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేస్తున్నాయి. డాలరు ఆధిపత్యాన్నీ, డాలరును అడ్డం పెట్టుకుని అమెరికా విధిస్తున్న కక్షపూరిత ఆంక్షలను ఎదుర్కోవడంలో భాగంగా బ్రిక్స్ దేశాల కూటమి డాలరుకు పాతరేసి స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం చేయాలని నిర్ణయించు కున్నాయి. ఈ కూటమిలోకి ఇటీవలనే అదనంగా అయిదు దేశాలు చేరాయి. మరో 30కి పైగా దేశాలు చేరడానికి సిద్ధంగా ఉన్నాయి. రాజకీయంగా కూడా అమెరికా ఆధిపత్యానికి చైనా, రష్యా, ఇరాన్ వంటి దేశాలనుండి సవాళ్లు ఎదురవుతున్నాయి.

ఈ ప్రపంచ గమనాన్ని వెనక్కు తిప్పి తిరిగి అమెరికా నేతృత్వంలోని ఏకధృవ ప్రపంచాన్ని స్థాపిస్థానని డొనాల్డ్ ట్రంప్ ఆయన మితవాద నాయకత్వం అమెరికా ప్రజలకు హామీ ఇస్తోంది. అంతకు ముందటి ప్రభుత్వాలు దీనికోసమే ప్రయత్నించి ప్రపంచంలో అనేక చోట్ల యుద్ధ కుంపట్లు రాజేశాయి. ఉక్రెయిన్-రష్యా యుద్ధం, ఇజ్రాయిల్-హమాస్ యుద్ధం, మధ్య ప్రాచ్య దేశాలపై ఇజ్రాయిల్ దాడులు, సిరియా అంతర్యుద్ధం, తైవాన్-చైనాల మధ్య, దక్షిణ చైనా సముద్రంలో ఉద్రిక్తతలు... ఇవన్నీ అమెరికా తన ఆధిపత్యం నిలుపుకోడానికి రెచ్చగొట్టినవే. యుద్ధం, ఆయుధాలు, కవ్వింపులతో ఆధిపత్యం నిలుపుకుందామని అమెరికా చేస్తున్న ప్రయత్నాలకు కూడా ప్రతిఘటన గట్టిగానే వస్తోంది. ఆర్థికంగా, సాంకేతికంగా అమెరికా ఆధిపత్యానికి చైనా నుండి ఎదురవుతున్న పెద్ద సవాలును ఎలా ఎదుర్కోవాలో అమెరికన్లకు అర్థం కావడం లేదు. అందువల్లనే మెజారిటీ అమెరికన్లు ట్రంప్ లాంటి మితవాద నాయకుల వలలో పడిపోతున్నారు. ట్రంప్ లాంటి వాళ్లు ఎంతగా ఘీంకరించినా బహుళధృవం వైపు మారుతున్న ప్రపంచాన్ని వెనక్కు తిప్పలేరు. సోషలిజం వైపు దాని ప్రయాణాన్నీ ఆపలేరు. ఈ సమయంలో వర్ధమానదేశాలు సమైక్యంగా ఎదిరిస్తే సామ్రాజ్యవాద ఆధిపత్యం నుండి బయటపడతాయి. మన ప్రధాని నరేంద్ర మోడీ ఈ సత్యాన్ని తెలుసుకోకుండా దేశాన్ని అమెరికాకు జూనియర్ భాగస్వామిగా మార్చడానికి తాపత్రయ పడుతున్నారు. దీనివల్ల మన ప్రజలకూ, దేశానికీ చాలా నష్టం.

**ఈ మాసం ముఖ్యాంశం**

# మన న్యాయ వ్యవస్థ : పతనం వైపుకు ప్రయాణం



రచయిత సీనియర్ న్యాయవాది, మానవహక్కుల కార్యకర్త

**ఇందిరా జైసింగ్**

మన రాజ్యాంగాన్ని గుర్తు చేసుకున్నప్పుడు నేను వయసులో రాజ్యాంగం కన్నా పెద్దదాన్ని అని గుర్తుకువచ్చింది. అందుకే నేను గత నలభై ఏళ్ళకే పరిమితం కాకుండా రాజ్యాంగం అవతరించి గడిచిన 75 ఏళ్ళ కాలం గురించి వివరించేందుకు ప్రయత్నిస్తాను. న్యాయవాదిగా నేను జీవించింది, పని చేసింది రాజ్యాంగం పరిధిలోనే కాబట్టి నన్ను నేను రాజ్యాంగ ఆవిర్భావ కుమార్తెగా చెప్పుకోవడం అతిశయోక్తి కాబోదని భావిస్తున్నాను. నేను రాజ్యాంగాన్ని ఒక కవచంగా, ఒక కత్తిగా, ఒక శరణార్థి శిబిరంగా నా క్లయింట్‌ల కోసమే కాదు, నా కోసం కూడా వాడుకున్నాను. కాబట్టి నా ఈ అవతరాలకు అతీతంగా రాజ్యాంగం మీద నాకు ఉన్న కొద్ది పాటి పరిశీలనలను మీతో పంచుకుంటాను.

మొట్టమొదటగా మనం గుర్తించాల్సిన అంశం రాజ్యాంగం కేవలం ఒక లీగల్ దస్త్రం కాదు. అది రాజకీయ దస్త్రం కూడా. అందుకే మన రాజకీయ సంవిధానానికి రాజ్యాంగం కేంద్ర బిందువుగా ఉంటుంది. రెండవ అంశం ప్రతి ప్రజా రాజకీయ వివాదం రాజ్యాంగ పరమైన, న్యాయపరమైన వివాదమే. అందుకే న్యాయ వ్యవస్థలో కూడా రాజ్యాంగమే కేంద్ర బిందువుగా నిలుస్తుంది. భారత రాజ్యాంగం చట్టసభలు, కార్య నిర్వాహక వర్గం, న్యాయవ్యవస్థల విధులు ఏమిటో స్పష్టం చేసింది. అయితే శాసనవ్యవస్థ, కార్య నిర్వాహక వ్యవస్థ చేసిన నిర్ణయాలను న్యాయ పరంగా వివేచించే అధికారం సుప్రీంకోర్టు, హైకోర్టులకు కల్పించింది. ఆ నిర్ణయాలు రాజ్యాంగ పరిధికి లోబడి లేకుంటే రాజ్యాంగ పరంగా ఆ నిర్ణయాలు చెల్లుబాటు కావని త్రోసిపుచ్చే అధికారాలనూ దఖలు పరిచింది. 1973లో కేశవానంద భారతి కేసులో ప్రభుత్వం చేసిన రాజ్యాంగ సవరణ రాజ్యాంగ మౌళిక స్వభావాన్ని ఉల్లంఘిస్తుంది కాబట్టి ఆ సవరణ చెల్లుబాటు కాదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అందుకే భారతదేశ అతున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టు ప్రపంచంలో కల్లా శక్తివంతమైనదిగా పరిగణిస్తారు. మహిళను అయినప్పటికీ లింగపరమైన వివక్షకు తావులేకుండా రాజ్యాంగం నాకు సరిసమాన హక్కులు కల్పించినందుకు గానూ నేను రాజ్యాంగానికి ధన్యవాదాలు చెప్పకుండా ఉండలేను.

జడ్జీల నియామకాలు న్యాయవాదుల నుండి ఎంపిక ద్వారానే జరుగుతాయి కాబట్టి న్యాయవాద వృత్తి అతి శక్తివంతమైనది. రాజ్యాంగ సభలో కూడా న్యాయవాదుల ఆధిపత్యం ఉండడం మీరు గమనించే ఉంటారు. వాస్తవంగా కూడా, ఈ రోజుకీ, న్యాయవాదులే కోర్టుల పనితీరును మలచడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. కాబట్టి రాజ్యాంగ పరిణామ క్రమం న్యాయవాదులను విస్మరించలేదు. వివిధ సమస్యలను కోర్టు దృష్టికి తీసుకువచ్చేది ఈ న్యాయవాదులే. వాళ్ళు అనుసరించే వ్యూహాలు కోర్టులు వెలువరించే అంతిమ తీర్పులను ప్రభావితం చేస్తాయి. ఒక్కోసారి బార్ అసోసియేషన్‌లో సంబంధాలనో, కుటుంబ పరమైన సంబంధాలనో ఆధారం చేసుకుని కోర్టులలో అడుగుపెడుతారు. ఇది కోర్టుల లక్ష్యాన్ని సంక్లిష్ఠం చేస్తుంది, విమర్శలకు తావిస్తుంది. కోర్టుల తప్పొప్పులను లెస్సగా ఎంచగలిగిన వారు కోర్టు బయటి వ్యక్తులే.

రాజ్యాంగ రూపకల్పనలో పాలుపంచుకున్న నాటి న్యాయవాదులకు, ఈ నాటి న్యాయవాదులకు పోలికే లేదు. స్వాతంత్రోద్యమ నాయకులు ఒకసారి చట్ట సభలకు ఎన్నికయ్యాక చాలా అరుదైన సందర్భాలలో మాత్రమే న్యాయవాదవృత్తిలో భాగంగా కోర్టులకి ఎక్కారు. కానీ ఇవాళ న్యాయవాద వృత్తిలో ఉండి ఎన్నిక ద్వారానో, నామినేట్ చేయబడడం ద్వారానో చట్ట సభలో అడుగు పెట్టినా న్యాయవాద వృత్తిని పూర్తిస్థాయిలో కొనసాగిస్తున్నారు. అలాగే మరో ఆందోళన కర అంశం ఏమిటంటే సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులుగా పని చేసినవారు పదవీ విరమణ చేయగానే అధికారపార్టీ ఇచ్చిన రాజకీయ పదవులను ఏమాత్రం తటపటాయింపులు, ఆలస్యం లేకుండా అంగీకరిస్తున్నారు. తద్వారా న్యాయవ్యవస్థ స్వయంప్రతిపత్తిని ప్రశ్నార్థకంగా మార్చేస్తున్నారు. అంతేకాదు న్యాయమూర్తులుగా వాళ్ళ ఇచ్చిన తీర్పులలో నిజాయితీ ప్రశ్నార్థకంగా మారుతుంది. గతంలో ఇచ్చిన తీర్పులకు పదవీ విరమణ అనంతరం పొందిన పదవులకు మధ్య ఉన్న లంకె గురించి వివేచిస్తున్నారు. దీనికి పరిష్కారం ఒక్కటే. పదవీ విరమణ అనంతరం న్యాయమూర్తులు లాభాపేక్షతో కూడిన పదవులుకాని, రాజకీయ సంబంధమైన నియామకాలు గానీ పొందడానికి అనర్హులుగా నిషేదం విధించాలి.

ఈ కొద్దిపాటి పరిశీలనలతో మన నైతిక లోకనీతి ఎంతగా వొంపులు తిరుగుతుందో గమనిద్దాం. అయితే రాజ్యాంగ నైతికతను మనం ఏ మేరకు అర్థం చేసుకున్నాం అనే దాన్ని బట్టి ప్రస్థుత నైతిక లోకనీతి ఏస్థితిలో ఉందో మనం అంచనాకు రాగలుగుతాం. దీనికి సమాధానం రాజ్యాంగ పీఠికలో దొరుకుతుంది. రాజ్యాంగ పీఠికయే మన భారతీయతా భావనను పట్టిస్తుంది. మన రాజ్యాంగం పనితీరు, న్యాయవ్యవస్థ పనితీరుల మధ్య సంతులనాన్ని అంచనా వెయ్యడానికి ఈ రెండూ రాజ్యాంగ పీఠికలో విలువలకు ఏ మేరకు కట్టుబడి ఉన్నాయనేదే గీటురాయి.

మనం, ఈ దేశ పౌరులం రాజ్యం, అధికార అంగాలన్నీ రాజ్యాంగ నైతికతకు లోబడి పనిచేస్తున్నాయా లేదా అని

అనునిత్యం గమనిస్తూ ఉండాలి. అంటే మౌళికంగా రాజ్యం చట్టానికి లోబడి వ్యవహరించాలి, చట్టాల్ని దుర్వినియోగం చెయ్యకూడదు, అలాగే పౌరస్వేచ్ఛలు, హక్కులను కాపాడాలి. అయితే వివాదం ఏమిటంటే ఈ డెబ్భై ఐదేళ్ళ కాలంలో పౌర స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు మరింత ఇనుమడించాల్సింది పోయి చట్టాన్ని దుర్వినియోగం చెయ్యడం నానాటికీ ఎక్కువ కావడం చూడాల్సి వస్తోంది.

సరే, ముందుగా మనం మొదటి నుండి మొదలు పెడదాం. తొలినాళ్ళలో కోర్టుల్లో వ్యవసాయ సంస్కరణలు, జమిందారీ విధానాల రద్దు అంశాల మీద ఇబ్బడిమబ్బడిగా వాజ్యాలు పడుతూ వచ్చేవి. భూసంస్కరణల చట్టాలు అన్నింటినీ కోర్టుల్లో సవాలు చేసారు. అదృష్టం ఏంటంటే రాజ్యాంగ ఆదేశిక సూత్రాలు భౌతిక వనరుల పంపిణీ ద్వారా సమాజంలో సమిష్టి ప్రయోజనాలను ఒనగూర్చడం రాజ్యం అనుసరించాల్సిన విధానం అని స్పష్టం చేస్తున్నాయి కాబట్టి ఈ దృష్ట్యా భూసంస్కరణల చట్టాలు చెల్లుబాటు అవుతాయని కోర్టులు తీర్పులు చెప్పాయి. అలాగే షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారికి ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఆధిపత్య కులాలకు చెందిన వారు ఇది వివక్షను ఎదురు ప్రయోగించడంగా పేర్కొంటూ కోర్టుల్లో వందలాది వాజ్యాలు వేసారు. ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లు 50 శాతానికి పరిమితం చెయ్యడం ద్వారా సుప్రీంకోర్టు ఈ వివాదానికి తెరదించింది. ఓబిసిలకు కల్పించిన రిజర్వేషన్లను సుప్రీంకోర్టు సమర్థిస్తూనే ఇవి కూడా 50 శాతం పరిమితికి లోబడి ఉండాలని నిర్దేశించింది. ఇప్పటికీ పదోన్నతులలో రిజర్వేషన్ల అమలు అంశం రాజ్యాంగ సవరణ చేసినప్పటికీ పరిష్కారం కాలేదు.

బ్యాంకుల జాతీయకరణ అంశం భారత రాజ్యాంగ చరిత్రలో మైలురాయి వంటిది. రుస్తోమ్ కూపర్ కేసులో బ్యాంకుల జాతీయకరణ చట్టం చెల్లుబాటు అవుతుందని 1970లో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. ఆర్థిక వ్యవస్థను సరళీకరించే పేరిట తిరిగి బ్యాంకులను ప్రైవేటీకరించే దిశగా ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. ఇది వేరే కథ.

అలాగే ఆస్తి హక్కు వివాదాలూ కోర్టులకు ఎక్కాయి. ఈ వాజ్యాలన్నీ ఎక్కువలో ఎక్కువ ఎండోమెంట్ మత సంస్థలు వేసినవే. ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల నుండి తొలగించి 1978లో రాజ్యాంగపరమైన హక్కుగా మార్చారు.

> **❝ అదే కాలంలో ఉవ్వెత్తున సాగిన మహిళా ఉద్యమాలకు ధన్యవాదాలు చెప్పుకోవాలి. మహిళల రక్షణకు సంబంధించిన అనేక అంశాలను కోర్టులు పరిష్కరించేందుకు పాటుబడ్డాయి. వరకట్న మరణాలను పథకం ప్రకారం చేసిన తీవ్రమైన నేరపూరిత హత్యలుగా పరిగణించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అత్తవారింట ఎదుర్కొనే గృహహింసకు వ్యతిరేకంగా మహిళలు ఈ రోజుల్లో కోర్టు గుమ్మం ఎక్కితే 'చట్టాన్ని దుర్వినియోగం చెయ్యొద్దు' అని సుద్దులు చెబుతున్నారు అంటే మహిళల ప్రాణాలంటే కోర్టులకు లెక్కలేదు, ❞**

అన్నిటికన్నా రాజ్యాంగంలోని అతి కీలకమైన అధికరణం గమనం ఈ 75 ఏళ్ళలో ఎలా ఉన్నదో మీకు వివరించాలి. 'ఏ వ్యక్తి జీవితాన్ని గానీ, వ్యక్తిగత స్వేచ్ఛను గానీ చట్టబద్ధమైన పద్ధతులలో మినహా ఎలాంటి పరిస్థితులలోనూ తృణీకరించరాదు' రాజ్యాంగం అమలులోకి రావడంతో సమాంతరంగా జీవిత, వ్యక్తిగత స్వేచ్ఛలను ఏకపక్షంగా, నిరంకుశంగా హరించి వెయ్యడానికి వ్యతిరేకంగా పోరాటం మొదలయ్యింది. ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు ఎ.కె.గోపాలన్‌ను ప్రివెంటివ్ డిటెన్షన్ (పి.డి) చట్టం కింద అరెస్టు చేసారు. ఈ అరెస్టు తన జీవిత స్వేచ్ఛను హరిస్తుంది అని ఎ.కె.గోపాలన్ కోర్టులో సవాలు చేసారు. ఈ కేసును వాదించిన ప్రముఖ న్యాయవాది, దార్శనికుడు యం.కె.నంబియార్ 'ముందస్తు నిర్బంధంలోకి తీసుకునే చట్టం దానంతట అదే అరెస్టులకు అధికారం ఇవ్వదు. ఆ చట్టం రూపొందించిన అరెస్టు విధానం న్యాయబద్ధంగా ఉండాలే తప్ప ఏకపక్షంగా, నిర్బంధపూరితంగా ఉండకూడదు' అన్న అంశాన్ని లేవనెత్తాడు. సుప్రీంకోర్టు బాల్యావస్థ సందిగ్ధంతో, తన అధికారాలపై పూర్తి అవగాహనలేని దశలో ముందస్తు అరెస్టుకు అవకాశం కల్పించే చట్టం ఉన్నప్పుడు రాజ్యాంగం అటువంటి నిర్బంధం చెల్లుబాటును సమర్థిస్తుంది అని తీర్పు చెప్పింది. జీవించే హక్కు, స్వేచ్ఛలకు తగిలిన మొదటి ఎదురు దెబ్బ ఇది.

ఇంతలోగా 1975 రానే వచ్చింది. దేశంలో ఎమర్జెన్సీ విధించారు. జబల్‌పూర్ జిల్లా అదనపు మేజిస్ట్రేట్ ఎమర్జెన్సీ కాలంలో జీవించే హక్కును రద్దు చెయ్యవచ్చని తీర్పు ఇవ్వడంతో జీవించే హక్కు వ్యక్తిగత స్వేచ్ఛలను సంపూర్ణంగా తృణీకరించినట్లు అయ్యింది. మన రాజ్యాంగ చరిత్రలో ఎమర్జెన్సీ విధింపును అత్యంత దిగజారుడు చర్యగా భావించవచ్చు. జనతా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ నష్టాన్ని పూడ్చే విధంగా 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఎమర్జెన్సీలో కూడా జీవించే హక్కును నిరాకరించడం అసాధ్యంగా చేసారు. న్యాయ ప్రక్రియ చేసిన పొరబాటును రాజకీయ ప్రక్రియ సరిదిద్దింది.

అలాగే ఎ.కె.గోపాలన్ కేసులో జరిగిన అన్యాయాన్ని మేనకా గాంధీ కేసులో (1978) కోర్టులే సరిదిద్దాయి. విదేశీ పర్యటనకు అవసరమైన పాస్‌పోర్టు ఆమెకు జారీ చెయ్యడానికి ప్రభుత్వం నిరాకరించింది. విదేశాలకు ప్రయాణించే హక్కు పౌరుల ప్రాథమిక హక్కు కిందకు వస్తుంది, కాబట్టి అమలులో ఉన్న పాస్‌పోర్ట్ చట్టం ప్రకారం ఆమెకు పాస్‌పోర్ట్ ఇవ్వనిరాకరించడం చెల్లుబాటు కాదు, చట్టం న్యాయబద్ధంగా ఉండాలి అని కోర్టు తీర్పు చెప్పింది.

1980 మధ్య దశకం వరకూ కోర్టులు వెట్టి చాకిరీ కార్మికులు, నిర్మాణ రంగ కార్మికులు, హాకర్లు, పేవ్‌మెంట్‌ల నివాసితులు, అట్టడుగు వర్గాల హక్కుల సమస్యలను కోర్టులు పట్టించుకోలేదు. సామాజిక, ఆర్థిక హక్కులను అమలు చేసే కాలం అది. జబల్‌పూర్ జిల్లా అదనపు మెజిస్ట్రేట్ బదాబదలు చేసిన చట్టబద్ధతను సుప్రీంకోర్టు పునరుద్ధరించింది అని పరిశీలకులు పేర్కొన్నారు.

అదే కాలంలో ఉవ్వెత్తున సాగిన మహిళా ఉద్యమాలకు ధన్యవాదాలు చెప్పుకోవాలి. మహిళల రక్షణకు సంబంధించిన అనేక అంశాలను కోర్టులు పరిష్కరించేందుకు పాటుబడ్డాయి. వరకట్న మరణాలను పథకం ప్రకారం చేసిన తీవ్రమైన నేరపూరిత హత్యలుగా పరిగణించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అత్తవారింట ఎదుర్కొనే గృహహింసకు వ్యతిరేకంగా మహిళలు ఈ రోజుల్లో కోర్టు గుమ్మం ఎక్కితే 'చట్టాన్ని దుర్వినియోగం చెయ్యొద్దు' అని సుద్దులు చెబుతున్నారు అంటే మహిళల ప్రాణాలంటే కోర్టులకు లెక్కలేదు, అదే

> "పరిపాలన, ప్రజాస్వామ్యం రెండూ అంకెల గారడీకి కుదించబడ్డాయి. 'రిసార్ట్' రజకీయాలు, పార్టీ ఫిరాయింపులు అడ్డూ అదుపూ లేకుండా సాగుతున్నాయి. రాజ్యాంగం లోని పదవ షెడ్యూల్‌లో పొందుపరిచిన పార్టీఫిరాయింపుల నిరోధ చట్టం కాగితాలకే పరిమితం అయిపోయింది. ఓటుకు ఉండే పవిత్రత అపహాస్యానికి గురవుతోంది."

వరకట్న మరణం పాలయిన మహిళల కేసులు బెంచ్ ముందుకు వస్తే కోర్టులు ఆగ్రహవేశాలు ప్రకటిస్తున్నాయి. దీనిని బట్టి బ్రతికి ఉన్నవారికన్నా, శవాలతో 'డీల్' చెయ్యడం కోర్టుకు సౌకర్యంగా ఉందని భావించవచ్చునా.

మన న్యాయశాస్త్రం మానవహక్కుల విషయంలో చాలా అధ్వాన్నంగా వ్యవహరిస్తుంది. భోపాల్ గ్యాస్ దుర్ఘటనలో బాధితుల హక్కులు నిరాకరించడం ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. గడిచిన డిశంబరు నెలతో ఈ దుర్ఘటన జరిగి 40 ఏళ్ళు అయింది. న్యాయం అందించమన్న బాధితుల కోర్కె ఈ నాటికీ పరిష్కారం కాలేదు. మన న్యాయవ్యవస్థలో ఇది ఘోర వైఫల్యం. ఈ రోజు వరకూ యూనియన్ కార్బైడ్‌నిగానీ, ఆ కంపెనీని 'టేకోవర్' చేసిన డౌకెమికల్స్‌నుగానీ, ఆ కంపెనీ బాధ్యులనుగానీ విచారణ చెయ్యలేదు. ఆ ప్రాంత భూగర్భ జలాలు విషతుల్యంగా మారాయి. యూనియన్ కార్బైడ్ ప్లాంట్ అంతిమ సంస్కారం కోసం ఎదురు చూస్తూ ఇంకా అదే ప్రదేశంలో నిలిచి ఉంది. బాధితుల, వాళ్ళ తరువాతి తరాల వారి ఆరోగ్యాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. బాధితుల పరోక్షంలో అన్యాయమైన, అసహజమైన ఒప్పందాన్ని అంగీకరించడంలో సుప్రీంకోర్టు తన వైఫల్యానికి పూర్తి బాధ్యత వహించాలి. బాధితులకు న్యాయం చేకూర్చలేనందుకు కోర్టు క్షమాపణ కూడా అడగడం లేదు. తీర్పును సరిదిద్దే ప్రయత్నమూ చెయ్యడం లేదు.

తాజాగా రాజ్యాంగంలోకి వ్యక్తిగత గోప్యత ఇంటర్నెట్ స్వేచ్ఛ వంటి కొత్త హక్కులు వచ్చి చేరాయి. పౌరులు ఏం ఆలోచిస్తున్నారు, ఏం మాట్లాడుతున్నారు, ఏం చేస్తున్నారో ప్రభుత్వం నిఘా పెట్టడం మన వ్యక్తిగత స్వేచ్ఛకు గొడ్డలిపెట్టు వంటిది. వాక్స్వాతంత్ర్యాన్ని అరికట్టేదానికి కేంద్ర ప్రభుత్వం 'బ్రాడ్ కాస్టింగ్ బిల్లు'ను తీసుకురానుంది. ప్రస్తుతం ఈ అంశం సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్నది. కోర్టు ఎలా స్పందిస్తుంది అనేది ఎవరూ ఊహించే పరిస్థితిలేదు.(ప్రభుత్వం ఈ బిల్లును ఉపసంహరించుకుంటున్నట్లు సుప్రీంకోర్టుకు నివేదించడం తాజా పరిణామం – సం॥)

పరిపాలన, ప్రజాస్వామ్యం రెండూ అంకెల గారడీకి కుదించబడ్డాయి. 'రిసార్ట్' రజకీయాలు, పార్టీ ఫిరాయింపులు అడ్డూ అదుపూ లేకుండా సాగుతున్నాయి. రాజ్యాంగం లోని పదవ షెడ్యూల్‌లో పొందుపరిచిన పార్టీఫిరాయింపుల నిరోధ చట్టం కాగితాలకే పరిమితం అయిపోయింది. ఓటుకు ఉండే పవిత్రత అపహాస్యానికి గురవుతోంది.

ఇక సమాఖ్య వ్యవస్థ గురించి ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిది. వివిధ రాష్ట్రాలకు జరిగే ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి పాల్గొనవచ్చా అసలుకి? నా ఉద్దేశ్యంలో కూడదు. అతను/ఆమె దేశానికి ప్రధాన మంత్రే కానీ ఒక పార్టీ నాయకుడు కాదు. కాబట్టి తన పార్టీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదు.

విషాదం ఏంటంటే రాజ్యాంగ విలువలకు ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వానికి మధ్యన పూడ్చలేనంత అగాధం ఉన్నది. ఈ ప్రభుత్వం రాజ్యాంగ పీఠికలో పొందుపరిచిన భారతీయతా భావననే లోకువ కట్టేస్తుంది. రాజ్యాంగ పీఠికలో పొందుపరిచిన లౌకికతత్వానికి కట్టుబడి ఉన్నవాళ్ళ మీద దేశద్రోహులుగాను, మైనార్టీలను బుజ్జగించేవాళ్ళుగానూ ముద్ర వేస్తోంది.

భారత శిక్షాస్మృతిని ఈ ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా దురుపయోగం చేస్తోంది. పౌరసత్వ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా నిరసన తెలియచెప్పినవారిని 'ఉగ్రవాదులుగా' పరిగణించి 'ఉపా' చట్టం కింద కేసులు కట్టింది. మత విద్వేషాలు రెచ్చగొట్టి అల్లర్లకు, గృహ దహనాలకు, లూటీలకు, హత్యలకు కారణమైన వాళ్ళు పెద్దమనుషుల్లా స్వేచ్ఛగా తిరుగుతున్నారు, ప్రభుత్వ విధానాలను విమర్శించిన వారు అక్రమ అరెస్టులకు గురవుతున్నారు.

మసీదుల కింద హిందూ దేవాలయాలు ఉన్నాయా లేవా అని తేల్చడానికి తవ్వకాలకు అనుమతించడం ద్వారా కోర్టులు భారత రాజ్యాంగాన్ని కుళ్ళగించేదానికి అనుమతిస్తున్నాం అన్న సోయలేకుండా ఉన్నాయి. కోర్టులు గతంలో తాము ఇచ్చిన తీర్పులకు కూడా కట్టుబడి ఉండడం లేదు. రాజ్యాంగం మౌలిక స్వభావంలోనే లౌకికతత్వం ఇమిడి ఉందని ఇవే కోర్టులు తీర్పు ఇచ్చాయి. బహుశా ఈ పరిణామాలన్నీ దృష్టిలో ఉంచుకునే ఒక వ్యాఖ్యాత 'ఈ దేశాన్ని అంతర్యుద్ధం దిశగా నడిపిస్తున్నామా' అని ప్రశ్నించాడు. ఏ లౌకిక తత్వాన్ని ఇరుసుగా సుప్రీంకోర్టు పరిగణించిందో తిరిగి అదే ఇరుసును నిలబెట్టాల్సిన పూర్తి బాధ్యత సుప్రీంకోర్టు మీదే ఉన్నది.

ఈ మధ్యకాలంలో కార్యనిర్వాహక వర్గానికి, న్యాయవ్యవస్థకు మధ్యన ఆత్మీయ బంధం చిగురిస్తోంది. న్యాయవ్యవస్థ స్వయం ప్రతిపత్తి నిలబెట్టుకోవడం కోసం కార్యనిర్వాహక వ్యవస్థతో దూరం పాటించాలనే ఉదాత్త లక్ష్యాన్ని మనక బార్చేస్తున్నారు. ఇది ప్రజలకు ఎంత మాత్రం మేలు చేయదు. ఏది ఏమైనా రాజ్యాంగమే మనకు దిక్సూచి. కోర్టులు, మీడియా మరింత జాగరూకత పాటించక పోతే మితవాద ప్రభుత్వం రాజ్యాంగ మూల్యాంక విలువలను ఇసుక గూడుగా, సుప్రీంకోర్టు మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచే మరో దస్త్రంగా మార్చేస్తుంది. సుప్రీంకోర్టులో కూడా మితవాద పక్షం మొగ్గ తొడుగుతుంది. ఈ మధ్యనే పదవీ విరమణ చేసిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి హిందూత్వ, ఆర్థిక సరళీకరణల దత్తపుత్రుడిగా తేలిపోయాడు.

ఈ నూతన మితవాదపక్షాన్ని అహింసాయుత పద్ధతులలో, రాజ్యాంగ విలువలతో పూర్వపక్షం చేసే నూతన శక్తులు కూడా ఎదిగి వస్తున్నాయి. ఎ.కె.గోపాలన్ కేసు మొదలుకుని సమాజంలోను, కోర్టులలోనూ ఛాందసతత్వానికి వ్యతిరేకంగా ప్రతిఘటనా శక్తులు క్రమంగా పుంజుకుంటున్నాయి. రాజ్యాంగం చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. మహాత్మా గాంధీ నుండి ప్రేరణ పొందిన మార్టిన్ లూథర్ కింగ్ చెప్పినట్లు 'నైతిక లోకరీతి వొంపు సుదీర్ఘమైనది కాని అంతిమంగా అది న్యాయం వైపే మొగ్గి తీరుతుంది!'


**(అనువాదం: కె. సత్యరంజన్)**

# అధ్యయనమె ఆనందం

## (సామాజిక పరిశోధనా సంస్థ 'ట్రైకాంటినెంటల్' రచన)

"రష్యా అంతా చదువుకోవడం నేర్చుకుంటోంది. రాజకీయాలు, ఆర్థిక శాస్త్రం, చరిత్ర ఒకటేమిటి అన్ని రకాల గ్రంథాలను చదివేస్తోంది. ఎందుకంటే ప్రతి నగరంలోనూ, పట్టణాల్లోనూ ప్రజలు తెలుసుకోవాలన్న తృష్ణతో ఉన్నారు. ప్రతి రాజకీయ పార్టీకి తన స్వంత వార్తాపత్రిక ఉంది. కొన్ని సార్లు ఒక్కో పార్టీ చాలా పత్రికలు నడుపుతోంది. వేలాది సంస్థలు లక్షలాది కరపత్రాలను పంచుతున్నాయి. సైన్యంలో, గ్రామాల్లో, ఫాక్టరీల్లో, వీధుల్లో అన్ని చోట్లా కరపత్రాల పంపిణీ కొనసాగుతోంది. విప్లవం ముందుకు రావడంతో అనేక ఏళ్లుగా విద్యకు దూరమైన ప్రజల్లో విద్యకోసం తృష్ణ విస్ఫోటనం చెందింది. ఒక్క స్మోల్నీ ఇన్‌స్టిట్యూట్ నుండే మొదటి ఆరుమాసాల్లో ప్రతి రోజూ టన్నుల కొద్దీ, కార్లలో, ట్రయిన్లల్లో సాహిత్యం బట్వాడా అయ్యేది. ఒక రకంగా సాహిత్యంతో నేల ఖాళీలేకుండా నిండిపోయింది. వేడిమీద ఉన్న ఇసుక నీటిని ఎలా అయితే పీల్చుకుంటుందో రష్యా సాహిత్యాన్ని అలా స్వీకరించింది. అవన్నీ కల్పిత కథలేం కాదు, లేక వక్రీకరించిన చరిత్రో, మత ప్రవచనాలో, లేక ప్రజలను తప్పుత్రోవపట్టించే చౌకబారు నవలలు, కథలో కాదు. ఆ సాహిత్యమంతా సామాజిక, ఆర్థిక సిద్ధాంతాలు, తత్వశాస్త్ర గ్రంథాలు, టాల్‌స్టాయ్, గొగోల్, గోర్కి వంటి వారి రచనలు....". 1919లో ప్రఖ్యాత అమెరికన్ జర్నలిస్టు జాన్ రీడ్ రిసిన 'ప్రపంచాన్ని కుదిపేసిన ఆ పదిరోజులు' గ్రంథంలో చెప్పిన విషయాలివి.

అతి సామాన్యమైన శ్రామికజన విప్లవాలన్నీ కొత్త ప్రపంచాన్ని సృష్టించే ఆరాటంలో సమాజపు సంకెళ్లు తెంచుకుని ముందుకు నడిచినవే. ప్రతి విప్లవంలోనూ, అది నేరుగా సోషలిస్టు విప్లవం గానీయండి, లేక జాతీయ విమోచనోద్యమం గానీయండి, ప్రాచీన సామాజిక కట్టుబాట్లను తెంచుకుని సామాజిక న్యాయంతో కూడిన కొత్త రూపాలను సంతరించుకున్నవే. 20వ శతాబ్దంలో జరిగిన విప్లవాలన్నీ కార్మిక, కర్షకుల నాయకత్వంలో జరిగినవే (మెక్సికో,1910, చైనా, 1911, ఇరాన్, 1905-11, రష్యా, మధ్య ఆసియా,




1917) కాబట్టి అవన్నీ కూడా భూస్వామ్య వ్యవస్థ కట్టుబాట్లను ఎలా ఛేదించుకోవాలి అన్న అంశం మీద కేంద్రీకరించాయి. భూ రికార్డులను అర్థం కాని భాషలో రాయడం, అకౌంటు పుస్తకాలు, వడ్డీ వ్యాపారుల, పూజారుల పుస్తకాలను అందుబాటులో లేకుండా చేయడం ద్వారా రైతాంగాన్ని దగా చేసి అణచి వేశారు. రైతాంగానికి చదువు అందుబాటులో లేకుండా చేయడం ద్వారా వారిని శక్తి హీనులుగా మార్చారు. ప్రపంచంలోని పేద దేశాల్లో జరిగిన ప్రతి విప్లవంలోనూ పేద శ్రామిక ప్రజానీకం ఈ శక్తిని గురించి తెలుసుకున్నారు.

19వ శతాబ్దిలో ఈ దేశాలన్నిటిలో నెలకొని ఉన్న బూర్జువా సంస్కృతి చదవడం అనేది ఒక వర్గపు స్థాయిని సూచించే కొలబద్దగా మార్చుకున్నది. వ్యాపార పరమైన ముద్రణ కనుగొనడంతోబాటే పుస్తకాలు, వార్తా పత్రికలను అచ్చొత్తించడం విపరీతంగా పెరిగినప్పటికీ అవన్నీ బూర్జువాలూ, కొన్ని సందర్భాల్లో పెటీ బూర్జువాల కోసం మాత్రమే ఉద్దేశింపబడ్డాయి. మెక్సికోలో బెనిటో జువారెజ్ అధ్యడుగా ఉన్న కాలంలో (185872) పాఠశాలలూ, ప్రచురణాలయాలు విస్తరించినప్పటికీ ఒక వార్తాపత్రిక ధర ఒక సామాన్య కార్మికుని లేదా రైతు రోజువారీ సగటు వేతనం కన్నా చాలా అధికంగా ఉండేది. రష్యా, మెక్సికో వంటి దేశాల్లో భూస్వామ్య ప్రభుత్వాల హయాంలోగానీ లేక భారత, లేక ఆఫ్రికాలోని అనేక దేశాల్లో గానీ కార్మికులు, కర్షకులు చదువుకోడానికి నామమాత్రపు అవకాశాలు మాత్రమే ఉండేవి. ఈ దేశాల్లో ట్రేడ్ యూనియన్, కమ్యూనిస్టు ఉద్యమాలు ప్రారంభమైన తరువాత మాత్రమే వాటి సంస్థలు వార్తాపత్రికలను, కరపత్రాలను విస్తృతం గా ప్రచురించడం ప్రారంభించాయి. వీటిని కార్మికవర్గం, రైతాంగం చదవగలిగితే చదివేది లేకుంటే చదవ గలిగే కామ్రేడ్స్ వారికి చదివి వినిపించేవారు. ఇటువంటి సమిష్టి అధ్యయనమే తొలి సాహిత్య పాఠశాలగా అవతరించింది.


### మెక్సిలో విప్లవంలో

1910 మెక్సికో విప్లవ సమయంలో దేశంలోని కోటిన్నర మంది జనాభాలో కేవలం 22 శాతం మంది మాత్రమే అక్షరాశ్యులు. తరువాత 1920లో అల్వారో ఒబ్రెగాన్ అధ్యక్షునిగా ఎన్నికయ్యేవరకు దశాబ్ద కాలం పాటు దేశం తీవ్రమైన కల్లోలంలో మునిగి పోయింది. ఒబ్రెగాన్ అధికారంలోకి వచ్చాక ప్రజానుకూల సంస్కరణలు ప్రారంభించారు. గ్రామీణ పాఠశాలలను తెరవడం, టీచర్లకు శిక్షణ ఇవ్వడం, పబ్లిక్ లైబ్రరీలు, ఆర్ట్ స్కూల్స్ తెరవడం వంటి సాంస్కృతిక కార్యకలాపాల తోపాటు అప్పుడే చదువు ప్రారంభించిన వారికోసం కరపత్రాలు, పుస్తకాల ప్రచురణ ప్రారంభించారు. 1921లో జోస్ వాస్కోన్ సెలోస్‌ను విద్యాశాఖ మంత్రిగా నియమించడం తోపాటు ఆయనకు మెక్సికో సంస్కృతిని ప్రజాస్వామీకరించేందుకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు అధ్యక్షుడు ఒబ్రెగాన్. ఈ లక్ష్యం చేరుకోవడం కోసం ప్రభుత్వం వేలాది గ్రామీణ పాఠశాలలను, టీచర్ ట్రైనింగ్ సంస్థలను నిర్మించింది. గ్రామీణ పాఠశాలల ఉపాధ్యాయుల వేతనాలను రోజుకు ఒకటి నుండి మూడు పెసోలకు (పెసో అనేది మెక్సికన్ కరెన్సీ) పెంచారు. ఈ పనులన్నీ చేయడం కోసం విద్యాశాఖ మంత్రి మెక్సికో కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలు ఎలీనా టోర్రెస్ క్యూల్లర్ సహాయం తీసుకున్నారు. ఆమె ఈ సాంస్కృతిక కేంద్రాలను మెక్సికో దేశమంతటా విస్తరించారు. ఒక్క దశాబ్దంలోనే నాలుగు వేల మంది టీచర్లకు శిక్షణ ఇప్పించారు. అప్పట్లోనే ఆమె విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టి లక్షలాది మంది విద్యార్థులకు పాఠశాలల్లోనే భోజనాలు ఏర్పాటు చేశారు.

> **"సామాజిక న్యాయాన్ని సాధించడం, ప్రజల విజ్ఞానాన్ని పెంచేందుకు విద్యను ఒక పనిముట్టుగా ఉపయోగించుకోవాలన్న లక్ష్యంతో 2008లో మెక్సికో జాతీయ పుస్తక పఠన ప్రోత్సాహక కార్యక్రమం క్రింద "మెక్సికో చదువుతోంది" అన్ని కార్యక్రమాన్ని ప్రారంభించారు. మెక్సిలో సాహిత్య పఠనా కార్యక్రమాల చరిత్రనూ, క్యూబా విప్లవంలో సాగిన "అవును నేను సాధించగలను" అనే వయోజన విద్యా కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని మెక్సికో ప్రభుత్వం "మెక్సికో చదువుతోంది" కార్యక్ర మాన్ని చేపట్టింది."**

వెస్కోన్‌సెలోస్ నాయకత్వంలో విద్యాశాఖ గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన లైబ్రరీలు ప్రారంభించడానికి నడుం కట్టారు. ఈ క్రమంలో విద్యాశాఖ లైబ్రరీలను నిర్మించడానికి నిధులు విడుదల చేయడమే కాకుండా అది పిల్లలు, పెద్దలు చదువుకోడానికీ, వారికి (గ్రామీణ లైబ్రరీల్లో యాభై పుస్తకాలు, పట్టణ కేంద్రాల్లో వెయ్యిపుస్తకాలు) పంచడానికి పుస్తకాలు ముద్రించింది. గ్రామీణ రైతాంగం సాంస్కృతిక జీవనం మెరుగుపడ్డంతోపాటు వారి విజ్ఞానాన్ని పెంచడం కోసం విప్లవ ప్రభుత్వం ఇటువంటి చర్యలు తీసుకున్నది. ఈ పుస్తకాల్లో గ్రీకు శాస్త్రీయ గ్రంథాలతోపాటు మెక్సికో చరిత్ర, గృహ నిర్వహణ, వ్యవసాయ విజ్ఞానం తదితర అంశాలుండేవి. విద్యాశాఖ టీచర్లకు కూడా "ఎల్ మీస్ట్రో" (టీచర్) అనే ఒక మ్యాగజైన్ ప్రచురించేది. అందులో విద్యాబోధనా పద్ధతులు, విద్యలో కొత్తకొత్త ఆలోచనలు, పుస్తక సమీక్షలు వంటివి ఉండేవి. ప్రభుత్వం తీసుకున్న ఈ చొరవతోపాటు, 1934లో ఎకనామిక్స్ విద్యార్థులకు పుస్తకాలు పంచడం కోసం ప్రముఖ సామాజికవేత్త డేనియల్ కోసియో విల్లెగాస్ నేషనల్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఒక ఎకనామిక్స్ కల్చర్ నిధిని ఏర్పాటు చేశారు. ఈ నేషనల్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ఇప్పుడు 'స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ఆఫ్ నేషనల్ అటోనమస్ యూనివర్సిటీ ఆఫ్ మెక్సికో'గా రూపాంతరం చెందింది. ఈ సంస్థ తొలుత ఎకనామిక్స్ విద్యార్థులకు పుస్తకాలు పంచడం కోసం ప్రారంభమై తరువాతి కాలంలో మొత్తం లాటిన్ అమెరికా అంతటికీ పుస్తకాలు సరఫరా చేసే స్థాయికి ఎదిగింది.

మెక్సికన్ విప్లవం సంస్థాగతమైపోయి, దాని వర్గ లక్షణం మారిపోవడంతో సంస్కృతిని ప్రజాస్వామీకరించే పనిపై కేంద్రీకరణ తగ్గిపోయింది. శీఘ్రంగా పెరిగిన అక్షరాశ్యత కాస్తా 70 శాతం దగ్గర ఆగిపోయింది. ప్రభుత్వ విద్యావ్యవస్థ, ప్రభుత్వ లైబ్రరీ వ్యవస్థలు




సాహిత్యం నాణ్యతను మరింత ముందుకు తీసుకుపోలేకపోయాయి. 1982 మెక్సికన్ రుణ సంక్షోభానికి దారితీయడానికి ముందు దేశంలో ఆర్థిక పరిస్థితులనుండి వచ్చిన ఒత్తిళ్ల వల్ల పాఠశాల విద్యకూ, లైబ్రరీలకూ నిధులు గణనీయంగా తగ్గిపోయాయి. మెక్సికో పాలకులు నయా-ఉదారవాదాన్ని అనుసరించడం ప్రారంభించడంతోనూ, దేశంలో ఏర్పడిన ఇతర పరిస్థితుల వల్లనూ సాహిత్యం మీద కేంద్రీకరణ తగ్గిపోయింది. 1986లో లైబ్రరీల జనరల్ డైరక్టరేట్ "లైబ్రరీల్లో నా వేసవి శెలవులు" అనే కార్యక్రమం ప్రారంభించింది. ఈ కార్యక్రమం వల్ల పది లక్షల మంది పిల్లలు, యువజనులు లైబ్రరీలు దర్శించి, అనేక సాహిత్య కార్యక్రమాల్లో పాల్గన్నారు. ఈ కార్యక్రమం క్రింద మెక్సిలో లైబ్రరీల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీతం, కథలు చెప్పే (స్టోరీ టెల్లింగ్) ఉత్సవాలు నడుస్తాయి. 1993లో దేశంలో పాఠ్యాంశాల మార్పులో భాగంగా 1995లో విద్యా రంగంలో సంస్కరణలు తెచ్చారు. అందులో భాగంగా విద్యాశాఖ జాతీయ పఠనా కార్యక్రమాన్ని రూపొందించింది. తరువాత 2000 సంవత్సరంలో ఈ కార్యక్రమానికి 'పాఠకుల దేశం' అనే పేరు పెట్టారు. ఈ కార్యక్రమం క్రింత ఏటా దేశంలోని పాఠశాలలు, లైబ్రరీలలో పంచడం కోసం 75 పుస్తకాలు ఎంపిక చేస్తారు.

సామాజిక న్యాయాన్ని సాధించడం, ప్రజల విజ్ఞానాన్ని పెంచేందుకు విద్యను ఒక పనిముట్టుగా ఉపయోగించుకోవాలన్న లక్ష్యంతో 2008లో మెక్సికో జాతీయ పుస్తక పఠన ప్రోత్సాహక కార్యక్రమం క్రింద "మెక్సికో చదువుతోంది" అన్ని కార్యక్రమాన్ని ప్రారంభించారు. మెక్సిలో సాహిత్య పఠనా కార్యక్రమాల చరిత్రనూ, క్యూబా విప్లవంలో సాగిన "అవును నేను సాధించగలను" అనే వయోజన విద్యా కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని మెక్సికో ప్రభుత్వం "మెక్సికో చదువుతోంది" కార్యక్రమాన్ని చేపట్టింది. లాటిన్ అమెరికా అంతటా ఇది పెద్ద ప్రభావం చూపించింది. 2009లో మెక్సికోకు చెందిన ఎకనామిక్ కల్చర్ ఫండ్ డైరెక్టర్ పాకో ఇగ్నాసియో టాయ్‌బో, అతనితోపాటు ప్రముఖ రచయిత పాలోమా సైజ్ టెజెరోలు కలిసి "బ్రిగాడపరా లీరెన్ లిబెర్టాడ్" అనే సంస్థను స్థాపించారు. ఇది పుస్తకాలను ఆన్‌లైన్‌లో పెడుతుంది. ప్రజలు వాటిని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. లేదంటే బుక్ ఫెయిర్‌లు, సాంస్కృతిక ఉత్సవాల్లో ఆయా పుస్తకాలను పొందవచ్చును. 'అధ్యయనమే ఆనందం" అనేది తమ నినాదం అని పాలోమా సైజ్ టెజెరో చెప్పారు.

"నీకు మామూలుగా రాని అనేక ఆలోచనలు, విజ్ఞానం పుస్తక పఠనం వల్ల వస్తుంది. అది నిన్ను మరింత విమర్శనాత్మకంగా ఆలోచించగలిగేట్లు చేస్తుంది. నీ జీవితంలో ప్రతిరోజూ నిన్ను నీవు రక్షించుకోగలిగేట్లు చేస్తుంది. పుస్తక పఠనం నిన్ను మరింత అందంగా, ధనవంతునిగా చేయకపోవచ్చు. ఫలానా పుస్తకం చదివితే నీ జీవితంలో ఫలానా మేలు జరుగుతుంది అని ఎవరైనా అంటే అవన్నీ అబద్ధాలే. అలా ఏం జరగదు. దాని వల్ల నీవు విజ్ఞానిగా కూడా మారకపోవచ్చు. కానీ నీవు ఒక పని ఎందుకు చేయాలి, ఎందుకు చేయకూడదు అన్న విషయంలో స్పష్టత మాత్రం ఇస్తాయి." అని ఆయన వివరించాడు.


### చైనా ప్రజలు తలెత్తుకోడానికి చదువు తోడ్పడింది

1911లో తిరుగుబాటుద్వారా చైనాలో క్వింగ్ రాజరికాన్ని కూలదోయడానికి ముందు ఆ దేశ జనాభాలో అత్యధిక భాగం ముఖ్యంగా మహిళలు నిరక్షరాశ్యతతో బాధపడేవారు. 20వ శతాబ్దం ప్రారంభంలో అక్కడ అక్షరాశ్యత కేవలం 10 నుండి 15 శాతం మాత్రమే ఉండేది. 1949లో చైనాలో విప్లవం వచ్చే వరకు అక్కడ అక్షరాశ్యత పరిస్థితిలో పెద్దగా మార్పులేదు. విప్లవానంతరం 1950వ దశకంలో మాత్రమే అక్షరాశ్యత ఉరుకులు పరుగులతో అభివృద్ధి చెందింది. 1959 నాటికి అది 57 శాతానికి పెరిగింది. 2021 నాటికి చైనాలో వయోజన విద్యా రేటు 97 శాతానికి పెరిగింది. ప్రపంచంలోనే అత్యధిక అక్షరాశ్యతల్లో ఇది ఒకటి. గత ఏడు దశాబ్దాల్లో చైనా అక్షరాశ్యతలో సాధించిన విజయాన్ని "మానవ జాతి చరిత్రలోనే ఏకైక మహత్తర విద్యా కృషి" గా పేర్కొంటారు.

1949లో విప్లవం సాధించిన వెంటనే చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రజలను విద్యావంతులను చేయడానికి తీసుకున్న చొరవే ఈ విజయాలకు కారణం. దానికి ముందు జియాంగ్సి సోవియట్ (1931-34)లోనూ, యనాన్ సోవియట్ (1936-48) లోనూ గ్రామీణ ప్రజలను, వయోజనులను విద్యావంతులను గావించడానికి చేపట్టిన ప్రయోగాత్మక కార్యక్రమాల అనుభవాల ఆధారంగా విప్లవ ప్రభుత్వం దేశమంతటా అక్షరాశ్యతా కార్యక్రమం చేపట్టింది. "అక్షరాశ్యతను రూపుమాపకపోతే అభివృద్ధి లేదు" అని సోవియట్ నేత వి.ఐ. లెనిన్ ఇచ్చిన పిలుపు మేరకు సోవియట్ యూనియన్‌లో చేపట్టిన అక్షరాశ్యతా కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని చైనాలో కూడా ప్రజల్లో నిరక్షరాశ్యతా నిర్మూలన కార్యక్రమాన్ని విప్లవ ప్రభుత్వం చేపట్టింది. కమ్యూనిస్టు చైనా చేపట్టిన మొత్తం అక్షరాశ్యతా కార్యక్రమాన్ని ఒక్క చోట చేర్చి వివరించడం కష్టతరమే అయినా మూడు అంశాలను మాత్రం చెప్పుకోవాలి.

1. చైనీస్ భాషలో ఒక లక్ష అక్షరాలుంటాయి. ప్రజలను అక్షరాశ్యులుగా మార్చడానికి ఇదో పెద్ద అడ్డంకి. 1955లో చైనా ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించడానికి "చైనా రాతపూర్వక భాషను సంస్కరించే కమిటీ"ని ఏర్పాటు చేసింది. ఇది అక్షరాలను లక్ష నుండి తగ్గించి గ్రామీణ ప్రాంత వాసులకు 1,500కు పట్టణ వాసులకు 2,000కు కుదించింది. కనీస చదువుకు ఈ అక్షరాలు నేర్చుకోవాలని సూచించింది. 1958 నుండి ఈ సరళీకృత అక్షరాలను ఉపయోగించడం ప్రారంభించారు.

**"ఇటువంటి కృషి వల్ల చైనా నిరక్షరాశ్యతను నిర్మూలించ గలిగింది. కానీ ఇప్పుడది కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. యువకులు, పిల్లలు టీవీ, వీడియో స్క్రీన్లకు అతుక్కుపోతున్నారు. 2021లో అధ్యక్షుడు సి జిన్‌పింగ్ పిల్లలు వారా నికి మూడు గంటలు మాత్రమే వీడియో గేమ్‌లు ఆడడానికి అనుమతివ్వాలని ప్రకటించారు. తల్లితండ్రులు, వీడియో గేమ్స్ పరిశ్రమ భాగాస్వా మ్యంతో దీన్ని అమలు పరచాలని కోరారు."**



వివిధ దేశాల్లో ఫిబ్రవరి 21 రెడ్ బుక్ డే సందర్భంగా కమ్యూనిస్టుల ప్రణాళిక పఠనం

మెక్సికో, రష్యాల్లో మాదిరిగానే చైనా విప్లవం కూడా గ్రామీణ, వయోజన విద్యపై కేంద్రీకరించింది. పెద్దలు చదువుమీద కేంద్రీకరించకపోతే పిల్లల్లో 'అధ్యయనమె ఆనందం' అన్న భావన సృష్టించడం సాధ్యం కాదు. అక్షరాలు నేర్చుకోవడమే చదువుకాదు, అక్షరాశ్యత అనేది గ్రామీణ ప్రజల జీవితాలు మెరుగుపరిచేదిగా, వారి ఉత్పాదకను మెరుగుపరిచేదిగా ఉండాలి అని చైనా నిరక్షరాశ్యతా నిర్మూలన కార్యక్రమంలో ప్రధాన నాయకుడైన లిన్ హాండా 1955లో పేర్కొన్నారు. దానికను గుణంగానే "నేర్చుకోవడం వర్తింపజేయడం కోసమే'' (లెర్నింగ్ ఫర్ అప్లయింగ్), ''ప్రాక్టికల్‌తో అనుసంధానించడం" అనే సూత్రాలతో చదువులను పెంపొందించారు.

3. చివరిది, చైనా విప్లవం అక్షరాశ్యతా కార్యక్రమంలో ప్రభుత్వ లైబ్రరీలకు పెద్ద పీట వేసింది. 1949లో చైనా మొత్తంగా కేవలం 55 ప్రభుత్వ లైబ్రరీలుండేవి. విద్యను ప్రజాస్వామీకరించే కృషిలో భాగంగా విప్లవ చైనా ప్రభుత్వం గ్రామీణుల కోసం గ్రామీల్లోనూ, కార్మికులకోసం ఫాక్టరీల్లోనూ ప్రభుత్వ లైబ్రరీలు నిర్మించింది. 1956 నాటికి గ్రామాల్లోనే 1,86,960 లైబ్రరీలు నిర్మించింది.

ఇటువంటి కృషి వల్ల చైనా నిరక్షరాశ్యతను నిర్మూలించగలిగింది. కానీ ఇప్పుడు చైనా కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. యువకులు, పిల్లలు టివీ, వీడియో స్క్రీన్లకు అతుక్కు పోతున్నారు. 2021లో అధ్యక్షుడు సి జిన్‌పింగ్ పిల్లలు వారానికి మూడు గంటలు మాత్రమే వీడియో గేమ్‌లు ఆడడానికి అనుమతివ్వాలని ప్రకటించారు. తల్లితండ్రులు, వీడియో గేమ్స్ పరిశ్రమ భాగాస్వామ్యంతో దీన్ని అమలు పరచాలని కోరారు. 2022లో ఆయన "పఠనంపై తొలి జాతీయ మహాసభ"ను ప్రారంభిస్తూ పఠనం అనేది కేవలం విజ్ఞానాన్ని పొందడానికి మాత్రమే కాదు, విజ్ఞతను పెంపొందించుకునేందుకూ, ఉన్నత మానవ విలువలను నేర్పించేందుకు కూడా అవసరం అని పేర్కొన్నారు.

"చైనా ప్రజలు ప్రాచీన కాలం నుండి పఠనానికీ, జ్ఞాన సముపార్జనకూ ప్రాధాన్యత నిచ్చారు. ప్రకృతిని అధ్యయనం చేయడం, నిబద్దతతో ఆలోచించడం ద్వారా మన జ్ఞానాన్ని సరిదిద్దుకోవడం ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవాలని చెప్పారు. ఈ ప్రాచీన స్ఫూర్తిని కొనసాగిస్తూ తమ సంస్కారాన్ని పెంపొందించుకోడానికీ, ఆత్మస్థైర్యాన్ని, స్వావలంబననూ పెంచుకోడానికీ చైనా ప్రజలకు నేడు పఠనం అనేది ఎంతగానో ఉపయోగపడుతుంది.

"పఠనంలోనూ, విజ్ఞానాన్ని పెంచుకోవడంలోనూ పార్టీ సభ్యులు, అధికారులు ముందుండి ప్రజలను నడిపించాలని వానికి కోరుతున్నాను. మన పిల్లలంతా పుస్తకాలు చదవడాన్ని ఒక అలవాటుగా మార్చుకుని, చదవడంలో ఆనందం పొందుతూ, మంచి ఆరోగ్యవంతమైన పద్ధతిలో ఎదగాలని కోరుకుంటున్నాను" అని పార్టీ ప్రధానకార్య దర్శి, దేశాధ్యక్షుడైన సి జిన్‌పింగ్ పిలుపు నిచ్చారు.

అదే సంవత్సరం షాంఘై లైబ్రరీ (తూర్పు బ్రాంచి)ని ప్రజల కోసం తెరిచారు. షాంఘై

"1920 దశకంలో బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా జరిగిన జాతీయోద్య మంలో అక్షరాశ్యత ఒక పెద్ద ఎజెండాగా ఉండేది. అక్షరాశ్యత ఉద్యమంలో ప్రజాలైబ్రరీలు అనేవి ఒక సాధనంగా మారాయి. బ్రిటిష్ ఇండియాలో కూడా ఉదారవాద రాచరికాలు పలించే సంస్థానాల్లో (ఉదాహరణకు, బరోడా నేటి వడోదర సంస్థానం) అక్షరాశ్యత పెంపుదలకు ప్రాధాన్యత నిచ్చారు."

పుడాంగ్ జిల్లా సెంచరీ పార్కుకు ఎదురు రోడ్డులో ఉన్న ఈ లైబ్రరీని ప్రతిరోజూ వేలాది మంది సందర్శిస్తున్నారు. ముఖ్యంగా ఆదివారం సాయంత్రం వేళల్లో ఇది ప్రజలతో క్రిక్కిరిసి పోతుంది. ఈ సమయంలో చాలా వర్ధమాన దేశాల్లో పిల్లలు పార్కుల్లో ఆడుకోవడం చూస్తుంటాం. ధనిక దేశాల్లో ఈ సమయంలో పిల్లలు సెల్‌ఫోన్ స్క్రీన్లకు కళ్లు అప్పగించేస్తుంటారు. కానీ షాంఘైలో ఆ సమయంలో పిల్లలు పుస్తకాలు ముందేసుకుని, చాలా మంది తమ తండ్రులు, తల్లుల లేక తాతలు, నాయనమ్మలు, అమ్మమ్మల ఒళ్లో కూర్చుని పుస్తకాలు తిరగేస్తుంటారు.

ఈ లైబ్రరీలో కొద్ది భాగాన్ని మార్క్సిస్టు సాహిత్యానికి కేటాయించారు. షెల్ఫ్‌లను ఒక క్రమపద్ధతిలో ఏర్పాటు చేశారు. కారల్ మార్క్స్‌ఫ్రెడరిక్ ఏంగెల్స్, మావో జెడాంగ్, డెంగ్ సియావో పింగ్, సి జిన్‌పింగ్ ఇలా. ఈ లైబ్రరీలో అన్నిటికన్నా గుర్తుండిపోయే భాగం పిల్లల విభాగం. అనేక వరుసలుగా రంగురంగుల పిల్లల పుస్తకాలుంటాయి, వాటి ముందు టేబుల్స్, రీడింగ్ బూత్స్, సోఫాలు ఉంటాయి. అవన్నీ పిల్లలను చదువుకోడానిక రారమ్మని ఆహ్వానిస్తుంటాయి. ఇక్కడ ప్రజలు – పిల్లలు, పెద్దలు కూడా చదువుకోడానికి (మానవ హక్కుల ప్రకటన 1948లోని 26 అధికరణం ప్రకారం) తమకు గల హక్కును వినియోగించుకుంటుంటారు. ఈ పద్ధతిలో చదువుకోవడం వల్ల ప్రజల్లో ముఖ్యంగా పిల్లల్లోనూ, యువతలోనూ జ్ఞానతృష్ణ పెరుగుతుంది. ప్రజలకు తమ చరిత్రతోనూ, సంస్కృతితోనూ, భాషతోనూ, పూర్వీకులు వారి కృషితోనూ సంబంధాన్ని పెనవేస్తుంది.

**కేరళలో గ్రంథ సుగంధాలు**

మన దేశంలో సిపిఐ(ఎం) నేతృత్వంలోని వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) పరిపాలిస్తున్న కేరళ రాష్ట్రంలో జనాభా 3.34 కోట్లు. మనం కేరళలోని ఏ పట్టణానికి, ఏ నగరానికి వెళ్లినా ప్రభుత్వ లైబ్రరీలు ప్రజల రాకపోకలతోనూ, పుస్తకాలు తీసుకుంటూ, చదువుతూ ఉండే వారితోనూ తొణికిసలాడుతూ ఉంటాయి. రాష్ట్రంలో 9,000 ప్రభుత్వ లైబ్రరీలున్నాయి. కమ్యూనిస్టు ఉద్యమం ఈ రాష్ట్రంలో బలంగా వేళ్లూని కుని ఉండడం వల్ల ఇక్కడి ప్రజల్లో పుస్తక పఠన సంస్కృతి ఎక్కడ చూసినా కనిపిస్తుంది.

1920 దశకంలో బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా జరిగిన జాతీయోద్య మంలో అక్షరాశ్యత ఒక పెద్ద ఎజెండాగా ఉండేది. అక్షరాశ్యత ఉద్యమంలో ప్రజాలైబ్రరీలు అనేవి ఒక సాధనంగా మారాయి. బ్రిటిష్ ఇండియాలో కూడా ఉదారవాద రాచరికాలు పలించే సంస్థానాల్లో (ఉదాహరణకు, బరోడా నేటి వడోదర సంస్థానం) అక్షరాశ్యత పెంపుదలకు ప్రాధాన్యత నిచ్చారు.

భారత దేశంలోని గ్రంథాలయోద్యమ వ్యవస్థాపకుల్లో చాలా మంది తొలుత తమ ఇళ్లనే గ్రంథాలయాలుగా మార్చి ప్రజల్లో పఠనాశక్తి పెంచారు. కేరళలో గ్రంథాలయోద్యమానికి ఆద్యుడైన ఎన్. పనిక్కర్ తన ఇంటిలో వేసుకున్న పుస్తకాలు, వార్తాపత్రికలను తొలుత కొద్ది మంది నిరక్షరాశ్యులైన ధనికులకు బిగ్గరగా చదివి వినిపించేవారు. క్రమంగా పుస్తకాలు, పత్రికలను ఒక చిన్న గదిలో ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగానూ, అద్దెకు ఇచ్చేవారు. ఆవిధంగా తాను కేరళలో తొలి గ్రంథాలయాన్ని స్థాపించానని ఆయనే గతాన్ని జ్ఞాపకం చేసుకుంటూ ఒక సందర్భంలో చెప్పారు. ఇలాంటి వారెందరో తరువాతి కాలంలో స్వంత ఖర్చులతో గ్రంథాలయాలు స్థాపించారు. ఆ తరువాత అవన్నీ ప్రభుత్వ గ్రంథాలయ వ్యవస్థలో భాగం అయిపోయాయి.

కేరళలో గ్రంథాలయోద్యమం ఇప్పటికీ చురుకుగా పనిచేస్తూ ప్రజల్లో పఠనాశక్తి పెంచడానికీ, విజ్ఞాన సముపార్జనకూ సజీవ సాధనంగా కొనసాగుతోంది. ఇటీవలి కరోనా మహమ్మారి సమయంలో రాష్ట్రంలో ప్రజల మధ్య సంబంధాలు కొనసాగించడానికీ, విద్యార్థుల చదువు ఆగిపోకుండా కొనసాగించడానికీ వామపక్ష ప్రభుత్వం గ్రంథాలయాలను ఎంతగానో ఉపయోగించుకుంది.

**తెలుగు నేలపై**

నిజానికి కేరళలోనే కాదు ఆంధ్ర ప్రదేశ్‌తో సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో జాతీయోద్య మంలో భాగంగా గ్రంథాయాలు ఈ విధంగానే ప్రారంభమయి. అవి జాతీయోద్యమానికి ఊపు తీసుకురావడమే కాకుండా దేశంలో నిరక్షరాశ్యతా నిర్మూలనకు తోడ్పడ్డాయి. మన రాష్ట్రంలో అక్షరాశ్యత సాధించడం, జాతీయోద్యమానికీ అందులో భాగంగా తెలుగు భాషా వికాసానికీ తోడ్పడ్డం మొదలైన లక్ష్యాలతో గ్రంథాలయోద్యమం ప్రారంభించబడింది. అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, కళాప్రపూర్ణ పాతూరి నాగభూషణం తదితరులు గ్రంథాలయోద్యమ వ్యవస్థాపకులూ, మార్గదర్శకులు. భారతదేశంలోనే మొట్ట మొదటి గ్రంథాలయ సంఘం 1914 లో విజయవాడ (నాటి బెజవాడ)లో స్థాపించబడింది. 1915 లో మొదటగా 'ఆంధ్ర గ్రంథాలయాల సూచికను' సంకలనం చేసి ప్రచురించింది. గ్రంథాలయోద్యమాన్ని ప్రజలలోకి తీసుకువెళ్ళే ఉద్దేశంతో స్థానిక గ్రంథాలయ పత్రిక. "గ్రంథాలయ సర్వస్వం"ను తెలుగులో సంఘం 1915 లో ప్రారంభించింది. ఈ ప్రాంతీయ భాషా పత్రిక భారతదేశంలోనే మొట్టమొదటి స్థానిక గ్రంథాలయ పత్రిక. భారతదేశంలోనే మొదటి ఆంగ్ల గ్రంథాలయ పత్రికను ప్రచురించింది. ప్రజలలో గ్రంథాలయోద్యమం గురించిన అవగాహన పెంపొందించుటకు సంఘం తీర్థయాత్రలను నిర్వహించింది ప్రజలలో అవగాహన, జ్ఞానాన్ని వ్యాప్తి చేయడానికి ప్రపంచంలోనే మొట్టమొదటగా బోటు గ్రంథాలయాల సేవలను ప్రవేశపెట్టింది.

రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమం గ్రామగ్రామాన గ్రంథాలయాలను స్థాపించి వయోజనుల్లో పఠనాశక్తినీ, విజ్ఞాన సముపార్జననూ పెంపొందించడానికి కృషి చేసింది. అటు జాతీయోద్యమంతోపాటు అందులో భాగంగా, సంస్కరణోద్యమం, ఆంధ్ర జాతి ఐక్యత, తెలుగు భాషా వికాసాలకోసం గ్రంథాలయోద్యమం ఎంతగానో తోడ్పడింది.

**రెడ్‌బుక్ డే**

2019 ఫిబ్రవరి 21 నాడు భారత దేశంలోని సిపిఐ(ఎం) అనుబంధ వామపక్ష ప్రచురణ సంఘాలతో కూడిన 'ఇండియన్ సొసైటీ ఫర్ లెఫ్ట్ పబ్లిషర్స్" ప్రారంభించిన ఒక కార్యక్రమం నేడు ప్రపంచ వ్యాపితంగా

"రెడ్ బుక్ డే"గా స్థిరపడింది. "కమ్యూనిస్టు ప్రణాళిక" 171వ వార్షికోత్సవం, అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమం లక్ష్యం లౌకిక, సాంస్కృతిక, సోషలిసు భావజాలం ఆధారంగా సమిష్టి తత్వాన్ని రక్షించడం. రెడ్ బుక్ డే అతి వేగంగా అంతర్జాతీయ ప్రచురణ కర్తల దృష్టిని ఆకర్షించింది. 2020 సంవత్సరం వచ్చే సరికి దక్షిణ కొరియా నుండి క్యూబా వరకు అనేక దేశాలకు చెందిన 30,000 మంది ఈ కార్యక్రమంలో పాల్గనడం ప్రారంభించారు. 2024 రెడ్ బుక్ డే కార్యక్రమంలో ప్రపంచ వ్యాపితంగా ఇండోనేషియా నుండి చిలీ వరకు పది లక్షల మంది ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గన్నారు. (వీరిలో అయిదు లక్షల మంది కేరళలో పాల్గన్నారు)

2020లో రెడ్ బుక్ డే కార్యక్రమాన్ని తొలిసారిగా భారత దేశ సరిహద్దులు దాటి విస్తరించడం జరిగింది. ఆ ఏడాది తమిళ నాడులోని పట్టణాలు, చిన్న చిన్న పల్లెల్లో కూడా రైతు సంఘాలు, ట్రేడ్ యూనియన్ల సభ్యులు గ్రామ, పట్టణ కూడళ్లలో గుండ్రంగా కుర్చీలు వేసుకు కూర్చుని "కమ్యూనిస్టు ప్రణాళిక" చదివారు. బ్రెజిల్‌లో కార్నివాల్ ఉత్సవాల సందర్భంగా వ్యవసాయ కూలీ ఉద్యమ (ఎంఎస్‌టి) సభ్యులు ఒక చోట కూర్చుని ఒకరి తరువాత ఒకరు బిగ్గరగా చదవడం ప్రారంభించారు. నేపాల్ పర్వత ప్రాంతాల్లో వ్యవసాయ కూలీ సంఘం సభ్యులు తమ స్వంత రెడ్ బుక్స్‌పై చర్చించగా, టాంజానియా లోని భూమి లేని పేదలు అక్షరాశ్యత ప్రాధాన్యత గురించి చర్చించారు.

నాగులుగేళ్ల తరువాత 2024లో క్యూబా రాజధాని హవానాలో జరిగిన పది రోజుల హవానా బుక్ ఫెస్టివల్‌లో ఫిబ్రవరి 21 నాడు రెడ్ బుక్ డే ప్రత్యేక కార్యక్రమంగా నిర్వహించారు. కేరళలో చెమ్ పార్వతి అనే అమ్మాయి ఒక "రెడ్ బుక్ డే వీడియో" రూపొందించి తిరువనంతపురం మార్కెట్‌లలోనూ, వర్క్ షాపుల దగ్గర తన డ్యాన్సును ప్రదర్శించారు. అంతర్జాతీయ కార్మిక గీతం ఫ్రెంచ్ వెర్షన్‌కు అనుగుణంగా ఆమె నృత్య ప్రదర్శన చేశారు. ఆ నృత్య ప్రదర్శన చివరికి చెమ్మీ పార్వతి సముద్రపుటడ్డున, ఎర్రని ఉదయించే సూర్యుని బ్యాక్ గ్రౌండ్‌లో కమ్యూనిస్టు పతాకాన్ని చేపట్టడంతో ముగుస్తుంది. ఈమె నిర్మించిన వీడియోతోపాటు ప్రపంచం నలుమూలల నుండి రెడ్ బుక్ డే ను కొనియాడుతూ కళాకారులు వేసిన డిజైన్స్ వచ్చాయి. ఆయా దేశాల్లోని ప్రజలు తమతమ ప్రదేశాల్లో ఉమ్మడి

**❝ 2020లో రెడ్ బుక్ డేను అంతర్జాతీ యంగా నిర్వహించడానికి సన్నాహాల్లో భాగం గా ఇండియన్ సొసైటీ ఆఫ్ లెఫ్ట పబ్లిషర్స్ (ఐఎస్ఎల్‌పి) ప్రపంచంలోని వామపక్షప్రచురణ కర్తలలో అనేక సమావేశాలు నిర్వహించింది. ఈ సమావేశాల ఫలితంగా అంతర్జాతీయ యూనియన్ ఆఫ్ లెఫ్ట్ పబ్లిషర్స్ (ఐయుఎల్‌పి) ఏర్పడింది. ఇప్పడు ఈ సంస్థలో 45 ప్రచురణ సంస్థలున్నాయి. ❞**



రెడ్ బుక్ డే సందర్భంగా గ్రంథాలయాల్లో సామూహిక పఠనం

పఠనం చేసేట్లు ప్రోత్సహిస్తూ కళాకారులు చిత్రాలు వేశారు.

2020లో రెడ్ బుక్ డేను అంతర్జాతీయంగా నిర్వహించడానికి సన్నాహాల్లో భాగం గా ఇండియన్ సొసైటీ ఆఫ్ లెఫ్ట పబ్లిషర్స్ (ఐఎస్ఎల్‌పి) ప్రపంచంలోని వామపక్ష ప్రచురణ కర్తలలో అనేక సమావేశాలు నిర్వహించింది. ఈ సమావేశాల ఫలితంగా అంతర్జాతీయ యూనియన్ ఆఫ్ లెఫ్ట్ పబ్లిషర్స్ (ఐయుఎల్‌పి) ఏర్పడింది. ఇప్పుడు ఈ సంస్థలో 45 ప్రచురణ సంస్థలున్నాయి. ఐయుఎల్‌పి అనేది కేవలం రెడ్ బుక్స్ డే నిర్వహిణ, ప్రోత్సాహం కోసం మాత్రమే కాకుండా మితవాద శక్తు దాడులనుండి వామపక్ష ప్రచురణ కర్తలను రక్షించడం, హేతావాద, సోషలిస్టు భావజాలాన్ని విస్తరింపజేయడం అనే లక్ష్యాలు కూడా పెట్టుకుంది. ఐయుఎల్‌పి ప్రచురణ కర్తలందరితో కలిసి అనేక పుస్తకాలను సంయుక్తంగా ప్రచురించింది. ఒకేరకమైన పుస్తకాన్ని ఏక కాలంలో అనేక భాషల్లో రుమేనియా నుండి ఇండోనేషియా వరకు ప్రచురించింది. వీటిలో చే గువేరా మీద, ప్యారిస్ కమ్యూన్ మీద ప్రచురించన పుస్తకాలున్నాయి. రచయితలు, ప్రచురణ కర్తలపై దాడులు జరిగినప్పుడు వారికి మద్దతుగా ప్రకటనలు ఇచ్చింది.

కేరళ లైబ్రరీ ఉద్యమం రెడ్ బుక్ డె కార్యక్రమంలో పాల్గంటున్నది. రాష్ట్ర మంతటా ప్రభుత్వ లైబ్రరీల వద్ద ఆ రోజున గ్రంథ పఠనం చేయడమే కాదు, పాటలు పాడ్డం, నాటికలు వేయగం వల్ల లక్షలాది మంది ప్రజలు హేతువాద, సోషలిస్టు స్ఫూర్తిని పొందుతున్నారు.

రెడ్ బుక్ డే అనేది ఒక విస్తృతమైన సాంస్కృతికోద్యమంలో భాగం. రచించేందుకు, ప్రచురించేందుకు ప్రజలకు ఉన్న హక్కుల రక్షణకు కృషి చేస్తుంది. హేతువాదాన్ని నిరోధించే ప్రస్తుత ఛాందసవాద భావజాలంపై పోరాడుతుంది. రెడ్ బుక్ డే అనేది కేవలం ఐయుఎల్‌పి పరిధికే పరిమితం కాకుండా పురోగామి శక్తులన్నిటి తేదీగా మారేటుంది. ఎందుకంటే ఇప్పటికే ఐయుఎల్‌పి పరిధికి బయట నున్న వామపక్ష వాదులు, వ్యక్తులు, సంస్థలు రెడ్ బుక్ డే ను స్వీకరించాయి. ఈ దశాబ్దం చివరికి కోటి మంది ప్రజలు రెండ్ బుక్ డే జరుపుకుంటారని ఆశిద్దాం.

**(స్వేచ్ఛానువాదం: ఎస్. వెంకట్రావు)**

పరిశీలన

# దిగజారుతున్న కార్మికవర్గ పరిస్థితులు

సుధా భరద్వాజ్



రచయిత ట్రేడ్ యూనియన్, మానవహక్కుల కార్యకర్త

**1990** వ దశాబ్దంలో "సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ" (ఎల్‌పిజి) విధానాలను అమలు చేయటం ప్రారంభించటంతో కార్మికుల పట్ల ప్రభుత్వ దృక్పథంలో పెద్ద మార్పు వచ్చింది. ఎల్‌పిజి విధానాల ప్రారంభ సంవత్సరాలలో కార్మికవర్గ నాయకులను హత్యలు చేయటం సంచలనంగా మారింది. 1989, జనవరి 1వ తేదీన సహిబా బాద్ పారిశ్రామిక ప్రాంతంలోని ఝుండాపూర్ గ్రామంలో కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని వీధి నాటికల ద్వారా ప్రచారం చేస్తున్న జననాట్యమంచ్ కార్యకర్తలు సఫ్దర్ హష్మి బృందంపై కాంగ్రెస్ కార్పొరేటర్ అనుచరులు ఇనుపరాడ్లతో దాడి చేశారు. రామ్ బహదూర్ అనే కార్మికుడు అక్కడికక్కడే మరణించాడు. తీవ్రంగా గాయపడిన సఫ్దర్ హష్మి మరుచటి రోజు మరణించాడు. తీవ్ర దుఃఖభారంతో ఉన్న హష్మి జీవిత భాగస్వామి మలయశ్రీ హష్మి , జననాట్యమంచ్ కళాకారులు మధ్యలోనే ఆపివేసిన ప్రదర్శనను పూర్తి చేయటం కోసం అదే ప్రదేశంలో 1989, జనవరి 4వ తేదిన అదే ప్రదేశంలో ఇచ్చిన ప్రదర్శన ప్రతివారి శరీరంలోనూ విద్యుత్‌ను ప్రవహింప జేసింది. ప్రదర్శనను వేలాది మంది కార్మికులు, విద్యార్థులు, కళాకారులు తిలకించారు.

ఛత్తీస్‌ఘర్‌లో కాంట్రాక్టు కార్మికులను సమీకరించి పోరాడుతున్న ప్రముఖ నాయకుడు శంకర్ గుహ నియోగి బిలాయ్‌లోని తన స్వగృహంలో నిద్రిస్తుండగా 1991, సెప్టెంబరు 29వ తేదీ ఉదయం కాల్చి చంపారు. కార్మికులు, రైతుల హక్కులను కాపాడటం కోసం మార్కిస్టు–లెనినిస్టు నాయకుడైన నియోగి ఛత్తీస్‌ఘఢ్‌లోని దల్లి రాజ్‌హర గనులు కేంద్రంగా ఛత్తీస్‌ఘర్ ముక్తి మోర్చాను స్థాపించాడు. ఆయన యూనియన్ ఆధ్వర్యంలో కొన్ని పాఠశాలలను, ఒక ఆసుపత్రి, ఒక సాంస్కృతిక దళాన్ని, ఒక ఫుట్‌బాల్ టీంను ఏర్పాటు చేయటంతో పాటు, కార్మికులలో మద్యపానానికి వ్యతిరేకంగా శక్తివంతంగా ప్రచారం చేశారు. సింప్లెక్స్, కేడియా గ్రూపులకు చెందిన పారిశ్రామికవేత్తలు, బిజెపి ప్రభుత్వంలో ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న వ్యక్తి తనను చంపటానికి కుట్ర పన్నారన్న సందేశాన్ని నియోగి టేప్ రికార్డర్‌లో రికార్డ్ చేశాడు.

బాంబే టెక్స్‌టైల్ కార్మికుల సమ్మె నిర్వహణలో ముఖ్యపాత్ర నిర్వహించిన, ఆకట్టుకొనే నాయకుడు దత్తా సామంత్‌ను 1997 జనవరి, 16వ తేదీన ముంబయిలోని పవాయ్‌లో ఆయన ఇంటి బయటే హత్య చేశారు. అప్పటికి 65 టెక్స్‌టైల్ మిల్లులు మూతపడగా, 2.5 లక్షల మంది కార్మికులను యజమానులు పనుల నుండి తొలగించారు. ప్రీమియర్ ఆటోమొబైల్స్ లాకౌట్, మిల్లు భూముల సమస్య, కార్మిక సంఘాల మధ్య స్పర్ధలు, ముఖ్యంగా శివసేనతో ఉన్న విభేధాలు ఈ హత్యకు కారణాలుగా చెప్పారు. సామంత్ హత్యకేసులో దోషిగా ఉన్న రౌడి నాయకుడు ఛోటా రాజన్‌ను 26 సంవత్సరాల తర్వాత 2023లో విడిచిపెట్టారు.

### కాంట్రాక్టు విధానపు దుష్ఫలితాలు

1970లో తీసుకు వచ్చిన కాంట్రాక్టు కార్మికుల (క్రమబద్ధీకరణ, రద్దు) చట్టం భారత కార్మిక చట్టాలలో ప్రత్యేకమైనది. కాంట్రాక్టు విధానాన్ని కార్మికులపై రుద్దటానికి, శాశ్వత కార్మికులు సంపాదించుకున్న హక్కులను వారికి లేకుండా చేయటానికి, వారిని మరింత ఎక్కువగా దోపిడి చేయటానికి ఉద్దేశించిన చట్టం అది. ఏ సంస్థలో అయినా శాశ్వతమైన, క్రమబద్ధంగా జరగవలసిన, అవసరమైన పనులలో కాంట్రాక్టు కార్మికులను నియమించటాన్ని ఈ చట్టం నిషేధించింది. ఒక పద్ధతి ప్రకారం ఈ చట్టానికి ఏ విధంగా తూట్లు పొడిచారన్న దానిని పరిశీలించటం ఈ వ్యాసం పరిధిలో లేదు. కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయటానికి అధికారం ఉన్న ప్రభుత్వాలు అందుకు పూనుకోలేదు. ఈ చట్టాన్ని అమలు చేయటానికి అవసరమైన అధికారాలు, శక్తి సామర్థ్యాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన సలహా మండళ్ళకు లేవని చెబితే సరిపోతుంది.

స్టీల్ అథారిటి ఆఫ్ ఇండియా లిమిటెడ్, నేషనల్ వాటర్ ఫ్రంట్ వర్కర్స్ యూనియన్‌ల మధ్య జరిగిన కేసులో (ఎఐఆర్ 2001 ఎస్‌సి 3527) న్యాయవ్యవస్థ కార్మిక వర్గాన్ని తీవ్రమైన దెబ్బకొట్టింది. కాంట్రాక్టు కార్మికులు పని చేయటాన్ని నిషేధించిన విభాగంలో అయినా కాంట్రాక్టు కార్మికులు దశాబ్దాలుగా పని చేస్తున్నప్పటికీ, వారిని శాశ్వత కార్మికులుగా తీసుకోవాల్సిన అవసరం లేదని ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం పేర్కొంది. యాజమాన్యం "అర్హులైన కార్మికులను సరైన పద్ధతిలో తీసుకుంటే" వారు పనులు కోల్పోతారు. "కోర్టులకు రావద్దు, మీకు ఇక్కడ న్యాయం జరుగుతుందన్న హామి లేదు" అని కార్మికులకు ఈ తీర్పు స్పష్టం చేసింది.

కాంట్రాక్టు కార్మికులు కోర్టులలో ఎటువంటి విజయాలు సాధించలేదనేది దీని అర్థం కాదు. బృహన్ ముంబై మునిసిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులుగా దశాబ్దాలుగా పని చేస్తున్న వివిధ బ్యాచ్‌లకు చెందిన వారిని పర్మినెంట్ చేయించటం కోసం కచ్రా వహతక్ శ్రామిక్ సంఘ్ నాయకత్వాన కోర్టులు, వీధులలో జరిగిన చారిత్రాత్మకమైన పోరాటం సాధించిన విజయం ఇందుకు ఒక మంచి ఉదాహరణ.

ఈరోజు పెద్ద పరిశ్రమలలో కూడా పని

చేస్తున్న వారిలో కనీసం 10 శాతం మంది కూడా శాశ్వత కార్మికులుగా లేరు. ఉదాహరణకు ఛత్తీస్‌గడ్‌లోని బిలాయ్ స్టీలు ఫ్యాక్టరిలో 1960లలో 96,000 మంది పర్మినెంట్ కార్మికులు ఉన్నారు. కాని ప్రస్తుతం 12,000 మంది మాత్రమే పర్మినెంట్ కార్మికులుగా ఉన్నారు. ఆ ఫ్యాక్టరిలో ఇపుడు 50,000 మంది కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తూ, పర్మినెంటు కార్మికులు తీసుకొంటున్న వేతనాలలో కొద్దిభాగం మాత్రమే పొందుతున్నారు.

ఉపాధికి గ్యారంటి లేకపోవటం వలన కాంట్రాక్టు విధానం అనేక తీవ్రమైన సమస్యలకు కారణమౌతున్నది. మొదటగా కార్మికులు యూనియన్‌లలో చేరటాన్ని అది అసాధ్యం చేస్తున్నది. కార్మికులందరిని కాకపోయినప్పటికీ, యూనియన్‌ను లాంఛనంగా రిజిష్టర్ చేయటానికి ముందే నాయకులను సులభంగా పనిలో నుండి తొలగిస్తారు. రెండవది, దశాబ్దాలుగా పని చేస్తున్నప్పటికీ వారి పేర్లను ఎక్కడా నమోదు చేయరు. అప్పాయింట్ లెటర్లు, గేట్‌పాస్‌లు, శాలరి స్లిప్‌లు తదితరాలుండవు. కాబట్టి హక్కుల కోసం చట్టపరంగా పోరాడటానికి అవకాశం ఉండదు. ఈ కార్మికులు ప్రమాదకరమైన, నడ్డి విరిచేంత కష్టమైన పనులను ఎక్కువ గంటలు చేయాలి. సాధారణంగా పర్మినెంట్ కార్మికులుగా ఉన్న సూపర్‌వైజర్లు వారి పనిని పర్యవేక్షణ చేస్తారు. మూడవది వారి వేతనాలు అతి తక్కువగా, కొన్ని సమయాలలో ప్రభుత్వం నిర్ణయించినవాటి కన్నా తక్కువగా ఉంటాయి.

ఈరోజు 83 శాతం పారిశ్రామిక కార్మికులు సంఘటితంగా లేరు. 93 శాతం మంది రాతపూర్వకమైన కాంట్రాక్టు ఒప్పందాలు లేకుండా పని చేస్తున్నారు. కార్మికులు పొందుతున్న అత్యంత దిగువస్థాయి వేతనాలను ఐఎల్‌ఓ నివేదికలో పేర్కొన్నారు. ఆసియా ఖండంలోనే అతి తక్కువ వేతన పెరుగుదల ఉన్న దేశాలలో భారతదేశం ఒకటి అని "కోవిడ్-19 సమయంలో జీతాలు, కనీస వేతనాలు" పేరుతో విడుదల చేసిన నివేదికలో ఐఎల్ఓ చెప్పింది. భారతదేశంలో "నిజ వేతనాలు" 2015లో 2.8 శాతం, 2016లో 2.6 శాతం, 2017లో 2.5 శాతం మాత్రమే పెరగగా, 2018లో పెరుగుదల లేకుండా యధాతథంగా ఉన్నవి.

**దీర్ఘకాలం నుండి కొనసాగుతున్న అనిశ్చితి**

కాంట్రాక్టు కార్మికులు ఇల్లు, వైద్య అలవెన్సులకు నోచుకోకపోగా, శాశ్వత కార్మికుల వలె వీరికి కనీసం క్యాంటిన్‌లో సబ్సిడి ఆహారం కూడా అందించటం లేదు. ఎక్కువ సందర్భాలలో ఈ కార్మికులు దిగువ తరగతుల నుండి వలస వచ్చిన వారిగా ఉంటున్నారు. ఫలితంగా వీరు ఏ మాత్రం భద్రత లేని పరిస్థితులలో జీవిస్తున్నారు. కోవిడ్-19 తో లాక్‌డౌన్ విధించినపుడు దీని పరిణామాలు ఏమిటనేది మనం వారం రోజుల పాటు టివి తెరపై తిలకించాం. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ఆకలితో ఉన్న, అన్నింటికీ తెగించిన కోటిమందికి పైగా వలస కార్మికులు కాలినడకన తమ నెలవులకు తరలివెళ్ళారు.

**నిజ వేతనాల పెరుగుదల**

మన ఇరుగుపొరుగు దేశాలైన పాకిస్తాన్, చైనా, శ్రీలంక, నేపాల్ కన్నా భారతదేశంలో నిజ వేతనాల పెరుగుదల తక్కువగా ఉన్నది. 2015లో పాకిస్తాన్‌లో వేతనాలు 8.9 శాతం పెరిగాయి. తరువాత మూడు సంవత్సరాలు నాలుగు శాతం చొప్పున పెరిగాయి. వియత్నాంలో 3.7 నుండి 12.4 శాతం వరకు పెరిగాయి. చైనాలో 2015-18 మధ్య సంవత్సరానికి 5.5-7 శాతం చొప్పున పెరిగాయి. కోవిడ్-19కి ముందు 2018లో కొనుగోలు శక్తి ప్రాతిపదికగా చూసినపుడు భారతదేశంలో తలసరి నెల వేతనం 215 డాలర్లు. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని 30 దేశాలలో బంగ్లాదేశ్, సోలోమన్ దీవుల తర్వాత మూడవ అతి తక్కువ వేతనంగా ఉన్నది.

కోవిడ్ మహమ్మారి తగ్గిన తర్వాత వ్యవసాయంలో పనులు దొరకక పోవటం, గ్రామీణప్రాంతంలో వేతనాలు తగ్గటం వలన వలస కార్మికులు తిరిగి నగరాలకు వచ్చారు. ఐఎల్ఓ నివేదిక ప్రకారం కోవిడ్ అనంతరం అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికుల వేతనాలు 22.6 శాతం పడిపోగా, సంఘటిత రంగంలో పని చేస్తున్న ఉద్యోగుల వేతనాలు సగటున 3.6 శాతం తగ్గాయి.

కార్మికులలోని వివిధ తరగతులు- నిర్మాణరంగంలో పనిచేస్తున్న వారు, ఇంటిపని వారు, బండ్లపై సరుకులు అమ్ముకొనేవారు, ఇంటి నుండి పని చేస్తున్నవారు, ఓలా, ఉబెర్ డ్రైవర్లు, డెలివరి వర్కర్లు, యాప్ ప్రాతిపదికగా సేవారంగంలో పని చేస్తున్న కార్మికులు- తాము పని చేస్తున్న ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా సంఘటితం కావటానికి ప్రయత్నిస్తున్నారు. వీరు పని చేస్తున్న ప్రదేశాలు తరచుగా మారుతుండటం, యజమానులు ఎక్కువ సంఖ్యలో ఉండటం లేదా తరచుగా మారుతుండటం, వారి వేతనం ముక్కలుగా

**"ఈరోజు 83 శాతం పారిశ్రామిక కార్మికులు సంఘటితంగా లేరు. 93 శాతం మంది రాతపూర్వకమైన కాంట్రాక్టు ఒప్పందాలు లేకుండా పని చేస్తున్నారు. కార్మికులు పొందుతున్న అత్యంత దిగువస్థాయి వేతనాలను ఐఎల్ఓ నివేదికలో పేర్కొన్నారు. ఆసియా ఖండంలోనే అతి తక్కువ వేతన పెరుగుదల ఉన్న దేశాలలో భారతదేశం ఒకటి అని "కోవిడ్-19 సమయంలో జీతాలు, కనీస వేతనాలు" పేరుతో విడుదల చేసిన నివేదికలో ఐఎల్ఓ చెప్పింది."**



టెక్స్‌టైల్ కార్మికులు: సంఘటిత రంగంలో కార్మికుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతున్నది

**"వలంటీర్లు" అని ముద్ర వేసిన అంగన్ వాడి, ఆశా వర్కర్లపై గామీణ ఆరోగ్యవ్యవస్థ అంతా ఆధారపడి ఉన్నది. తమను కార్మి కులుగా గుర్తించాలని, ఇతర కార్మికులకు ఇస్తున్న వేతనాలు, ప్రోత్సాహకాలు తమకు కూడా ఇవ్వాలని, వారు ఆందోళన చేస్తున్నారు. నిర్మాణ కార్మికులు, ఇంటిపని చేసేవారు, వివిధ రకాలైన పనులు చేసేవారు తమ హక్కులు, రక్షణకు ప్రత్యేక చట్టాలు చేయాలని యూనియన్లు లేదా రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు జరుపుతూ ఆందోళనలు చేస్తున్నారు.**

అందుతుండటంతో ఫ్యాక్టరీలలో పని చేసే కార్మికులకు వర్తించే పని పరిస్థితులు ఈ తరగతుల వారికి వర్తించవు. యజమానులపై ప్రభుత్వ పర్యవేక్షణ సరిగా లేకపోవటం వలన యాప్ ప్రాతిపదికగా పని చేస్తున్న కార్మికులను "భాగస్వాములు" అని అంటున్నారు. న్యాయ పరమైన వివాదాలను సుదీర్ఘంగా కొనసాగిస్తున్నారు.

"వలంటీర్లు" అని ముద్ర వేసిన అంగన్ వాడి, ఆశా వర్కర్లపై గామీణ ఆరోగ్యవ్యవస్థ అంతా ఆధారపడి ఉన్నది. తమను కార్మికులుగా గుర్తించాలని, ఇతర కార్మికులకు ఇస్తున్న వేతనాలు, ప్రోత్సాహకాలు తమకు కూడా ఇవ్వాలని, రక్షణలను కల్పించాలని వారు ఆందోళన చేస్తున్నారు. నిర్మాణ కార్మికులు, ఇంటిపని చేసేవారు, బండ్లపై సరుకులు అమ్ముకొనేవారు, వివిధ రకాలైన పనులు చేసేవారు తమ హక్కులు, రక్షణకు ప్రత్యేక చట్టాలు చేయాలని యూనియన్లు లేదా రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు జరుపుతూ ఆందోళనలు చేస్తున్నారు.

2020లో నామమాత్రపు చర్చ కూడా లేకుండా పార్లమెంటు హడావిడిగా ఆమోదించిన, ఇంకా నోటిఫై చేయని కార్మికుల వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులపై ఆమోదించిన కోడ్‌లో ప్లాంటేషన్ వర్కర్స్ యాక్ట్ 1951, మైన్స్ చట్టం 1952, వర్కింగ్ జర్నలిస్టు చట్టం 1958, మోటారు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యాక్ట్ 1961, బీడి అండ్ సిగార్ వర్కర్స్ యాక్ట్ 1966, ది సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ యాక్ట్ 1976, సినిమా కార్మికులు సినిమా థియేటర్ కార్మికుల చట్టం 1981, ది డాక్ వర్కర్స్ చట్టం 1986, ది బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ చట్టం 1996 లాంటి అనేక ప్రత్యేకమైన చట్టాలను రద్దు చేయాలని ప్రతిపాదించారు.

### కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు

వీటితో ప్రతి తరగతి కార్మికులకు తీవ్రమైన సమస్యలు వస్తాయి. ఉదాహరణకు నిర్మాణ కార్మికుల చట్టాన్ని మనం ఉదాహరణగా తీసుకొంటే నిర్మాణ కార్మికులను రిజిస్టర్ చేసి, వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి, నిర్మాణ పనులపై ఒక శాతం సెస్ విధించటం ద్వారా వచ్చిన ధనాన్ని వారి సంక్షేమం కోసం వినియోగించాలన్న చట్టంలోని అంశాలను అమలు చేయటానికి కోడ్‌లో ఎలాంటి ప్రతిపాదనలు లేవు.

కోడ్‌తో ఫ్యాక్టరీల చట్టం కూడా రద్దవుతుంది. కార్పొరేట్‌లు చేసిన అతి పెద్దనేరమైన భోపాల్ గ్యాస్ లీక్ విధ్వంసం జరిగి 2024, డిసెంబరు 3వ తేది నాటికి 40 సంవత్సరాలు పూర్తయింది. ఈ ఘటన తర్వాత కార్మికుల రక్షణ కోసం ఈ చట్టంలో చేర్చిన అంశాల ప్రస్తావన కూడా కోడ్‌లో లేదు. కాంట్రాక్ట్ లేబర్ (రెగ్యులేషన్ అండ్ అబోలిషన్) చట్టం 1970 కూడా రద్దు చేయాలని భావిస్తున్నారు. దానితో కాంట్రాక్టు కార్మికుల విధానాన్ని రద్దు చేయటం అన్న అంశం "అత్యంత కష్టతరమైన" కేటగిరి నుండి "అసాధ్యం" కేటగిరిలోకి వెళుతుంది. "నిర్దిష్ట కాలం కాంట్రాక్టు" విధానాన్ని ముందుకు తెస్తూ, కార్మికులు యూనియన్‌లలో చేరటాన్ని మరింత కష్టతరం చేస్తున్నారు. కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు పర్మినెంట్ కార్మికులుగా నియమించే విధానాన్ని రద్దు చేయటానికి దారితీస్తాయి.

రుణాలను రికవరి చేయటం, ఇన్‌సాల్వెన్సి, దివాళా చట్టాలలో నూతనంగా చేరుస్తున్న అంశాలు సమస్యాత్మకంగా ఉన్నాయి. 1956లో తీసుకొచ్చిన పాత కంపెనీల చట్టం రుణాలు చెల్లించలేని కంపెనీలను రద్దు చేసి, రుణదాతలు తమ రుణాలను పొందటానికి అవకాశం కల్పించింది. అటువంటి రుణాల కన్నా కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు ప్రత్యేకమైనవని అది గుర్తించింది.

కార్మికులకు చెల్లించాల్సిన ప్రావిడెంట్ ఫండ్, గ్రాడ్యుటీలు ఏ విధంగానూ రాజీ పడటానికి అవకాశం లేనివని చెప్పి, కార్మికులకు రావలసిన బకాయిలకు రక్షణ కల్పించింది. వాస్తవానికి యజమానుల ఆస్తుల నుండి పిఎఫ్‌ను తీసుకోవటానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పింది. ఆ విధంగా 1956, కంపెనీల చట్టంలోని సెక్షన్ 529ఎ, 2013లోని కంపెనీల చట్టంలోని సెక్షన్ 326 లు కార్మికుల బకాయిలను రికవరి చేయటాన్ని అన్నింటి కన్నా ప్రథమ స్థానంలో ఉంచాయి.

అయినప్పటికీ ది సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫినాన్షియల్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్ 2002, ఇన్‌సాల్వెన్సి అండ్ బ్యాంకరప్టసి కోడ్ పూర్తిగా బ్యాంకులకు చెల్లించాల్సిన బకాయిలను రికవరి చేయటంపైనే కేంద్రీకరించింది. చట్టపరంగా, ఆచరణ రీత్యా కార్మికుల బకాయిలను వసూలు చేయటానికి ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వలేదు.

బ్యాంకులకు చెల్లించాల్సిన అప్పులు కోట్ల రూపాయలలో ఉంటాయి. కార్మికులకు చెల్లించాల్సినవి లక్షల రూపాయలలో ఉంటాయి. కాని వాటి వలన వచ్చే చిక్కులలో చాలా వ్యత్యాసం ఉంటుంది. కార్మికులకు బకాయిలను వసూలు చేసుకోవటం లేదా వసూలు చేసుకోలేకపోవటం అన్నది జీవన్మరణ సమస్య. రుణాలను "దామాషా పద్ధతి"లో చెల్లించటం లేదా అన్ని రుణాలను ఒకే విధమైనవిగా పరిగణించటం న్యాయం అందించటాన్ని వక్రీకరించటమే అవుతుంది.

ఇంత తీవ్రమైన ఆటంకాలు ఎదురౌతున్నప్పటికీ కార్మికవర్గం పోరాటాన్ని ఆపటం లేదు. తమ జీతాలను పెంచాలని డిమాండ్ చేస్తూ ముంబైలోని ఆజాద్ మైదాన్‌కు అంగన్ వాడి కార్మికులు ప్రవాహంలా వచ్చారు. చెన్నైలోని శామ్‌సంగ్ ఫ్యాక్టరి కార్మికులు తమ యూనియన్‌ను గుర్తించాలని పోరాటం చేశారు. పశ్చిమబెంగాల్‌లోని టీ ఎస్టేట్‌లలో పనిచేసే కార్మికులు కనీస వేతనం చెల్లించాలని పోరాటం చేస్తున్నారు. 12 సంవత్సరాల నిర్బంధం తర్వాత కూడా తమను తిరిగి పనిలోకి తీసుకోవాలని మారుతి-సుజుకి కార్మికులు పోరాడుతున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్నవారూ, మీడియా విస్మరించినప్పటికీ పోరాటాలు చేసేవారు ఉండనే ఉన్నారు. ప్రతిచోటా ఉన్నారు. ధూళి రేణువుల వలె కనిపించకుండా ఉన్నారు. మీ కళ్ళలో పడటానికి, కళ్ళు తెరిపించటానికి అవసరమైన తుఫాన్ రాకకోసం ఎదురు చూస్తున్నారు.

**(అనువాదం: ఎ.కోటిరెడ్డి)**

# మధ్య యుగాల్లో శాస్త్ర సాంకేతికత

## (క్రీ.శ 650 - 1750)

ఎం.వి.ఎస్.శర్మ



రచయిత ప్రజాశక్తి మాజీ సంపాదకుడు

క్రీ.శ.1000 నుండి జరిగిన చరిత్రలోకి పోయే ముందు మన ఉపఖండంలో ఉత్పత్తి శక్తుల అభివృద్ధి జరిగిన తీరును పరిశీలిద్దాం. భూమండలం మీద వివిధ ప్రాంతాల, నాగరికతల ప్రజల నడుమ శాస్త్ర సాంకేతికతకు చెందిన పరిజ్ఞానాన్ని పరస్పరం ఇచ్చి పుచ్చుకునే సాంప్రదాయం దీర్ఘకాలంగా కొనసాగిందన్న వాస్తవాన్ని కప్పిపుచ్చి తక్కిన ప్రపంచ ప్రజానీకం అంతా అజ్ఞానులన్నట్టు, మనమే విశ్వగురువులం అన్నట్టు విర్రవీగే హిందూత్వ వాదుల ప్రచారాలు ఎంత అసత్యాల మయమో ఈ పరిశీలన స్పష్టం చేస్తుంది. అంతే కాక ఈ సాంకేతిక అభివృద్ధి మత విశ్వాసాల, అతీత శక్తుల ప్రమేయం ఏమీ లేకుండానే మానవుల ఉమ్మడి ప్రయత్నాల నుండి మాత్రమే సాధ్యపడిందన్న వాస్తవం కూడా తెలుస్తుంది. మన ఉపఖండంలో మధ్య యుగాల్లో ఉత్పత్తి శక్తుల అభివృద్ధి అన్నది ఏమీ లేకుండా జడత్వం నిండిపోయిందనీ, మన వెనుకబాటుకు అదే కారణం అన్న అభిప్రాయం కూడా మరోవైపు ఉంది. అందుచేత చరిత్ర కారులు తమ శాస్త్రీయ పద్ధతుల ద్వారా నిర్ధారించిన అంశాలను కొన్నింటిని మనం అధ్యయనం చేయాలి.

### 1. వ్యవసాయం

#### 1.1: పంటలు, పనిముట్లు తొలినాటి చరిత్ర

భారత ఉపఖండంలో వ్యవసాయం 9,000 సంవత్సరాల క్రితమే మొదలైంది. ప్రస్తుత బెలూచిస్తాన్ (పాకిస్తాన్‌లో ఉంది) లోని బోలన్ కనుమకు దిగువన కచ్చి మైదానాల్లో మెహర్ ఘర్ గ్రామం ఉంది. అక్కడ క్రీ.పూ.7,000 నాడే స్థిరపడిన ప్రజలు రకరకాల గోధుమ, బార్లీ పంటలను పండించారు. బహుశా వారు రబీ, ఖరీఫ్ పంటలను రెండింటినీ సాగుచేసివుండాలి. కర్రతో చేసిన తొల్లికల సాయంతో నేలను పెళ్ళగించి విత్తులు నాటేవారు. అప్పటికే మూపురం ఉన్న ఎద్దులను మచ్చిక చేయడం తెలిసినా, వాటిని మాంసం, పాలు కోసమే పెంచేవారు తప్ప వ్యవసాయంలో ఉపయోగించడం తెలియదు.

సింధునాగరికత తొలిదశలో (క్రీ.పూ. 2500–1900) మొదటిసారి ఎద్దులను పొలాలు దున్నడానికి వాడిన దాఖలాలు లభించాయి. అక్కడ తవ్వకాలలో గుర్తించిన ఎద్దులు దున్నినందున ఏర్పడే చాళ్ళు (జాడలు) ఇందుకు ఆధారం. క్రీ.పూ. 3,000 నాటి హరప్పా, పంజాబ్ (పాకిస్తాన్) ప్రాంతాల్లో ఇవి బైట పడ్డాయి. నాగలితో దున్నిన నేలలు కూడా బైట పడ్డాయి. నాగళ్ళ మట్టి నమూనాలు రెండు చోట్ల లభించాయి. ఇవి క్రీ.పూ.2500–1900 మధ్య కాలానికి చెందినవి. ఇటువంటివి ప్రస్తుత హర్యానాలోని బనావతి దగ్గర, పాకిస్తాన్‌లోని బహావల్పూర్ దగ్గర లభించాయి. ఎద్దులను వ్యవసాయానికి ఉపయోగించారంటే అప్పటి ప్రజలు ఎద్దులకు పునరుత్పత్తి శక్తి లేకుండా చేయడం (కాస్ట్రేషన్) గురించి తెలుసుకున్నారని భావించాలి. బహుశా ఇది మానవుల మొట్టమొదటి బయో–ఇంజనీరింగ్ చర్య అని చెప్పవచ్చేమో.

ఇంకోపక్క తూర్పు వైపు నుండి వరి సాగు పద్ధతి క్రమంగా విస్తరించడం మొదలైంది. క్రీ.పూ. 3,000 నాటికి ఎగువ గంగా మైదాన ప్రాంతాలలో వరి సాగు మొదలైంది. అక్కడి నుండి సింధు ప్రాంతానికి వరిసాగు విస్తరించింది. తిరిగి సింధు ప్రాంతం నుండి గోధుమ, బార్లీ సాగు తూర్పు వైపు విస్తరించింది. గుజరాత్ ప్రాంతంలో రాగుల సాగు మొదలైంది. మెహర్ ఘర్ ప్రాంతంలో పత్తి సాగు క్రీ.పూ.4,000 నాటికే మొదలైంది. సింధు నాగరికత కాలంలోనూ అది కొనసాగింది.

క్రీ.పూ.2,000 నాటికి రైతులు ఏ పంట ఖరీఫ్‌లో, ఏది రబీలో బాగా సాగు అవుతుందో గ్రహించగలిగారు. ఆ ప్రకారమే సాగు చేయడం మొదలుబెట్టారు. క్రీ.పూ.900 నాటికి (అథర్వవేదం కాలం) చెరుకు పంట సాగు మొదలైంది.

వరి సాగు విస్తరించడానికి దోహదం చేసిన ఒక అంశం గేదెను మచ్చిక చేయడం. దాని తర్వాత ఆడ గేదెలు పాడి ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషించడం కూడా మొదలైంది. (అంటే గోమాతకు ఎంత ప్రాధాన్యత ఉందో, గేదె మాతకూ అంతటి ప్రాధాన్యత ఉందన్నమాట. మరి గేదె ఎందుకు పవిత్రమైనదిగా చూడడం లేదో హిందూత్వ వాదులే చెప్పాలి)

భూమిని దున్నడానికి వాడే నాగలికి కర్రుగా రాళ్ళను మొదట్లో ఉపయోగించేవారు. అప్పటికి ఇంకా ఇనుము వ్యవసాయంలో వాడడం మొదలు కాలేదు. మనుస్మృతి (క్రీ.శ.150) నాటికి నాగలికి ఇనుపకర్రును వాడడం ఆచరణలో ఉన్నట్టు పేర్కొన్నారు. క్రీ.పూ.3వ శతాబ్దానికి చెందిన ఇనుప కర్రు పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లోని అత్రంజి ఖేర్ దగ్గర దొరికింది. దానితోబాటు ఇనుప కొడవళ్ళు కూడా లభించాయి.

పీచును ఇచ్చే అవిశ, జనుము వంటి పంటల సాగు గురించి పాణిని (క్రీ.పూ.350) పేర్కొన్నాడు. వాటితోబాటు నీలిమందు పంట కూడా సాగు చేసేవారు. క్రీ.శ.1 వ శతాబ్దం నాటికి వరి నాట్లు వేయడం ద్వారా సాగు చేసే పద్ధతి అమలులోకి వచ్చింది. క్రీ.శ.400 నాటి ప్రముఖ కవి కాళిదాసు కావ్యాల్లో వరినాట్ల ప్రస్తావన ఉంది. క్రీ.పూ.300 నాటికి పత్తిని ఒక పంటగా సాగు చేయడం అనేది అమలులోకి వచ్చింది. అశోకుడి కాలానికి మామిడి తోటల పెంపకం మొదలైంది. కొబ్బరి క్రీ.పూ.1వ శతాబ్దం నాటివరకూ మన వద్ద సాగు కాలేదు.

" భూమిని దున్నే నాగలి ఆకారంలో ఏ మౌలికమైన మార్పూ ఈ కాలంలో రాలేదు. కానీ క్రీ.శ.15వ శతాబ్దం నాటికి వాడకంలోకి వచ్చిన నాగలి సైజులో బాగా పెద్దది. అందులో ఇనుము భాగం కూడా ఎక్కువే. బరువూ ఎక్కువే. మనుస్మృతి కాలం నాటికి కేవలం చిన్న ఇనుప ముక్కను నాగలి కర్రుకు చివరన తగిలించే వారు. దాని స్థానంలో బరువైన ఇనుపకర్రును వాడడం వరకూ మార్పు జరిగింది. "


అప్పుడే పశ్చిమ తీరానికి మొదటగా వచ్చింది. పాండిచేరి వద్ద అరికమేడు అన్న ప్రాంతంలో కొబ్బరి తోటల పెంపకం మొదలైనట్టు నిర్ధారించారు. క్రీ.శ.2వ శతాబ్దం నాటికి అది పశ్చిమ తీరమంతటా బాగా విస్తరించింది.

భూమిని దున్నే నాగలి ఆకారంలో ఏ మౌలికమైన మార్పూ ఈ కాలంలో రాలేదు. కానీ క్రీ.శ.15వ శతాబ్దం నాటికి వాడకంలోకి వచ్చిన నాగలి సైజులో బాగా పెద్దది. అందులో ఇనుము భాగం కూడా ఎక్కువే. బరువూ ఎక్కువే. మనుస్మృతి కాలం నాటికి కేవలం చిన్న ఇనుప ముక్కను నాగలి కర్రుకు చివరన తగిలించే వారు. దాని స్థానంలో బరువైన ఇనుపకర్రును వాడడం వరకూ మార్పు జరిగింది. (చూ. ఊహాచిత్రం 1.2) భూమి స్వభావాన్ని బట్టి నాగలి బరువు ఉండేలా తయారు చేసేవారు.

ఆ తర్వాత దున్నేటప్పుడే విత్తులు నాటేందుకు వీలుగా నాగలికి ఒక కన్నం చేసి దాని నుండి విత్తులు కిందకు జారుతూ నాటుకునేలా ఏర్పాటు చేశారు. క్రీ.పూ.1వ శతాబ్ది నాటికే ఈ విధానం చైనాలో అమలులో ఉండేది. కాని మన దేశంలో అది వాడుకలోకి వచ్చింది మధ్య యుగాలలోనే. పత్తి విత్తుల్ని నాటడానికి నాగలి చివర్న ఒక తవ్వకోల వంటిది అమర్చి అది చేసే కన్నాల్లోకి పత్తి విత్తుల్ని జారవిడిచేవారు.

ఎరువుగా ప్రధానంగా పశువుల పేడను ఉపయోగించేవారు.

ఒంటి మూపురం ఉన్న ఒంటెలను వ్యవసాయంలో ఉపయోగించడం మధ్య యుగాలలోనే కనిపిస్తుంది. వాయవ్య బాక్ట్రియా నుండి వచ్చిన రెండు మూపురాల ఒంటెల వర్ణనలు ప్రాచీన సాహిత్యంలో ఉన్నాయి కాని ఒంటి మూపురపు ఒంటె గురించిన వర్ణన వాటిలో లేదు. క్రీ.శ.6వ శతాబ్దం నాటి సాహిత్యంలో (చైనా యాత్రికుడు హువాన్ త్సాంగ్ డైరీలు) గుజరాత్ లోని బార్డోలి వద్ద శిల్పాలలో (9వ శతాబ్దం) ఖజురహో



శిల్పాలలో (10వ శతాబ్దం) ఈ ఒంటెలు దర్శనమిస్తాయి. వేడిమి ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో, గట్టి నేలల్లో ఈ ఒంటెలు శక్తివంతంగా నేలను దున్నగలవు. అందుకే సింధు పరీవాహక ప్రాంతాల్లో దీనిని ఎక్కువగా ఉపయోగించేవారు. (అందుచేత ఒంటె కూడా గోవు మాదిరిగా పవిత్రమైనదే. కాని హిందుత్వ వాదుల్లో ఒంటె భక్తులు కానరారెందుకు?)

శతాబ్దాల కాలంలో భారత ఉప ఖండంలో అనేక రకాల పంటలను సాగు చేయగల సామర్థ్యాన్ని రైతులు పెంచుకున్నారు. కొన్ని పంటలు ఇతర ప్రాంతాలనుండి ఇక్కడికి ప్రవేశించాయి. క్రీ.శ.16వ శతాబ్దం నాటికి రబీ కాలంలో 16 నుండి 21 రకాల పంటలను, ఖరీఫ్ కాలంలో 17 నుండి 29 రకాల పంటలను సాగు చేస్తున్నట్టు శిస్తువసూళ్ళ రికార్డుల్లో నమోదైవుంది. అక్బర్ వద్ద మంత్రిగా పని చేసిన అబుల్ ఫజల్ ఈ రికార్డులను నిర్వహించేవారు. ఇన్ని రకాల పంటలను పండించడం బట్టి భారతీయ రైతుల పరిజ్ఞానం, నైపుణ్యం ఎక్కువగా ఉండేదని భావించాలి. ఈ పంటల్లో నల్లమందు, హెన్నా అరబ్బు దేశాలనుండి ప్రవేశించాయి. హెన్నాను 'మెంది' అని పిలిచేవారు. దీనిని శరీరం మీద చిత్రించడానికి (గోరింటాకు మాదిరిగా) వాడేవారు. ఈ పంటల ప్రస్తావన మొదటి సారిగా క్రీ.శ.14వ శతాబ్దంలో కనిపిస్తోంది.

పోర్చుగల్ నుండి రాకపోకలు మొదలయాక 1613 లో పొగాకు మన దేశంలో ప్రవేశించి వేగంగా విస్తరించింది. మొక్కజొన్న పంట కూడా దాదాపు ఇదే కాలంలో ప్రవేశించింది. మిరప పంట మొదట దక్షిణ భారత దేశంలో ప్రవేశించి 18వ శతాబ్దానికి దేశమంతటా విస్తరించింది. వేరుశనగ, బంగాళాదుంప, చిలగడదుంప, టమాటా, బెండ వంటివి అమెరికా ఖండం నుంచి ఆ తర్వాత కాలంలో వచ్చాయి. 16వ శతాబ్దం వరకూ తక్కిన భూమండలంతో సంబంధాలు లేకుండా జీవించిన అమెరికన్ ఖండ మూలవాసులు ఆ ఒంటరితనంలో కూడా ఇన్ని రకాల పంటల సాగును అభివృద్ధి చేయగలిగారు. ఇందుకు వ్యవసాయ రంగం వారికి రుణపడివుండాలి.

ఒక ఏడాది పంట పండించిన నేలను మరుసటి ఏడాది ఖాళీగా ఉంచేవారు. మళ్ళీ భూసారం పెరిగాక ఆ తర్వాత ఏడాది పంట వేసేవారు. చాలా కొద్ది భూభాగంలో మాత్రమే రెండు పంటలను పండించేవారు. ఒకే పంటను వరుసగా పండించడం కాకుండా, ఒక పొలంలో పండించే పంటలను మార్చి మార్చి సాగు చేయడం అనే విధానాన్ని అమలు చేశారు. వరి-పొగాకు-పత్తి ఈ వరస క్రమంలో సాగు చేయడం బెంగాల్ రైతుల విధానంగా ఉండేది.

### పట్టు సాగు

మధ్య యుగాల నాటికి భారత దేశంలో పట్టుసాగు తెలియదు. 11వ శతాబ్దం నాటికే ఇరాన్‌లో పట్టు సాగు, ఉత్పత్తి బాగా పెంపొందింది. కాని అది మన దేశానికి రాలేదు. మన దేశంలో పట్టుసాగు గురించి, మల్బరీ తోటల పెంపకం గురించి, పట్టుగూళ్ళ పెంపకం గురించి ప్రస్తావించినది మా హువాన్ అనే చైనా నావికుడు. బెంగాల్‌ను 1422లో సందర్శించిన సందర్భంగా అక్కడ కనిపించిన పట్టు సాగు గురించి తన నివేదికలో పేర్కొన్నాడు. అక్కడ సాగు చేసిన పట్టు పురుగుల స్వభావాన్ని బట్టి మనకు పట్టు సాగు దక్షిణ చైనా నుండి వచ్చిందని నిర్ధారించవచ్చు. 16వ శతాబ్దానికల్లా ప్రపంచంలోనే ఒక పెద్ద పట్టు కేంద్రంగా బెంగాల్ తయారైంది. ఆ పట్టుపురుగుల స్వభావం వలన ఏడాదికి ఆరు పంటలు దిగుబడి అయ్యేవి. 16వ శతాబ్దం చివరినాటికి

కాశ్మీర్‌లో పట్టు సాగు బాగా అభివృద్ధి చెందింది.

**పండ్ల తోటల పెంపకం – అంటు కట్టే విధానం**


మొఘల్ పాలకుల కాలం వరకూ పండ్ల తోటలలో వివిధ రకాలను పెంచడం, కొత్త రకాలను పెంపొందించడం వంటి పరిజ్ఞానం ఈ ఉపఖండంలో లేదు. మనకన్నా ముందే ఇరాన్‌లో ఈ పద్ధతులు మొదలయ్యాయి. అక్బర్ కాలంలో కాశ్మీర్ ప్రాంత పాలనాధికారిగా పని చేసిన ఆలీ కులీ అఫ్షర్ ఇరానీయుడు. అతడు కాబూల్ నుండి అంట్లు తెచ్చి ద్రాక్ష సాగును ఆరంభించాడు. అదే విధంగా ఆప్రికాట్ సాగు కూడా ప్రారంభించాడు. మల్బరీ చెట్లకు కాసే పళ్ళను తినడానికి పనికొచ్చేవిగా చేయడానికి అంటు కట్టే విధానాన్ని ఉపయోగించారు. తురంజి, నారింజ అనే రెండు వేరు వేరు రకాల నిమ్మ జాతి మొక్కలను అంటు కడితే ప్రసిద్ధి చెందిన సంత్రా జాతి ఫలాలు వచ్చాయి. (నాగపూర్ కమలాలు అంటాం) ఇది 18వ శతాబ్దంలో జరిగింది. అనాస (పైన్‌యాపిల్) బొప్పాయి, జీడిమామిడి, జామ సాగులను 17వ శతాబ్దంలో పోర్చుగీసువారు అమెరికా ఖండం నుంచి తెచ్చి ఇక్కడ ప్రవేశపెట్టారు. మామిడిచెట్లకు అంటుకట్టే విధానాన్ని కూడా వారే ప్రవేశపెట్టారు. ప్రఖ్యాత అల్ఫాన్సో రకం మామిడి జాతి ఆ రకంగా వచ్చినదే. అంతకు ముందు మామిడి చెట్లకు అంటు కట్టే పద్ధతి మన ఉపఖండంలో లేదు.

**సాగునీటి విధానం**

**బావులు, నూతులు**

నదీ పరీవాహక ప్రాంతాలలో భూగర్భ జలాలు ఎక్కువ లోతుగా తవ్వనవసరం లేకుండానే అందుతాయి. వర్షాకాలంలోనైతే ఇంకా పైనే, దాదాపు భూమట్టానికి సమానంగా అందుతాయి. అందుచేత ఈ ప్రదేశాలలో నేల బావులు తవ్వి నీటిని వ్యవసాయానికి ఉపయోగించేవారు. సింధునాగరికత కాలం నుండే ఈ తరహా బావులను తవ్వి వాటి లోపల కైవారం చుట్టూ ఇటుకల గోడ కట్టేవారు. నీరు భూమట్టానికన్నా దిగువన ఉండేచోట్ల చేదలతో తోడడం ద్వారా నీటిని వెలుపలకు తెచ్చేవారు. మొదట్లో కప్పీలు లేవు. రుగ్వేద కాలం నాటి సాహిత్యంలో (క్రీ.పూ.1000) కప్పీల సాయంతో నీరు తోడిన ప్రస్తావనలు కనిపిస్తాయి. (అష్మచక్రం) కప్పీపైనుంచి ఏర్పాటు చేసిన తాడు చివర్న తోలు చేదను కట్టి, దానిని ఎద్దు లాగడం ద్వారా నీటిని తోడేవారు. ఆ తర్వాత

> **“ మొఘల్ పాలకుల కాలం వరకూ పండ్ల తోటలలో వివిధ రకాలను పెంచడం, కొత్త రకాలను పెంపొందించడం వంటి పరిజ్ఞానం ఈ ఉపఖండంలో లేదు. మనకన్నా ముందే ఇరాన్‌లో ఈ పద్ధతులు మొదలయ్యాయి. అక్బర్ కాలంలో కాశ్మీర్ ప్రాంత పాలనాధికారిగా పని చేసిన ఆలీ కులీ అఫ్షర్ ఇరానీయుడు. అతడు కాబూల్ నుండి అంట్లు తెచ్చి ద్రాక్ష సాగును ఆరంభించాడు. అదే విధంగా ఆప్రికాట్ సాగు కూడా ప్రారంభించాడు. ”**



RE 1.5 Sāqiya (ungeared) (artist's drawing)

క్రీ.పూ.350 నాటి బౌద్ధ గ్రంథాలలో 'చక్కవత్తక' (తిరిగే చక్రం) ప్రస్తావన కనిపిస్తుంది. ఒక పెద్ద చక్రానికి చుట్టూ అంచున చేదలను కట్టి ఆ చక్రాన్ని నూతిమీద అమర్చి దానిని తిప్పుతూ ఆ క్రమంలో నూతిలోని నీరు చేదలద్వారా బైటకు తోడేవారు. (చూ. ఊహాచిత్రం 1.4)

పంచతంత్రం (క్రీ.శ.300) లో ఈ యంత్రాన్నే అరఘట అని పేర్కొన్నారు. 'అర' అంటే చక్రం అని, 'ఘట' అంటే కుండ అని అర్థం. నూతిలో నీరు బాగా లోతున ఉంటే అప్పుడు చక్రానికి ఒక తాడును తగిలించి ఆ తాడుకు అక్కడక్కడా చేదలను అమర్చేవారు. చక్రం తిప్పుతూవుంటే ఆ తాడు లోపలికి పోయి దానికి కట్టిన చేదలు నీటితో నిండి బైటకు వస్తాయి. ఈ 'చేదల దండ' ప్రస్తావన బుద్ధఘోష (క్రీ.శ.5 వ శతాబ్దం) లో కనిపిస్తుంది. దీనినే 'సాకియా' అని కూడా అనేవారు. (చూ. ఊహాచిత్రం 1.5) ఐతే ఈ చక్రాన్ని మానవ శక్తితో మాత్రమే తిప్పగలిగే అవకాశం ఉంది.

జంతు శక్తిని ఉపయోగించగల పరిజ్ఞానం 'పర్షియన్ చక్రం' ద్వారా మనకు వచ్చింది. ఇందులో నూతినుండి నీటిని తోడే చక్రానికి మధ్యలో ఇరుసు మాదిరిగా ఒక బలమైన పొడవాటి కర్రను బిగిస్తారు. దాని రెండో చివర తిరగలి మాదిరి తిరిగేలా ఇంకొక చక్రాన్ని అమర్చుతారు. ఆ చక్రానికి ఒక కర్రను కట్టి దానికి ఎద్దుకు తగిలిస్తారు. ఎద్దు గానుగ చుట్టూ తిరిగినట్టు తిరుగుతుంది. అప్పుడు ఆ తిరగలి మాదిరి చక్రం కూడా తిరుగుతుంది. దాని రెండో చివర బిగించిన నూతిలోని చక్రం కూడా తిరుగుతుంది. దానికి అమర్చిన చేదలనుండి నీరు బైటకు వస్తుంది. (చూ. ఊహాచిత్రం 1.7) ఆధునిక గేర్ టెక్నాలజీలో ఇది మొదటి మెట్టు.

> **❝ సింధునాగరికత కాలంనాటి మొహంజొ దారోలో బైటపడిన ప్రసిద్ధ స్నానపు చెరువు గురించి మనకు తెలుసు. ఇది పట్టణవాసుల అవసరాలకోసం నిర్మించినది. గుజరాత్ వద్ద లోతల్‌లో 212 మీటర్ల పొడవు, 35 మీటర్ల వెడల్పు ఉన్న చెరువు ఆ కాలం నాటిదే, తవ్వకాలలో బైట పడింది. బహుశ దీనిని వ్యవసాయం కోసమే నిర్మించివుండాలి. మౌర్యుల కాలం వచ్చేసరికి జునాగడ్ వద్ద సుదర్శనం అనే పెద్ద చెరువు ఉండేది. దీనికి దిగువన ఉండే పొలాలకు నీటిని ఇక్కడి నుండి విడుదల చేసేవారు. ❞**



FIGURE 1.2 Plough: *Miftāhu'l Fuzalā*, AD 1469

ఈ సాంకేతిక పరిజ్ఞానం ఇరాక్‌లో క్రీ.శ.12వ శతాబ్దంలోనే ఉపయోగించేవారు. దానిని బాబర్ కాలంలో మన దేశానికి తెచ్చారు. తర్వాత అతి వేగంగా ఆ సాంకేతికత విస్తరించింది. అంతవరకూ ఎక్కడా మన సాహిత్యంలో ఈ సాంకేతిక పరిజ్ఞానం గురించిన ప్రస్తావనలు లేవు. అంటే క్రీ.శ,1400 కన్నా ముందు ఈ టెక్నాలజీ మనకు తెలియదు అని నిర్ధారించవచ్చు. ఈ టెక్నాలజీని ఉపయోగించి దిగువ మట్టంలో ఉండే చెరువు లేదా బావి నుండి నీటిని ఎగువ మట్టంలో ఉండే చెరువులోకి తోడడానికి కూడా సాధ్యం అవుతుంది. అటువంటి పద్ధతిని ఉపయోగించి ఢిల్లీ లోని ప్రసిద్ధ మొఘల్ గార్డెన్స్ కు, ఆగ్రా వద్ద ఫతేపూర్ సిక్రీ లోని కోటకు నీటిని సరఫరా చేసేవారు.

కర్రచక్రాల స్థానంలో 19వ శతాబ్దం నాటికి లోహపు చక్రాలు వచ్చాయి. ఐతే అనతికాలంలోనే డీజిల్, ఎలక్ట్రికల్ పంపు సెట్లు వాటి స్థానాన్ని ఆక్రమించుకున్నాయి. కాస్త భూమట్టానికి దగ్గరగా ఉండే బావులనుండి ఏతాములద్వారా నీటిని తోడుడం ఇటీవల కాలం వరకూ కొనసాగుతూనేవచ్చింది.

**చెరువులు, కాలువలు**

సింధునాగరికత కాలంనాటి మొహంజొ దారోలో బైటపడిన ప్రసిద్ధ స్నానపు చెరువు గురించి మనకు తెలుసు. ఇది పట్టణవాసుల అవసరాలకోసం నిర్మించినది. గుజరాత్ వద్ద లోతల్‌లో 212 మీటర్ల పొడవు, 35 మీటర్ల వెడల్పు ఉన్న చెరువు ఆ కాలం నాటిదే, తవ్వకాలలో బైట పడింది. బహుశ దీనిని వ్యవసాయం కోసమే నిర్మించివుండాలి. మౌర్యుల కాలం వచ్చే సరికి (క్రీ.పూ.3వ శతాబ్దం) జునాగడ్ (సౌరాష్ట్ర) వద్ద సుదర్శనం అనే పెద్ద చెరువు ఉండేది. దీనికి దిగువన ఉండే పొలాలకు నీటిని ఇక్కడి నుండి విడుదల చేసేవారు.

ఈ మాదిరిగా చెరువులను నిర్మించి వాటి నీటిని కాలువల ద్వారా పొలాలకు పారించే విధానం తర్వాత కాలంలో బాగా విస్తరించింది. మధ్య యుగాల నాటికి చాలా పెద్ద పెద్ద చెరువులను నిర్మించడం జరిగింది. ఆ తర్వాత కాలంలో నదీ ప్రవాహాల మీద మట్టితో కట్టలను నిర్మించి నీటిని నిలువ చేసి ఆ నీటిని కాలువల ద్వారా పొలాలకు మళ్ళించడం మొదలైంది. కట్టలు ప్రవాహపు వేగానికి కొట్టుకుపోకుండా వాటికి ముందు పెద్ద పెద్ద రాళ్ళను పేర్చేవారు. చెక్కసున్నం, గానుగ వాడకం వచ్చాక 14వ శతాబ్దంలో మరింత ఆధునాతనంగా డాముల నిర్మాణం మొదలైంది. ఫిరోజ్ తుగ్లక్ (1351–80) ఢిల్లీ వద్ద నిర్మించిన తుగ్లక్ షాహీ కాలువ చాలా ప్రసిద్ధి చెందినది. 47.5 మీటర్ల పొడవు బ్రిడ్జితో 9 ఆర్చిలతో దీనిని నిర్మించారు.

పెద్ద డ్యాముల నిర్మాణంతో పెద్ద కాలువల నిర్మాణం కూడా మొదలైంది. నదీ ప్రవాహాల వేగాలను, తీరు తెన్నులను ఎంతో నిశితంగా దీర్ఘకాలం పాటు గమనించగలిగితేనే పటిష్ట మైన సాగునీటి ప్రాజెక్టులు సాధ్యమౌతాయి. రావి నది నుండి లాహోర్ కు కాలువల ద్వారా నీటిని పంపడానికి షాజహాన్ కాలంలో చేసిన ప్రయత్నాలు రెండు సార్లు విఫలం అయాయి. మూడవసారి మాత్రమే ఫలప్రదం కాగలిగారు. కొన్ని చోట్ల నేలకు చాలా ఎత్తులో నీటి కాలువలను నిర్మించాల్సివచ్చింది. ఆనాటి మేస్త్రీల నిర్మాణ కౌశలాన్ని ఇది సూచిస్తుంది.

**గానుగ**

తొలి మధ్య యుగాల్లో వచ్చిన ఒక ముఖ్యమైన సాధనం గానుగ. పంటను కోసిన తర్వాత నూర్పిళ్ళలో పశువులను ఉపయోగించడంతో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. నూర్పే స్థలంలో మధ్యలో ఒక కర్రను పాతి దానికి అడ్డంగా మరొక పొడవాటి కర్రను కట్టి దాని చివర్న పశువును కట్టేవారు. ఆ పొడవాటి కర్రకు దిగువన కొయ్య బండను అమర్చేవారు. ఆ పశువు గుండ్రంగా తిరుగుతూవుంటే కొయ్య బండ బరువుకు ధాన్యం మొక్క నుండి వేరు పడిపోతుంది. తర్వాత కాలంలో ఈ సూత్రాన్నే అనుసరించి చెక్క సున్నం గానుగ రూపొందించారు. కొయ్య బండ బదులు బరువైన రాతి చక్రాన్ని అమర్చి పశువును గుండ్రంగా తిప్పుతూవుంటే ఆ రాతి చక్రం బరువుకు దాని కింద గాడిలో ఉంచిన సున్నపు రాయి, కంకర కలిసి బాగా నలిగి చెక్కసున్నం తయారయేది. దానితో పటిష్టమైన భవనాలను నిర్మించడం సాధ్యపడింది. అదే గానుగ సూత్రాన్ని నూనెలు, చెరకునుండి రసం వంటివి తీయడానికి కూడా ఉపయోగించారు.

ఐతే ఈ గానుగ సాంకేతికత మన దేశానికి క్రీ.శ.5వ శతాబ్దానికి గాని రాలేదు. ఆ తర్వాత ఐదు శతాబ్దాల కాలంలో ఇది దేశమంతటా విస్తరించింది.

(వ్యవసాయంలో సాంకేతికత పరిణామం రెండో భాగం తరువాయి సంచికలో)

సైన్సు

# చరిత్ర గమనంలో సైన్సు

*(2023 డిసెంబర్ 23-25 తేదీల్లో విజయవాడలో జరిగిన సైన్సు వర్క్‌షాపులో ప్రవేశపెట్టిన పత్రం నుండి)*

**డా॥ గేయానంద్**

సైన్సు లేక విజ్ఞాన శాస్త్రం అంటే ఏమిటి? సైన్సు స్వభావం ఏమిటి? చరిత్రలో సైన్స్ గమనాన్ని ఏ శక్తులు నిర్దేశించాయి? ఇప్పుడు సైన్స్ దశ దిశ ఏ విధంగా ఉన్నాయి, ఎలా ఉండాలి? చరిత్రలో సైన్స్ పరిణామం ఏ విధంగా జరిగింది? ఈ అంశాలు సైన్స్ రంగాలలో పనిచేస్తున్న వాళ్ళు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

**సైన్స్ అంటే...**

చరిత్ర గమనంలో చాలాకాలం మనిషి బతకడానికి చేసుకునే పనుల్లో, చర్యల్లో ఊహాగానాల్లో, వృత్తుల్లో సైన్సు కలగలిసిపో యిందని, దానికి ప్రత్యేక స్థానం రావడానికి చాలా కాలమే పట్టిందని ప్రఖ్యాత శాస్త్రవేత్త, 'సైన్స్ ఇన్ హిస్టరీ' గ్రంథ రచయిత జెడి బెర్నాల్ అంటాడు. ఆధునిక విజ్ఞాన శాస్త్రం ఒక 300 సంవత్సరాలుగా మాత్రమే సొంత కాళ్ళపై నిలబడి, స్వతంత్రంగా ఉందని అంటాడు. ఆధునిక సైన్సు ఒక వ్యవస్థ అని, ఒక పద్ధతి అని, సమీకృతమైన విజ్ఞానం అని, ఒక ముఖ్యమైన ఉత్పత్తి శక్తి అని, ఆలోచనలను నమ్మకాలను మలిచే ప్రబల శక్తి అనే బెర్నాల్ అంటాడు.

అయితే ఆధునిక సైన్సును, ఒక విశాలమైన నిర్వచనంలోకి తేవాలంటే, అది ఇలా ఉండొచ్చు.

"రుజువులను ఆధారంగా చేసుకున్న సువ్యవస్థిత పద్ధతుల ద్వారా విజ్ఞానాన్ని అన్వేషించడానికి, ఆచరణలో అనువర్తింప చేయటానికి, ప్రకృతిని సమాజాన్ని అర్థం చేసుకోవడానికీ చేసే కృషిని సైన్స్ అనొచ్చు."

(science is the pursuit and application of knowledge and understanding of the natural and social world, following a systematic methodology based on evidence)

చరిత్రలో సైన్స్ ఏ విధంగా పరిణామం చెందిందో చూద్దాం.

**తొలి చారిత్రక చర్య**

"....మానవజాతి మొట్టమొదట తిండి నీళ్లు నీడ సంపాదించుకున్న తర్వాతే, రాజకీయాలు సైన్సు కళా మతం మొదలైన వాటి గురించి ఆలోచిస్తుంద"ని ఎంగెల్స్ అన్నాడు.

మనిషి బతికి బట్ట కట్టడానికి అవసరమైన సరంజామా (means of subsistence) ను తయారు చేసుకునే క్రమంలోనే మనిషి జంతువు నుంచి తన్ను తాను వేరు చేసుకున్నాడు. అదే మానవజాతి తొలి చారిత్రక చర్య అని మార్క్స్ అంటాడు. ప్రకృతితో పోరాడే క్రమంలోనే, శ్రమ చేసే క్రమంలోనే, మానవ పరిణామం జరిగింది. రెండు కాళ్లపై నిలబడటం, నడవటం, పట్టుకోవడం, చేతితో వ్యవహరించడం, చూపు, ఆలోచన, మెదడు పరిణామం పెరగడం – వీటన్నింటినీ మనిషి సంతరించుకున్నది ఈ క్రమంలోనే.

సరంజామా లేక పనిముట్ల ద్వారా మనిషి ఉత్పత్తి చేస్తాడు. ఉత్పత్తి అనేది మనిషికి మౌలికమైన ఒక కార్యకలాపం. ఉత్పత్తి క్రమంలోనే మనిషి నేర్చుకుంటాడు. పరిసరాలపై నియంత్రణ సాధిస్తాడు. అయితే ఉత్పత్తిని ఒంటరిగా చేయలేడు. అది అందరితో కలిసి చేసే సామాజిక ఉత్పత్తిగానే ఉంటుంది. ఒకవైపు ప్రకృతితో మరోవైపు సమాజంతో సంబంధాల్లో ఉండి ఉత్పత్తిని చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే ఒకరికి మధ్య ఒకరికి సామాజిక సంబంధాలు ఏర్పడతాయి. అట్లే సమాజంలో భౌతిక జీవితం ఆవిర్భవిస్తుంది. ఈ క్రమంలోనే విజ్ఞానం పురోగమిస్తుంది.

ఆదిమ సమాజాలలో విజ్ఞానం సామాజిక జీవితంతో కలగల్సిపోయింది. అది



రచయిత జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు

విడిగా లేదు. అది ఒక తరం నుండి మరో తరానికి సాంస్కృతిక జీవితం ద్వారా అవిచ్ఛిన్నంగా అందడం చూస్తాం.

ఆధునిక విజ్ఞాన శాస్త్రం ఉనికిలోకి వచ్చి 300 సంవత్సరాలు మాత్రమే అయిందని ఇంతకు ముందే చెప్పుకొన్నాం. క్యాపిటలిజం తలెత్తడానికి ఉన్న పరిస్థితులే ఆధునిక సైన్సును కూడా సుసాధ్యమూ, అవశ్యమూ చేశాయి అంటాడు బెర్నాల్. చివరికి సైన్స్ విజయాలే, పారిశ్రామిక విప్లవానికి దారి తీశాయి. పారిశ్రామిక విప్లవంతో సైన్సు ఉత్పాదక శక్తులలో స్థానం సంపాదించుకుంది. చారిత్రకంగా దీనికి ఎంతో ప్రాధాన్యత ఉంది. క్యాపిటలిజం మానవ చరిత్రలో ఒక తాత్కాలిక దశగా మాత్రమే ఉంది. కానీ క్యాపిటలిజం నుంచి ఆవిర్భవించిన ఆధునిక సైన్సు, మానవజాతికి ఒక శాశ్వత ప్రక్రియగా నిలిచిపోతుంది అంటాడు బెర్నాల్.

లక్షల సంవత్సరాల మానవ జాతి పరిణామంలో, మనిషి మనుగడకు తప్పనిసరి అయిన పరిసరాల గురించిన జ్ఞానం, ఏవిధంగా ఒక శాస్త్ర రూపాన్ని సంతరించుకొందో, ఈ ప్రాసెస్ ను ఏ శక్తులు, ఏ పరిస్థితులు నడిపాయో చూద్దాం.

**పాత రాతియుగం..**
**(25 లక్షల సంవత్సరాలు)**

మానవ జాతి ప్రస్థానంలో, విజ్ఞాన అవతరణలో ఉత్పత్తి, శ్రమ, పనిముట్లు ముఖ్య పాత్ర వహించాయి. తొలి మానవజాతులకు పరిసరాల పట్ల ఉత్సుకత ఉండేది. చుట్టూ ప్రకృతిలో ఉండే దృగ్విషయాలను, పేట్రన్స్ నూ గమనించే సామర్థ్యం వీరికి ఉండేది.

మనిషి తొలి పనిముట్టు / ఆయుధం రాయే. మనిషిని పోలిన జీవి (హెూమో

> "మనం, హెూమోసెఫియన్స్ (తెలివైన వారు అని అర్థం) 1,64,000 సం.నాడు రాతిలో పెచ్చులను సులభంగా తీయడానికి నిప్పును వాడి, మెరుగైన రాతి పనిముట్లు చేశారు.1,25,000సం. నాడు నిప్పు పై విస్తృత నియంత్రణను సాధించారు. పాత రాతియుగ మంతా వేట - ఆహార సేకరణలపై ఆధార పడిన మానవ జీవితానికి ఈ రాతి పనిముట్లే ఆధారం."

హబిలెస్, ఆఫ్రికా) 25 లక్షల సంవత్సరాల నాడు రాతి పనిముట్లను వాడింది. ఈ రాతి వాడకం ఎంత వీలుగా ఉండేదంటే, మరో 10 లక్షల సంవత్సరాలు ఎటువంటి ఆవిష్కరణ లేకుండానే గడిచిపోయింది. కానీ 10 లక్షల సంవత్సరాల క్రితం మనిషి వాడిన రాతి పనిముట్లలో గుణాత్మకమైన మార్పు కనిపించింది. చరిత్రలో ఎక్కువ కాలం బతికిన మానవజాతి హెూమో ఎరక్టస్. అదొక 10 లక్షల సంవత్సరాలు జీవించింది. ఇప్పుడు లేదు. 10 లక్షల సంవత్సరాల నాడు ఈ హెూమో ఎరక్టస్ కాలంలో రాతి పనిముట్లలో కనిపించిన గుణాత్మకమైన మార్పులు, పనిముట్ల మెరుగుదల, లక్షల సంవత్సరాల పరిణామ క్రమంలో ఇతరత్రా మార్పులకు దారితీసాయి.

మనం, హెూమోసెఫియన్స్ (తెలివైన వారు అని అర్థం) 1,64,000 సం.నాడు రాతిలో పెచ్చులను సులభంగా తీయడానికి నిప్పును వాడి, మెరుగైన రాతి పనిముట్లు చేశారు. 1,25,000సం. నాడు నిప్పు పై విస్తృత నియంత్రణను సాధించారు. పాత రాతియుగమంతా వేట - ఆహార సేకరణలపై ఆధార పడిన మానవ జీవితానికి ఈ రాతి పనిముట్లే ఆధారం.

**ఎగువ పాత రాతియుగపు విప్లవం..**

శారీరకంగా ఆధునిక మానవులు, హెూమోసెఫియన్స్, (తెలివైనవారు అని అర్థం) ఆవిర్భవించి 3లక్షల సంవత్సరాలైతే, ప్రవర్తనలో ఆధునిక మానవుడు ఆవిర్భవించి 1,60,000 సంవత్సరాలు అవుతోంది. ఆఫ్రికా నుండి మొదటి మానవవలసలు 130000-10000 సంవత్సరాల మధ్య జరిగితే, రెండవ వలసలు 70,000-50000 సంవత్సరాల మధ్య జరిగాయి.

అయితే, 50వేల సంవత్సరాల నాడు (కొంచెం అటు ఇటుగా) మానవ జీవితంలో అనేక మార్పులు చక చకా వచ్చేసాయి. దీన్నే ఎగువ పాత రాతియుగపు విప్లవం అంటారు. మేమత్ ఏనుగు లాంటి పెద్ద పెద్ద జంతువులను వేటాడటం హఠాత్తుగా కనిపిస్తుంది. ఈ వేటతోపాటు, గుహల్లో కళాత్మకంగా గా కనిపించే చిత్రాలు, ఏనుగుల దంతాలు జంతువుల ఎముకలపై చెక్కిన ఆకృతులు, అలంకరణలు రంగులు వాడటం, వెదురు మోపీ, నివాస స్థలాలను ఒద్దికగా సర్దుకో వడం, సమాధుల్లో బహుమతులు పెట్టడం లాంటి ఏవేవో తంతులు, ప్రత్యేకమైన వేట పద్ధతులు, విల్లంబులు, కలపతో పడవలు, అననుకూల ప్రాంతాలకు వెళ్లడం, ఒకరికి ఒకరు ఇచ్చిపుచ్చుకోవడాలు, భాష, సంకేతాలు వాడటం - ఇటువంటివన్నీ ఒక్కసారిగా, విస్తృతంగా కనిపించాయి. కొంచెం అటు ఇటుగా, చాలా ప్రాంతాల్లో ఇటువంటి మార్పులు కనిపించాయి. దానికి ముందే చేపల వేట ఆనవాళ్లు కూడా కనిపించాయి. పెద్ద జంతువుల వేట సమాజంలో సమన్వయానికి గుర్తు. అట్లే చేపల వేట ఒక నిలకడైన నివాసాలకు దారితీస్తుంది. వివిధ రకాల ఆహారాల భరోసా కూడా దొరికింది. కొత్త కొత్త రాతి పనిముట్లు (blades flakes borings harpoons Fish hook,oil lamp, rope, eyed needle) ఉనికిలోకి వచ్చాయి.

ఇప్పటి ఆధునిక మానవ ప్రవర్తనకు, ప్రాతిపదిక అప్పుడే ఏర్పడింది.

**కొత్తరాతి యుగపు విప్లవం..**

(10,000 bc)

**వ్యవసాయం**

వేట ఆహార సేకరణపై ఆధారపడిన పాతరాతి యుగపు సమాజాలు ప్రపంచమంతటా ఏర్పడ్డాయి. అయితే పదివేల సంవత్సరాల నాడు వాతావరణ పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. మంచు యుగం ముగిసి, ఉష్ణోగ్రతలు పెరిగాయి. మంచు కరిగి, మైదానాలు ఏర్పడ్డాయి. అడవులు తగ్గిపోవడంతో, వేటాడటానికి జంతువుల కొరత ఏర్పడింది. 12-14 వేల సంవత్సరాల మునుపు దక్షిణ పశ్చిమ ఆసియాలో కొన్ని ప్రాంతాలలో రాతి కొడవళ్ళు వాడటం, అడవి గొర్రెలను మేకలను మచ్చిక చేసుకోవడం ప్రారంభించారు. మొక్కలను పెంచడం నేర్చుకున్నారు. ఇది మనిషికి ప్రకృతికి మధ్య ఒక కొత్త సంబంధాన్ని తీసుకొచ్చింది. చెట్ల మీద, జంతువుల మీద పరాన్న జీవి లాగా, బతకడం కాక, తన ఇచ్చమేరకు ప్రకృతిని నియంత్రించడం ప్రారంభించాడు. ప్రకృతి సూత్రాలు అర్థమయ్యే కొద్దీ, మరింత స్వతంత్రత సాధ్యమైంది. ఆదిమ స్థాయి వ్యవసాయమే అయినా, ఒక విస్ఫోటనం లాంటి ప్రభావం చూపింది. అంతకుముందు లేని, ఒక కొత్త సామాజిక క్రమానికి ఇది దారి తీసింది. ఆహార ఉత్పత్తి, జనాభా పెరిగి, గుణాత్మక మార్పులకు దారితీసింది. వ్యవసాయం అనేది వేటలాగా ఒక నిరంతర వ్యాపకం కాదు. అది ఋతువులను బట్టి మారుతూ ఉంటుంది. కొంతకాలం మనుషులకు వేరే పనులు చేసే అవకాశం ఉంటుంది. అవసరం ఏర్పడే కొద్ది, నాటడం, కలుపు తీయడం, నూర్చడం, కోయడం, కాల్చడం, ఉడకపెట్టడం, ఇవన్నీ మనిషి నేర్చుకున్నాడు. ఒకే చోటున స్థిరనివాసం ఉండే క్రమంలో నేయడం, కుండలు చేయడం, గుడిసెలు వేయడం నేర్చుకున్నాడు. ఇవన్నీ కలిసి వచ్చి సాంస్కృతిక జీవితంలో ఒక వేగం వచ్చింది. ఆస్తి ఉనికిలోకి వచ్చింది. మొదట్లో అది వ్యక్తి ఆస్తిగా కాకుండా సమిష్టి ఆస్తిగా ఉండేది. వేట సమాజాల్లో దొరికిన ఆహారం ఎక్కడికి అక్కడ తినేసేవారు. వేట సామాగ్రి, వంట సామాగ్రి, దుస్తులు లాంటి ఎక్కువ కాలం మన్నేవి మాత్రమే వ్యక్తిగతంగా దగ్గర ఉంచుకుని వాడుకునేవారు. కానీ వ్యవసాయక సమాజంలో, భూమి పశువులు గుడిసెలు, పంట గింజలు దాదాపు ఉమ్మడిగా ఉండేవి. వాటిని రక్షించుకోవడం, పంచుకోవడం అవసరం అయింది. మొదట్లో మతతంతుల ఆధారంగా పంచేవారు. కానీ క్రమేణా ఈ పాత పంపిణి పద్ధతికీ, వ్యక్తులుగా చేసే కొత్త వ్యవసాయ ఉత్పత్తి పద్ధతికి పొసగ లేదు. తాము పండించిన పంట తమకే కావాలనే ధోరణి వచ్చి, క్రమేణా మార్పిడి విధానం అమల్లోకి వచ్చింది. వ్యక్తిగత ఆస్తి ఏర్పడింది. ఆస్తిలో తారతమ్యాలు కూడా వచ్చాయి. అయితే సామాజిక తరగతులు స్పష్టంగా ఏర్పడింది నగరాలు ఉనికిలోకి వచ్చిన

తర్వాతే. ఈ సామాజిక ఉత్పత్తి క్రమంలోనే మనిషికి ప్రకృతిజ్ఞానం పెరుగుతూ వచ్చింది.

**తొలి విజ్ఞానాలు..**

వ్యవసాయం, ఒక కొత్త భావనను ముందుకు తెచ్చింది. అది పని అనే భావన. వేటాడే సమాజంలో పని అనేది విడిగా లేదు. వేటలో చర్యలకు తక్షణ పర్యవసానాలు కనిపించేవి. వేటలో జంతువు దొరికితే, వెంటనే తినవచ్చు. అయితే వ్యవసాయంలో చేసిన పనికీ, ఫలితం చేతిలోకి రావడానికి మధ్య అనేక అడ్డంకులు ఉంటాయి. వేటలో ఉండే ఉత్సాహం కూడా ఉండదు. అలాంటి వేట వదిలి, పంటకు మారడం అంత సులభంగా జరగలేదు. వ్యవసాయం, పశుపోషణ అర్థమయ్యే క్రమంలోనే కార్యకారణ సంబంధాలు కూడా అర్థమయ్యాయి. జంతువుల, మొక్కల జీవిత చక్రాలు పరిశీలించగలిగారు. వ్యవసాయానికి అనుబంధంగా బట్టలు నేయడం, దాన్నుండి బుట్టలు అల్లడం వచ్చాయి. దారాల, వెదరు అల్లికలో సంఖ్యకు, రూపానికి మధ్య ఉన్న సంబంధం అర్థకావడం, జామెట్రికి మొదటి కారణం అయి ఉంటుంది. కర్రతో కర్రను గిరగిరా రాపిడి కల్పించడం ద్వారా నిప్పును పుట్టించే పద్ధతి, నూలును గిరగిరా వడకటం లాంటివి తర్వాతి కాలంలో చక్రం ఆవిర్భావానికి కారణం అయివుంటుంది.


కుండలు చేయడంతో, నిప్పుపై మరింత నియంత్రణ, ఈ క్రమంలోనే లోహాలను కాల్చడం నేర్చుకున్నాడు. తొలి కాలాల రసాయనిక ప్రక్రియలకు ఇదే బీజం.

రాతి యుగంలో సాంకేతిక విజ్ఞానాన్ని వ్యాప్తి చేసిన వారు చేతి వృత్తుల వారే. ఇటువంటి విజ్ఞానం రహస్యంగా ఉండేది. కలసికట్టుగా వృత్తి రహస్యాలు కాపాడుకొనే వారు. వంశపరంపర్య వృత్తి తెగలు తయారయ్యాయి. అయితే విజ్ఞాన సూత్రాలు, మంత్ర తంత్రాలతో ముడిపడి ఉండేవి. అట్లే చెట్ల నుంచి విత్తనాలను కోసి భూమిలో నాటడం, దాని నుండి మళ్లీ చెట్లు రావడం చూసిన మనిషి, బలిని ఇవ్వడం ప్రారంభించి ఉండొచ్చు. కన్యల రక్తం, తల్లి నుంచి తీసిన పిండం మొదలైనవి బలి వస్తువులుగా వాడేవారు.

**నీటి పారుదల- పర్యవసానాలు**

వ్యవసాయం గ్రామాలు ఏర్పడటానికి దారితీసింది. వీటినే కొత్తరాతి యుగపు గ్రామాలు అంటారు. కొత్తరాతి యుగపు గ్రామాలలో స్థానిక అవసరాలను తీర్చే ఒక స్థానికమైన ఆర్థిక వ్యవస్థ ఏర్పడింది.

**“ వ్యవసాయం, ఒక కొత్త భావనను ముందుకు తెచ్చింది. అది పని అనే భావన. వేటాడే సమాజంలో పని అనేది విడిగా లేదు. వేటలో చర్యలకు తక్షణ పర్యవసానాలు కనిపించేవి. వేటలో జంతువు దొరికితే, వెంటనే తినవచ్చు. అయితే వ్యవసాయంలో చేసిన పనికీ, ఫలితం చేతిలోకి రావడానికి మధ్య అనేక అడ్డంకులు ఉంటాయి. వేటలో ఉండే ఉత్సాహం కూడా ఉండదు. ”**



పాత రాతియుగం పనిముట్లు

ఇటువంటి గ్రామాలు విస్తరించాయి. కానీ స్థానిక అవసరాలను స్థానికంగానే తీర్చుకోగలిగిన ఈ గ్రామాలలో అభివృద్ధికి అవకాశం లేకపోయింది.

జనాభా పెరిగే కొద్దీ దానితోపాటు అవసరాలు పెరిగే కొద్దీ, క్రమేణా నదీ తీరాలలో, సారవంతమైన ఒండ్రు నేలలలో వ్యవసాయం ప్రారంభమైంది. వరదలు ఆపటానికి నదులకు అడ్డుకట్టలు కట్టాల్సి వచ్చింది. దీనికోసం మనుషుల మధ్య గ్రామాల మధ్య సహకారం అవసరమైంది. నదీ లోయలలో వ్యవసాయం నుండి ఫలితాలు రావాలంటే అది విస్తృత స్థాయిలో జరగాల్సి ఉంటుంది. దానికి సామాజిక సహకారం కూడా అవసరం. నైలు నది పరివాహక ప్రాంతాల్లో ఉన్న గ్రామాలన్నీ ఒక యూనిట్‌గా తయారయ్యాయి. ఒక రెండు మూడు శతాబ్దాలలోనే ఎంతో అదనపు సంపద పోగు పడింది. మొదటి ఈజిప్టు సామ్రాజ్యం రూపొందడంలో ఈ అదనపు సంపదే ఒక పాత్ర వహించింది. పెద్దగా కొత్త సాంకేతికత అవసరం లేకుండానే, ఒక పెద్ద యూనిట్ నిర్మింపబడే క్రమమే అనుకోని మార్పులకు దారితీసింది. నదిలోయల వ్యవసాయం మొదట్లో సహజ నీటిపారుదల అవకాశాల మీద ఆధారపడింది. ఆ తర్వాత స్థానికంగా విస్తరించడానికి సాంకేతికత అవసరం ఏర్పడింది. ఇనుము వాడకంలోకి వచ్చేదాకా ఈ నాగరికత లేవీ నదీ లోయల సారవంత భూములను దాటి వెళ్లలేకపోయాయి. మెసపటోమియా, సింధు నాగరికతల పరిస్థితి కూడా ఇదే.

**నగర విప్లవం-కంచు నాగరికతలు**

కొత్త రాతియుగ విప్లవం, మసక మసకగా ఉండే చారిత్రక పూర్వ దశలో జరిగింది. కానీ క్రీస్తుపూర్వం 3000-4000 సంవత్సరాల మధ్య వచ్చిన విప్లవం సాంకేతిక రంగంలో ఎన్నో కీలకమైన మార్పులను తెచ్చింది. అంతటి సాంకేతిక అభివృద్ధి మళ్లీ 16వ శతాబ్దం వచ్చేదాకా జరగలేదంటారు. దీన్ని నగర విప్లవం అన్నారు.

ప్రపంచంలోని కంచు నాగరికతలన్నీ ఒక పెద్ద నగరం చుట్టూనే ఉన్నాయి. ఆ నగరం చుట్టూ ఉన్న పల్లె పట్టులు, నగరానికి అవసరమైన ఆహారం తదితర అవసరాలను తీర్చేవి. నగరాల్లో వ్యవసాయం మీద

> **“ యుఫ్రెటీస్, టైగ్రిస్ నదుల మధ్య ఉన్న నెలవంక వంటి ప్రాంతం సారవంతమైన ప్రాంతంగా ఉండి వ్యవసాయానికి రవాణాకు ఉపయోగపడేది. గుర్రాలను మచ్చిక చేసుకున్నారు. వస్తువుల మీద ముద్ర వేయడం ప్రారంభించారు. రాగిని ఉప యోగించారు. ఇవన్నీ ఒకే చోట కాకుండా, ఒకే దశలో కాకుం డా వివిధ చోట్ల వివిధ దశల్లో జరిగిన పరిణామాలు. దాదాపు 1000 సంవత్సరాల కాలంలో అనేక వస్తువులు కనిపెట్ట బడ్డాయి. ”**

ఆధారపడని ఇతర పనులు చేసే వాళ్ళు ఎక్కువగా ఉండేవారు. మతతంతులకు కేంద్రమైన గుడులు, దేవుళ్ళ చుట్టూ ఈ నగరాలు వెలిశాయి. చుట్టుపక్కల పల్లెలు పండించే పంటల మీద ఇవి ఆధారపడ్డాయి. అయితే నగరాల్లో వ్యవసాయంతో సంబంధం లేకుండా ప్రత్యేకమైన పని చేసే వాళ్ళు, రాతి పనివాళ్ళు, రాజ ఉద్యోగులు, పూజారులు ఉనికిలోకి వచ్చారు. శ్రమ విభజన పూర్తిస్థాయిలో మొదటి సారి జరిగింది. అయితే వీటన్నింటినీ నిర్వహించడానికి అవసరమైన నిర్మాణం కావాల్సి వచ్చింది. గ్రామానికి నగరానికి తేడా వచ్చింది.

యుఫ్రెటీస్, టైగ్రిస్ నదుల మధ్య ఉన్న నెలవంక వంటి ప్రాంతం సారవంతమైన ప్రాంతంగా ఉండి వ్యవసాయానికి రవాణాకు ఉపయోగపడేది. గుర్రాలను మచ్చిక చేసుకున్నారు. వస్తువుల మీద ముద్ర వేయడం ప్రారంభించారు. రాగిని ఉపయోగించారు. ఇవన్నీ ఒకే చోట కాకుండా, ఒకే దశలో కాకుండా వివిధ చోట్ల వివిధ దశల్లో జరిగిన పరిణామాలు. దాదాపు 1000 సంవత్సరాల కాలంలో అనేక వస్తువులు కనిపెట్టబడ్డాయి. చక్రాల బళ్లను, కుమ్మరిసారెను కనిపెట్టడం, ఇటుకలు కాల్చడం, జంతువుల్ని పనులకు ఉపయోగించడం మొదలైనవి వీటిలో ముఖ్యమైనవి. క్రీస్తుపూర్వం 3000 సంవత్సరాల నుండి ఈ సాంకేతిక విజయాలు చాలా ప్రాంతాలకు వ్యాపించాయి. రాగిని సన్నగా కొట్టడానికి వీలుందని దాన్ని కరిగించవచ్చని ఖనిజం నుంచి శుభ్రమైన రాగిని వేరు చేయవచ్చని రాగితో మిశ్రమ లోహాలను తయారు చేయవచ్చని తెలుసుకోవడానికి ఎక్కువ సమయం పట్టలేదు. క్రీస్తుపూర్వం 3000 సంవత్సరానికి భారతదేశం, మెసపటోమియా, ఆసియా మైనర్, గ్రీస్ దేశాల్లో కంచు తయారు చేయడం నేర్చుకున్నారు. లోహాల తయారీ పూర్తి కాలపు వృత్తిగా తయారైంది. లోహాలు చేసే వారిని నిపుణులుగా గౌరవించేవారు. ఆహార ఉత్పత్తిలో పాల్గొనని వారు మొదట మాంత్రికులు/ పురోహితులైతే, తర్వాత ఆహార ఉత్పత్తికి దూరమైన వారు లోహకారులే. సమాజంలోని అదనపు ఆహారపు ఉత్పత్తిపై వీరందరూ ఆధారపడేవారు. లోహాలతో చేసిన పనిముట్లు అంతకుముందు లేని ఒక కొత్త వర్గాన్ని సృష్టించాయి. ఈ వర్గం కొత్త రాతియుగం ఆర్థిక వ్యవస్థ ప్రధాన లక్షణమైన స్వయం సంపూర్ణతను నాశనం చేసింది. లోహపు పనిముట్లు కావాలనుకున్న వ్యవసాయదారుడు తన అవసరాలకు మించిన అదనపు ధాన్యాన్ని పండించి దాన్ని పనిముట్లు తయారు చేసే నిపుణుడికి ఇచ్చి వస్తు మార్పిడి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వ్యవసాయంలోకి నాగలి ప్రవేశంతో అనేక మార్పులు వచ్చాయి. ముందు గుద్దిళ్ళతో స్త్రీలు పొలాన్ని తవ్వేవారు. గుద్దలి స్థానాన్ని నాగలి ఆక్రమించింది. క్రీ.పూ 3000లో ఈజిప్టు, భారతదేశంలో నాగళ్ళు వాడుకలోకి వచ్చాయి. క్రీస్తుపూర్వం 1400లో చైనాలో నాగలి ఉపయోగించారు. ఆ తర్వాత నాగలి, రాగిలాగా ఇతర ప్రాంతాలకు వ్యాపించింది. నాగలి రాక వ్యవసాయాన్ని పూర్తిగా మార్చి వేసింది. చిన్న చిన్న కయ్యలుగా ఉన్న వ్యవసాయం పెద్ద పెద్ద పొలాలుగా మారింది. వ్యవసాయంతో పాటు పశుపాలన కూడా పెరిగింది. స్త్రీలకు వ్యవసాయం చాకిరీ తప్పింది. వ్యవసాయం స్త్రీల నుంచి పురుషుల చేతులకు మారింది. మానవ బలానికి తోడు జంతు బలాన్ని అదనంగా ఉపయోగించడం ఒక కీలక పరిణామం. బండ్లను లాగటానికి కూడా ఎద్దులను ఉపయోగపెట్టడం ప్రారంభమైంది. ఇదంతా చక్రాన్ని కనిపెట్టడానికి చాలా ముందే జరిగింది. ప్రాచీన రవాణా సాధనంగా ఉన్న మానవుడి భుజం నుండి ఈ బాధ్యత జంతువుల భుజాల మీదికి మారింది. ఒంటెను, గుర్రాన్ని, గాడిదను కూడా మచ్చిక చేసుకున్నారు. కానీ గుర్రానికి, గాడిదకు రొమ్ము పట్టకాలు బిగించడం వల్ల అవి ఊపిరాడకుండా ఇబ్బంది పడేవి. క్రీస్తు శకం తొమ్మిదో శతాబ్దం గుర్రపు మెడ పట్టీలు వచ్చే వరకు ఇది అలాగే కొనసాగింది.

క్రీస్తు పూర్వం 3000 ప్రాంతంలో నీటి మీద ప్రయాణానికి గాలి చోదక శక్తిగా ఉపయోగించబడింది. కొత్తరాతి యుగంలోని ప్రజలు రాతి పనిముట్ల తోనే వంద మంది దాకా ప్రయాణించగల పడవల్ని నిర్మించారు. సుదూరాల సముద్ర యానాన్ని చేశారు. పడవను తెరచాపను కనిపెట్టిన మానవుడు ప్రకృతిలోని కంటికి కనిపించని శక్తిని చోదక శక్తిగా ఉపయోగించడం నేర్చుకున్నాడు. ఈ రవాణా సౌకర్యాలు ఒక కొత్త వర్గాన్ని, వడ్రంగులని సృష్టించాయి.

సింధు నాగరికత (క్రీ.పూ. 2500–1700) లోని వీధులు స్నాన వాటికలు, ఇటుకలు, నగర నిర్మాణం చూస్తే వారికి ఒక స్థాయిలో ఉన్న విజ్ఞానం, గణితం సాంకేతికతలు ఉన్నాయని అర్థమవుతుంది. సింధు ప్రజలకు దశాంశ పద్ధతి బైనరీ విధానం తెలుసు. దూరాలను కచ్చితంగా కొలిచారు. సముద్ర ప్రయాణాలకు రాత్రి ప్రయాణాలకు ఇవి ఉపయోగపడి ఉంటాయి. కపాలానికి రంధ్రం వేసే చికిత్స ఉండాలి.


సింధు నాగరికతలో రైతులు, పశు పాలకులు, దేశదిమ్మరులు, బానిసలు, పట్టణ పేదలు, చేతి వృత్తిదారులు, వ్యాపారులు, మతాధిపతులు, పాలకులు ఉండేవారు.

ఇండియా, చైనా, ఈజిప్టు, మెసెపటోమియా, గ్రీసు, పర్షియా, మధ్యాసి యాలలో ఏర్పడిన కంచు నాగరికతలన్నీ ఇటువంటివే. ఆ నగరాలలో రాజస్థానాలు, సైనిక స్థావరాలు, వ్యాపారాలు, మార్కెట్లు ఉండేవి. ఇవే కళలకు శాస్త్రాలకు హస్త నైపుణ్యాలకు వాణిజ్యాలకు నెలవులయ్యాయి.

**తొలి గణితం, ఖగోళం**

పురాతన గ్రీసులో ఉండే అర్ధ నగర రాజ్యాలకు రక్షణగా దేవుళ్ళు, ఆ దేవుళ్లకు పెద్ద గుళ్ళు నిర్మించారు. ఈ గుళ్లను సమ తుల్యంగానూ కళాత్మకంగానూ నిర్మించే క్రమంలోనే గణిత సూత్రాలను అర్థం చేసుకున్నారు. ఈ గుళ్ల నిర్మాణాలు వివిధ ప్రాంతాలకు వ్యాపించడంతో గణిత సూత్రాలూ వ్యాపించాయి. ఈ గుళ్ల నిర్మాణంలో నిపుణులు

> ❝ కానీ ప్రాచీన గణితంలో వేల సంవత్స రాలకు ముందే, సూత్రీకరణల పద్ధతులు సంక్లిష్ట సిద్ధాంతాలు రూపొందిం చబడి నిలదొక్కుకున్నాయి. గ్రీకు జామెట్రీలో అనుభవ పూర్వక పద్ధతుల కంటే సిద్ధాంతాలు, సూత్రాలు, రుజువులు ముఖ్య మని భావించారు. భారతదేశంలో తొలి రోజుల్లోనే ఆల్జీబ్రా, ట్రిగ్నోమెట్రీ లాంటివి అభివృద్ధి చెంది, తర్వాత ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించాయి కూడా. ❞



కొత్త రాతియుగపు వ్యవసాయ జీవనం

పాల్గొనేవారు. ఆ పండితులకు స్థానిక చక్రవర్తుల నుండి, రాజుల నుండి, సైన్యాధికారులు, ఆస్థాన అధికారులు, కులీనుల నుండి పెద్ద ఎత్తున మద్దతు లభించేది. మరికొందరు పండితులు స్వతంత్రంగా కూడా కృషి చేసేవారు. అంకగణితం జామెట్రీలో జ్ఞానం ఈ విధంగా కూడా పురోగమించింది.

కానీ ప్రాచీన గణితంలో వేల సంవత్స రాలకు ముందే, సూత్రీకరణల పద్ధతులు సంక్లిష్ట సిద్ధాంతాలు రూపొందించబడి నిలదొక్కుకున్నాయి. గ్రీకు జామెట్రీలో అనుభవ పూర్వక పద్ధతుల కంటే సిద్ధాంతాలు, సూత్రాలు, రుజువులు ముఖ్యమని భావించారు. భారతదేశంలో తొలి రోజుల్లోనే ఆల్జీబ్రా, ట్రిగ్నోమెట్రీ లాంటివి అభివృద్ధి చెంది, తర్వాత ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించాయి కూడా.

మన దేశంలో (క్రీ పూ 600) యజ్ఞ యాగాదులకు, పూజా వేదికలకు ఖచ్చితమైన కొలతలతో నిర్మాణాలు అవసరమయ్యేవి. క్రీస్తుపూర్వం మొదటి సహస్రబ్దంలోనే బోధాయనుడి సులభ సూత్రాలు రాయ బడ్డాయి. వీటిలో ఎన్నో గణిత సూత్రాలు జామితి పద్ధతులు ఉన్నాయి. పైథాగరస్‌ను పోలిన సిద్ధాంతాలు, రెండుకు వర్గం గణించడం, 'పై' విలువ అంచనా, వివిధ కోణాలు, అర్థవృత్తాలను నిర్మించడం అందులో ఉన్నాయి. కానీ గ్రీకులు చేసినట్టుగా రుజువుల కోసం పెద్దగా ప్రయత్నం చేయలేదు (బోధాయనుడి జామితి మినహా). ఆ కాలాల అవసరాలను బట్టి, సామాజిక-సాంస్కృతిక, మత తంతులు నిర్మాణాల పరిశీలనల నుండే ఈ విజ్ఞానం రూపొందింది.

చాలా నాగరికతల్లో సూర్యుడు చంద్రుడు ఇతర గ్రహాలు, వాటి చలనాలను లెక్క కట్టే క్రమంలోనే గణితం పురోగమించింది. ప్రాథమిక నౌకాయానాలు, వ్యవసాయంలో ఋతువుల్ని గుర్తించడం, పంచాంగాలు, గ్రహక్రమాలను లెక్క కట్టడం, అంతరిక్ష సంఘటనలను ఊహించడం, రుజువుల కోసం చూడటం వంటి అవసరాల నుండే సంక్లిష్టమైన ఖచ్చితమైన గణిత పద్ధతులను ఆవిష్కరించారు. ఇందుకు భారతదేశంలో రూపొందిన పద్ధతులు కూడా (ఆల్జీబ్రా, ట్రిగ్నోమెట్రీ, ఆల్గోరిథమ్స్) దోహద పడ్డాయి. సామాజిక అవసరాలనుండి, ఉత్పత్తి పరిస్థితుల నుండే గణిత, ఖగోళ విజ్ఞానాలు మొదలయ్యాయి.

క్రీశ ఐదవ శతాబ్దం నాటి ఆర్యభట్టతో మొదలుపెడితే, దశాంస పద్ధతి, సున్నాల వాడకంతో గుణింతాలు సులభతరం అయ్యాయి. కొందరు కొత్తగా వీటిని నేర్చు కున్నారు. వారు నిలువలను నమోదు చేసుకోవడం, రాసుకోవడం లాంటి పనులు చేసే కొత్త తరగతిగా రూపొందారు. అంతవరకు ఈ పనులు ఎవరో కొందరి గుత్త సొమ్ముగా ఉండేవి.

ఆ కాలాలలో ఖగోళ శాస్త్రంలో జ్యోతిష్యం ప్రస్తావనే లేదు. ఆర్యభట్ట రాసిన జ్యోతిష అంటే కాంతివంతమైన అంతరిక్ష గోళాల అధ్యయనం అని అర్థం. అంతేకానీ జ్యోతిష్యం అని కాదు. దుష్టశక్తుల తంతులు, భవిష్యత్ పై ఊహలు ఎక్కువగా చేసిన గ్రీకు, రోమన్ల నుంచి ఈ జ్యోతిష్యం భారతదేశానికి చేరి ఉండొచ్చు.

### ఇండియాలో ఫ్యూడల్ క్రమాలు, మతం

కంచు యుగపు బృహన్ నాగరికతలన్నీ ముగిసి, ఇనుము వాడకంతో కొత్త సమాజాలు రూపు దిద్దుకోవడం ప్రారంభమైంది. పెద్ద నగరాలు వాటి చుట్టూ ఉన్న పల్లెపట్టులు, బానిస శ్రమలు, సరుకుల ఉత్పత్తి, వ్యాపారాలూ - ఇవన్నీ కూడా క్రమేణా క్షీణించాయి.

ఇనుప పనిముట్లతో విస్తారమైన అడవుల్ని నరికి వ్యవసాయ యోగ్యం చేయడం తో స్థిర వ్యవసాయ యుగం ప్రారంభమైంది. సింధు గంగ మైదానాల్లో ఒక కేంద్ర వ్యవస్థ కింద అధికార వికేంద్రీకరణ జరిగి భూ యజమాన్యం ఆధారంగా కొత్త పాలక శ్రేణులు ముందుకు వచ్చాయి. ఫ్యూడలిజం ప్రారంభమైంది. ఈ కాలాన్ని- గుప్తుల కాలం (క్రీ శ 600) నుండి - మొగలుల కాలం (16వ శతాబ్దం మధ్య)- దాకా గుర్తించవచ్చు. కోశాంబి, శర్మ, హబీబ్, ముఖియా, ఝా లాంటి మార్క్సిస్ట్ పండితులు ఈ కాల నిర్ణయంపై ఒక అంగీకారానికి వచ్చారు.

ఈ కాలంలో డబ్బు మారకం తగ్గింది. ఆ మేరకు భూమి ఇతర సేవల మధ్య మార్పిడి పెరిగింది. హస్త కళా సరుకుల విస్తృత ఉత్పత్తి తగ్గింది. వ్యాపారమూ తగ్గింది. దీనితో నగరాల ప్రాముఖ్యత తగ్గిపోయింది. ఆర్థిక వ్యవస్థలో

“ భారతదేశంలో ఫ్యూడల్ విధానం స్థిరపడటంలో అనేక కారణాలు పనిచేసేయి. పాలకుడు తనకిష్టమైన వారికి భూమి యజమాన్య హక్కులు ఇచ్చాడు. కింది కులాల వారు పైన ఉండే ఆస్తి వర్గాలకు సేవ చేసేట్టుగా బలమైన కుల వ్యవస్థ ఉపయోగ పడింది. దీన్నంతా సహజంగా దైవ నిర్ణయంగా భావించారు. అంతర్లీనంగా బ్రాహ్మణీయ వర్ణాశ్రమ ధర్మాన్ని సమర్థించారు. ”

గ్రామీణీకరణ (రూరలైజేషన్) జరిగింది. బ్రాహ్మణులకు ఇచ్చే భూదానాలు పెరిగాయి. పన్నులు వసూలు చేయడం, శాంతిభద్రతలను కాపాడటం బ్రాహ్మణుల బాధ్యతగా మారింది. సమాజంలో కుల వ్యవస్థ కాళ్లూనుకుంది. ఆర్థిక వ్యవస్థ గ్రామీణీకరణ జరిగిన ఈ సమాజాలలో పుట్టుకతోనే మనిషి ఏ వృత్తులు చేయాలో ఏ సామాజిక సాంస్కృతిక పాత్రలు నిర్వహించాలో నిర్ణయం అయి ఉంటుంది.

భారతదేశంలో ఫ్యూడల్ విధానం స్థిరపడటంలో అనేక కారణాలు పనిచేసేయి. పాలకుడు తనకిష్టమైన వారికి భూమి యజమాన్య హక్కులు ఇచ్చాడు. కింది కులాల వారు పైన ఉండే ఆస్తి వర్గాలకు సేవ చేసేట్టుగా బలమైన కుల వ్యవస్థ ఉపయోగ పడింది. దీన్నంతా సహజంగా దైవ నిర్ణయంగా భావించారు. అంతర్లీనంగా బ్రాహ్మణీయ వర్ణాశ్రమ ధర్మాన్ని సమర్థించారు.

ఈ కాలంలో మతం నిర్వహించే సామాజిక పాత్ర విజృంభించింది. అది వేద కాలాలనాటి తంతులు, బలుల మతం కాదు. అది భూమి ఆస్తిగా కలిగిన గుడి చుట్టూ ఉండే మతం. ఘనీభవించిన నమ్మకాలు, కుల వ్యవస్థతో ముడిపడి ఉండటం దీని లక్షణం. ఈ కొత్త హిందూ మతం వివిధ రూపాల్లో వివిధ శాఖలుగా ఉంది. ఇది ధర్మశాస్త్రాల రూపంలో సామాజిక విధులను, మతవిధులను సూత్రబద్ధం చేసింది. వేద సత్యాలు, శాసనాలు అయ్యాయి. కుల వ్యవస్థ బలంగా ముందుకు వచ్చింది. (ఇటువంటి క్రమాలే ప్రపంచంలోని ఇతరమతాలలో కూడా సంభవించాయి)

క్షత్రియుల, బ్రాహ్మణుల ద్వంద్వ పాలనగా ఇది సాగింది. (మధ్య యుగాల్లో యూరోప్‌లో ఉండే చర్చి లాంటి వ్యవస్థ ఇక్కడ లేకపోయినా ఇది జరిగింది). ఇదొక అధికార దొంతరల సామాజిక చట్రం. ఇది స్వతంత్రంగా మతాతీతంగా ఆలోచించే వాళ్ళను, వారి ప్రశ్నలను అనుమతించదు. అందుకే విజ్ఞానం, శాస్త్రం స్వేచ్ఛగా పురోగమించడం సాధ్యం కాలేదు. ఆర్యభట్ట కాలంలో ఉన్న వైజ్ఞానిక స్ఫూర్తి ఒక 300 సంవత్సరాలకే అడుగంటి పోయింది. ఛాందసత్వం పెరిగింది. వాదవివాదాలకు సమాధానాలు మత గ్రంథాల్లో వెతుక్కోవడం ప్రారంభమైంది. ఎనిమిదో శతాబ్దం రెండో అర్ధ భాగంలో ఆర్యభట్ట సంప్రదాయానికి వ్యతిరేకి అనీ, వేద జ్ఞానానికి వ్యతిరేకి అనీ నిందించడం కనిపిస్తుంది.

ఈ నేపథ్యంలోనే ఆర్యభట్టను చాందసవాదానికీ, సామాజిక సాంప్రదాయాలకూ ఒక ముప్పుగా భావించి ఉంటారు. అందుకేనేమో చాలాకాలం ఆర్యభట్టను కనిపించకుండా చేశారు. కానీ ఆర్యభట్ట సంస్కృతంలో రాసినది, సిరియన్, అరబిక్ భాషల్లోకి వెళ్లి దాన్నుండి లాటిన్‌లోకి తర్జుమా జరిగి, ఆ లాటిన్ తర్జుమా యూరోప్ లో 20 శతాబ్దంలో బయటపడిన తర్వాతే ఆయన వెలుగులోకి వచ్చాడు.

**భూస్వామ్యం-స్తబ్దతా కాలాలు**

గుప్తుల కాలం (క్రీ.శ. 600) తర్వాత వైజ్ఞానిక కృషికీ, చేతి పనులు, కళలకూ ఉన్న కొద్దిపాటి ఆదరణ కూడా తగ్గిపోయింది. కొత్తగా సాంకేతికతలు పెద్దగా అభివృద్ధి కాలేదు. ఏవో కొన్ని ప్రత్యేక ఉత్పత్తులు మినహా హస్తకళా ఉత్పత్తులు, వాటి వ్యాపారం క్షీణించింది.

పెద్ద సామ్రాజ్యాలు కనుమరుగై దేశమంతా చిన్న చిన్న పాలకులు వారి మధ్య యుద్ధాలతో సరిపోయింది. దక్షిణ భారతదేశంలో చోళ సామ్రాజ్యం (తొమ్మిదవ శతాబ్దం) దీనికి కొంత మినహాయింపు. ఉత్తర భారతదేశంతో రోమన్, పర్షియన్ సామ్రాజ్యాలకు వ్యాపార సంబంధాలు ఉండేవి. కానీ ఆ సామ్రాజ్యాలు క్షీణించి, స్థానిక పరిపాలకులు తల ఎత్తి, ప్రాంతీయంగా స్వయం పోషకత్వంతో తృప్తి పడటం వల్ల పెద్ద స్థాయిలో ఉత్పత్తి వ్యాపారాల అవసరం లేకుండా పోయింది. దీనితో ఉత్తర భారత దేశంలో సాంకేతిక పరిజ్ఞాన అవసరాలు కూడా తగ్గిపోయాయి. అయినా అటువంటి పరిస్థితుల్లో కూడా అక్కడక్కడ వైజ్ఞానికకృషి జరిగింది.

అయితే మేధోజీవులకూ, సామాన్యులకూ మధ్య ఏర్పడిన కులాల అంతరం వల్ల కొత్త విజ్ఞానాలేవీ సామాన్యులకు చేరే అవకాశం లేకపోయింది. అశోక స్తంభం ఉక్కు, ఊజ్ ఖడ్గం ఉక్కు, జింకు తయారీ లాంటివి ప్రఖ్యాతి గాంచినవి కొన్ని ఉన్నాయి. కానీ ముడి ఇనుము ఉత్పత్తి పద్ధతులు స్తంభించాయి.

ముడి ఇనుము తయారీలో వాడే చేతి గాలి తిత్తులలో నాణ్యత లేకపోవడం కూడా ఇందుకు కారణం కావచ్చు. (పర్షియా ఐరోపా నుంచి వచ్చిన విదేశీ యాత్రికులు ఆ విధంగా రాసుకున్నారు.) దీని ప్రభావం ఇతర రంగాలపై కూడా పడింది. ఓడ లంగర్ల తయారీలో, లోహపు ఓడల తయారీలో కూడా బలహీనతలు కనిపించాయి.

మానవుడు నేర్చుకున్న విజ్ఞానం లేదా సాంకేతికత లక్షలాది సంవత్సరాల అనుభవం ద్వారా నేర్చుకున్నవే. ఒక ప్రయత్నం చేయడం, అందులో సాఫల్య వైఫల్యాలు, కొత్త ఆలోచనలు పుట్టడం.. అదీ క్రమం. కొలిమిలో పనిచేసే వాళ్లకు ముడి ఖనిజం వేసి కాల్చడం తెలుసు, కానీ లోహ శాస్త్రం ఏమీ తెలీదు. లోహాలను వెలికి తీసి ఆయుధాలు అలంకార వస్తువులు తయారు చేయడం తెలుసు. ఈ సాంకేతిక పరిజ్ఞానం కొన్ని శతాబ్దాలుగా బాగా మెరుగవుతూ వచ్చింది.

ఇండియాలో ఉక్కు తయారీలో, మస్లిన్ అల్లకంలో, అలాగే చైనాలో పోర్సిలీన్, సిల్కు తయారీలో సాంకేతికతలు అభివృద్ధి చెందాయి. ఇవి ఒక ఆశ్చర్యకరమైన స్థాయిని అందుకున్నా, సైద్ధాంతిక పురోగమనం మాత్రం జరగలేదు. అయితే ఈ సాంకేతిక విజ్ఞానం కుటుంబాలలో, గణాలలో ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందేది. కొన్ని రంగాలలో సైద్ధాంతీకరణలు కూడా బాగానే జరిగినా, చాలా ఖాళీలు కూడా (ఇండియాలో ఆయుర్వేదం, చైనాలో సంప్రదాయక వైద్యం ఇందుకు ఉదాహరణలు.) ఉండిపోయాయి.

❋

# వేగంగా పెరుగుతున్న నిరుద్యోగం



రచయిత మార్క్సిస్టు పత్రిక ఎడిటర్

**ఎస్ వెంకట్రావు**

**మో**డీగారి వికసిత్ భారత్‌లో ఏం జరుగుతోందో తెలుసుకోవాలంటే పత్రికల్లో వచ్చిన ఒక విశేషాన్ని ముందుగా మీ ముందుంచాలి. ఇటీవల హర్యానాలో ప్రభుత్వ కార్యాలయాల్లో స్వీపర్ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానించగా 6,000 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు, 40,000 మంది గ్రాడ్యుయేట్లు, ఇంటర్ వరకు చదువుకున్న వారు మరో 1.2 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక తెలిపింది. దరఖాస్తుదారుల్లో చాలా మంది ప్రభుత్వ రంగంలో ఉద్యోగాల కోసం వేటాడే క్రమంలో ఈ పోస్టులకు కూడా ప్రయత్నిం చారు. ప్రయివేటు రంగంలో ఎంత శ్రమ పడినా నెలకు రూ. 10,000 కు మించి జీతం రావడం కష్టంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగం అయితే భవిష్యత్తు బాగుంటుందని ఈ పోస్టుకు దరఖాస్తు చేశామని మనిష్ కుమార్ అనే పోస్టుగ్రాడ్యుయేట్ పత్రికా విలేకరితో మాట్లాడుతూ చెప్పాడు.

2047 నాటికి భారత దేశాన్ని ప్రపంచం లోనే అభివృద్ధి చెందిన అగ్ర దేశంగా మారుస్తామని ప్రధాని నరేంద్ర మోడీ, ఆయన అంతేవాసులు చేస్తున్న ఊదరగొట్టు ఉపన్యాసాల హోరులో భారత దేశంలో రోజురోజుకూ పెరిగిపోతున్న యువ నిరుద్యో గుల ఘోష వినపడ్డం లేదు. ప్రపంచమంతటా యువ శ్రామిక శక్తి తగ్గిపోతుంటే భారత దేశంలో అది అత్యధిక స్థాయిలో ఉందనీ, దాన్ని ఉపయోగించుకుని దేశాన్ని ప్రపంచం లోనే ఆర్థికంగా ఉన్నత స్థాయికి తీసుకుపో వచ్చునీ పాలక వర్గ విశ్లేషకులు చంకలు గుద్దుకుంటుంటే మరోవైపు శరవేగంగా పెరిగిపోతున్న నిరుద్యోగం, ఉపాధి రాహిత్యం వారి విశ్లేషణలను వెక్కిరిస్తున్నాయి.

భారత ఆర్థిక వ్యవస్థను గమనించే స్వతంత్ర సంస్థ - సిఎంఐఇ ప్రకారం భారత దేశంలో నిరుద్యోగం 2023లో 8 శాతం నుండి 2024లో 9.2 శాతానికి పెరిగింది. దీనిలో గ్రామీణ నిరుద్యోగం 9.3 శాతానికి పెరగ్గా పట్టణ నిరుద్యోగం 8.9 శాతానికి చేరుకున్నది. సిఎంఐఇ 2008 సంవత్సరం నుండి భారత దేశంలో నిరుద్యోగ సమస్యను లోతుగా గమనిస్తున్నది. ఈ సంస్థ ఇచ్చిన లెక్కల ప్రకారం 2020 వరకు 5-6 శాతాల మధ్య దాదాపు నిలకడగా ఉన్న నిరుద్యోగం 2020 నుండి తీవ్రంగా పెరుగుతూ వస్తోంది. 2022లో 7.33 శాతం నుండి 2023కు 8.003 శాతానికీ అక్కడి నుండి 2024 నాటికి 9.2 శాతానికీ పెరిగిపోయింది.

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్ మెంట్, అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) లు సంయుక్తంగా తయారు చేసిన నివేదిక ప్రకారం భారత దేశంలో పని చేయగలవారి సంఖ్య 2011లో 61 శాతం నుండి 2021 నాటికి 64 శాతానికి పెరిగింది. 2036 నాటికి వీరి శాతం 65కు పెరుగుతుందని అంచనా వేశారు. కానీ ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొనే యువజనుల సంఖ్య 2022లో 37 శాతానికి పడిపోయిందని నివేదిక తెలిపింది.

భారత ఆర్థికాభివృద్ధిపై నిరుద్యోగ ప్రభావం అధికంగా ఉంటుంది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పులతోపాటు, కేంద్ర ప్రభుత్వ విధానాలు నిరుద్యోగాన్ని పెంచుతున్నాయి. 2008-9 సంవత్సరంలో వచ్చిన అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం ప్రపంచ వ్యాపితంగానూ మన దేశంలో కూడా నిరుద్యోగం పెరగడానికి కారణమైంది. 2016లో మోడీ ప్రభుత్వం అనాలోచితంగా తీసుకున్న నోట్ల రద్దు నిర్ణయం వల్ల అసంఘ టిత రంగం దెబ్బతిని నిరుద్యోం పెరిగింది. తరువాతి సంవత్సరం కేంద్రం ప్రవేశపెట్టిన జిఎస్‌టి పన్ను విధానం కూడా చిన్న, మధ్య తరగతి పరిశ్రమలనూ, వ్యాపారాలనూ దెబ్బతీయడంతో నిరుద్యోగంపై ప్రభావం పడింది. కోవిడ్ మహమ్మారి 2020లో ఉపాధిమీద పెద్ద దెబ్బ కొట్టింది.

కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల గత మూడేళ్లుగా నిరుద్యోగం మరింత వేగంగా పెరుగుతోంది. ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపోవడం, నిలకడైన ఉపాధి లేకపోవడం తో ప్రజల కొనుగోలు శక్తి తీవ్రంగా పడిపోతున్నది. దాంతో సరుకులు, సేవలకు దేశీయ మార్కెట్‌లో గిరాకీ పడిపోయి పారిశ్రామికాభివృద్ధి, వ్యాపారాలు నేలచూపులు చూస్తున్నాయి. ఇవన్నీ నిరుద్యోగం పెరుగుదలకు దారితీస్తున్నాయి.

**యువతలో ఎక్కువ..**

భారత దేశంలో నిరుద్యోగ సమస్య ప్రధానంగా యువతలో ఎక్కువగా ఉంది. ముఖ్యంగా సెకండరీ, ఉన్నత విద్యావంతుల్లో మరీ ఎక్కువగా ఉంది. గత కొద్ది సంవత్స రాలుగా వీరిలో నిరుద్యోగం తీవ్రంగా పెరుగుతూ వస్తోంది.

2022 లెక్కల ప్రకారం దేశంలోని నిరుద్యోగుల్లో 82.9 శాతం మంది యువతీ యువకులేనని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) తెలిపింది. ఉద్యోగాలు లభించిన వారిలో కూడా 82 శాతం మంది అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. వారిలో 90 శాతం మందికి అస్థిరమైన ఉద్యోగాలు లభిస్తున్నాయి.

మొత్తం నిరుద్యోగ యువకుల్లో బాగా చదువుకున్న వారి సంఖ్య విపరీతంగా పెరిగిపోతున్నదని ఐఎల్‌ఓ తెలిపింది. 2000 సంవత్సరంలో మొత్తం నిరుద్యోగ యువకుల్లో 54.2 శాతం మంది ఉన్నత విద్యా వంతులు కాగా వారి సంఖ్య 2022 నాటికి 65.7 శాతానికి పెరిగిపోయింది. చదువుకున్న యువతలో కూడా యువతుల్లో నిరుద్యోగం

**" భారత దేశంలో ముఖ్యంగా స్వయం ఉపాధి రంగం ధారుణంగా ఉంది. 2022 లెక్కల ప్రకారం ఉద్యోగం పొందిన భారతీయుడు సగటున నెలకు 19,000 రూపాయలు వేతనం పొందుతుంటే, స్వయం ఉపాధి రంగంలో సగటు భారతీయుడు రూ. 11,973 మాత్రమే ఆదాయం పొందుతున్నాడు. క్యాజువల్ కార్మికుడు సగటున నెలకు కేవలనం రూ.8,267 మాత్రమే వేతనం పొందు తున్నాడు. ఇందులో కూడా స్త్రీ పురుషుల మధ్య తీవ్రమైన వ్యత్యాసం ఉంటోంది. "**

ఎక్కువగా ఉంది. 2022 లెక్కల ప్రకారం విద్యావంతులైన (సెకండరీ, అంతకన్నా ఎక్కువ చదువుకున్న) యువకుల్లో 62.2 శాతం నిరుద్యోగులు కాగా యువతుల్లో 76.7 శాతం నిరుద్యోగాన్ని ఎదుర్కొంటున్నారని యువజన ఉపాధి నివేదిక 2024లో ఐఎల్ఓ తెలిపింది.

మొత్తం నివేదికను పరిశీలిస్తే భారత దేశంలో నిరుద్యోగం పట్టణ యువతలో ముఖ్యంగా చదువుకున్న యువతలో మరీ ముఖ్యంగా యువతుల్లో కేంద్రీకృతం అయిందని తెలుస్తోంది.

### చదువుకున్న యువతలో నిరుద్యోగం ఎక్కువ

ఇంకా ఆసక్తికరమైన విషయం ఏమంటే, 2022 లెక్కల ప్రకారం చదవనూ, రాయనూ రాని నిరక్షరాశ్యులైన యువతలో 3.4 శాతం నిరుద్యోగం ఉంటే సెకండరీ విద్య పూర్తిచేసిన వారిలో దాని కన్నా ఆరు రెట్లు (18.4 శాతం), గ్రాడ్యుయేట్లలో తొమ్మిది రెట్లు (29.1 శాతం) ఎక్కువ నిరుద్యోగం ఉంది. విద్యావంతులైన యువతుల్లో ఇది మరింత ఎక్కువగా ఉంది. సెకండరీ విద్య నభ్యసించిన యువకుల్లో 17.5 శాతం నిరుద్యోగులుగా ఉంటే యువతుల్లో 21.4 శాతం మంది ఉన్నారు. గ్రాడ్యుయేట్ల యిన యువకుల్లో 26.4 శాతం మంది నిరుద్యోగులు కాగా యువతుల్లో 34.5 శాతం మంది ఉన్నారు.

పరిశ్రమలు, సర్వీసు రంగంలో పాతవారి కన్నా కొత్తగా ఉద్యోగాలు పొందిన యువత ఎక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ వీరికి లభించిన ఉద్యోగాల నాణ్యత చాలా అధ్వాన్నంగా ఉందని నివేదిక తెలియజేసింది. వీరిలో చాలా మంది స్వయం ఉపాధి పొందడమో లేకుంటే జీతాల్లేని కుటుంబ పనుల్లోనో క్యాజువల్ కార్మికులుగానో చేస్తున్నారు. అందువల్ల వీరి వేతనాలు కూడా తక్కువగా ఉంటున్నాయి.

82 శాతం మంది కార్మికులు అసంఘటిత రంగంలో జీవనోపాధి చూసుకోవడమే కాదు, సంఘటిత రంగంలో కూడా గణనీయమైన సంఖ్యలో కార్మికులు అసంఘటిత కార్మికులుగా నియమించబడుతున్నారు. సంఘటిత రంగాన్ని అసంఘటితం గావించడం ఈ కాలంలో స్పష్టంగా కనిపిస్తున్న ధోరణి అని ఐఎల్ఓ తెలిపింది. 2019 నుండి 2022 మధ్య ఈ ధోరణి విపరీతంగా పెరిగిందని అది వెల్లడించింది.

భారత దేశంలో 50 మంది స్వయం ఉపాధి రంగంలో ఉపాధి పొందుతున్నారని, ఇది ప్రపంచంలోనే అత్యధికమని ఐఎల్ఓ నివేదించింది. ఒకరిమీద ఆధారపడకుండా స్వయం ఉపాధి చూసుకోవాలని మన నేతలు నిత్యం చేసే ప్రచారాన్ని చూసి ఇది మంచిదే అని అనుకోడానికి లేదు. ఎందుకంటే భారత దేశంలో ముఖ్యంగా స్వయం ఉపాధి రంగం ధారుణంగా ఉంది. 2022 లెక్కల ప్రకారం ఉద్యోగం పొందిన భారతీయుడు సగటున నెలకు 19,000 రూపాయలు వేతనం పొందుతుంటే, స్వయం ఉపాధి రంగంలో సగటు భారతీయుడు రూ. 11,973 మాత్రమే ఆదాయం పొందుతున్నాడు. క్యాజువల్ కార్మికుడు సగటున నెలకు కేవలనం రూ. 8,267 మాత్రమే వేతనం పొందు తున్నాడు. ఇందులో కూడా స్త్రీ పురుషుల మధ్య తీవ్రమైన వ్యత్యాసం ఉంటోంది. ముఖ్యంగా స్వయం ఉపాధి రంగంలో స్త్రీలకు ఆదాయం మరీ తక్కువగా వస్తోంది. వాస్తవానికి వారి కష్టాన్ని లెక్కించడం లేదు.

### శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు

భారత దేశంలో యువత ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొనే రేటు అంటే శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు (లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేటు) కూడా గణనీయంగా తగ్గిపోతున్నది. 2000 సంవత్సరంలో ఈ రేటు 54 శాతం ఉండగా 2022 నాటికి 42 శాతానికి పడిపోయింది.

శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు అంటే ఆర్థిక వ్యవస్థలో పనిచేస్తున్న లేదా 16-64 సంవత్సరాల వయస్సు గల శ్రామిక జనాభాలో ఉపాధి కోరుకునే వారి జనాభా శాతం. ఇది ఒక కీలకమైన ఆర్థిక సూచిక. గత రెండు దశాబ్దాలుగా ఇది గణనీయంగా పడిపోయింది. జనాభాలో కార్మికుల సంఖ్య కూడా 2000 సంవత్సరంలో 60.2 శాతం నుండి 2022 నాటికి 52.9 శాతనికి పడిపోయింది. కార్మిక భాగస్వామ్య రేటు కూడా పురుషుల్లో కన్నా మహిళల్లో ఎక్కువ పడిపోయింది. 2000 -2022 మధ్య పురుషుల్లో ఇది 8.1 శాతం పడిపోగా మహిళ్లో 14.4 శాతం పడిపోయింది.

### ఉన్నత నైపుణ్యం గల ఉద్యోగాలు తగ్గుతున్నాయి

2000 - 2019 సంవత్సరాల మధ్య మొత్తం ఉద్యోగాల్లో నైపుణ్యాలు గల ఉద్యోగాలు, పెరుగుతూ వచ్చాయి. ఈ కాలంలో మధ్యస్థాయి, ఉన్నత స్థాయి నైపుణ్యం గల ఉద్యోగాలు 5.1 శాతం నుండి 9.6 శాతానికి పెరగగా తక్కువ నైపుణ్యం గల ఉద్యోగాలు 60.5 శాతం నుండి 65.1 శాతం పెరిగాయి. నైపుణ్యం లేని ఉద్యోగాలు ఈ కాలంలో 34.4 శాతం నుండి 25 శాతానికి తగ్గాయి. కానీ 2019-2022 మధ్య ఈ ధోరణి తిరగ బడింది. ఈ కాలంలో తక్కువ నైపుణ్యం గల ఉద్యోగాలు పెరుగుతూ, మధ్య, ఉన్నత స్థాయి నైపుణ్యం గాల ఉద్యోగాలు తగ్గుతూ వచ్చాయి.

స్కిల్ ఇండియా పేరుతో యువతలో నైపుణ్యాలు పెంచుతున్నామనీ, వారిని యువ వ్యాపార వేత్తలుగా మారుస్తున్నామని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేస్తున్న ఊకదంపుడు ఉపన్యాసాల వెనుక డొల్లతనాన్ని క్షేత్రస్థాయిలోని వాస్తవాలు ఎండగడుతున్నాయి. యువకుల నైపుణ్యాలు పెంచి వారిని పారిశ్రామిక కార్మికులుగా తీర్చిదిద్దేందుకు దేశవ్యాపితంగా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐటిఐ)లు నెలకొల్పారు. కానీ ఐటిఐల నుండి వస్తున్న తాము నిరుద్యోగులుగా, బికారులుగా మారుతున్నా మనీ, ఉద్యోగాలు రావడం లేదని ఇటీవల దేశ వ్యాపితంగా జరిపిన ఒక సర్వేలో ఐటిఐ విద్యార్థులు వాపోయారు. రెండేళ్ల క్రితం ప్రధాని నరేంద్ర మోడీ దాదాపు 40 లక్షల మంది ఐటిఐ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ నైపుణ్యం, పునఃనైపుణ్యం, మరింత నైపుణ్యం అనేదే మీ మంత్రంగా ఉండాలి, గత ఎనిమిది సంవత్సరాల్లో ఐటిఐల్లో లక్షలాది సీట్లు పెంచాం. విద్యార్థులకు కొత్త ఉద్యోగావ

కాశాలు సృష్టించాం అని చెప్పారు. కానీ వాస్తవం దానికి పూర్తి భిన్నంగా ఉంది.

రెండేళ్లలో యువకులకు వృత్తి విద్య నేర్పిస్తే వారు పరిశ్రమలకు కావలసిన కార్మికులుగా ఉద్యోగాలు పొందుతారనీ, దాని వల్ల ఒకవైపు పరిశ్రమలకు నిపుణులైన కార్మికుల కొరత తీరుతుంది, మరోవైపు బాగా చదువుకున్న యువతలో నిరుద్యోగ సమస్య తీరుతుందనే ఉద్దేశంతో ఐటిఐలు నెలకొల్పారు. ప్రస్తుతం దేశ వ్యాపితంగా ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో దాదాపు 15,000 ఐటిఐలు ఉన్నాయి. పరిశ్రమలు నెలకొల్పినప్పుడు భూములు కోల్పోయిన వారి పిల్లలకు శిక్షణ ఇచ్చి ఆయా పరిశ్రమల్లో నియమించడం కోసం 1950వ దశకంలో వీటిలో అనేక ఐటిఐలను నెలకొల్పారు. కానీ ఈ రోజు ఐటిఐ చదివిన వారికి ఉద్యోగాలు వస్తాయన్న గ్యారంటీ లేకపోవడంతో వాటిలో చేరడానికి అనేక మంది నిరాకరిస్తున్నారు. ఐటిఐల్లో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లు ప్రధానమైనవి. కానీ దేశవ్యాపితంగా ఫిట్టర్ సీట్లలో 71.5 శాతం, ఎలక్ట్రీషియన్ సీట్లలో 64.8 శాతం సీట్లు ఖాళీగా ఉండిపోతున్నాయని నీతి ఆయోగ్ 2023 నివేదికలో తెలిపింది.

**❝ప్రభుత్వాలు నెలకొల్పిన నైపుణ్య సంస్థల్లో శిక్షణ పొందిన వారికే ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వాలు ఇప్పుడు నెపాన్ని యువతపై నెట్టడానికి కొత్త రాగం అందుకు న్నాయి. దేశంలో ఉద్యోగాలు చాలా ఉన్నాయి. కానీ ఆ ఉద్యోగాలు పొందడానికి కావలసిన నైపుణ్యాలు యువకుల వద్ద లేవని వాదన ఎత్తుకున్నాయి. వాస్తవానికి 1990వ దశకం తరువాత దేశంలో పారిశ్రామిక ఉత్పత్తి రంగం తగ్గిపోయి సర్వీసు రంగం పెరగడంతో ఉద్యోగాల తీరులో కూడా మార్పు వచ్చింది.❞**

ప్రభుత్వాలు నెలకొల్పిన నైపుణ్య సంస్థల్లో శిక్షణ పొందినవారికే ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వాలు ఇప్పుడు నెపాన్ని యువతపై నెట్టడానికి కొత్త రాగం అందుకు న్నాయి. దేశంలో ఉద్యోగాలు చాలా ఉన్నాయి. కానీ ఆ ఉద్యోగాలు పొందడానికి కావలసిన నైపుణ్యాలు యువకుల వద్ద లేవని వాదన ఎత్తుకున్నాయి. వాస్తవానికి 1990వ దశకం తరువాత దేశంలో పారిశ్రామిక ఉత్పత్తి రంగం తగ్గిపోయి సర్వీసు రంగం పెరగడంతో ఉద్యోగాల తీరులో కూడా మార్పు వచ్చింది. వచ్చే ఉద్యోగాలు కూడా సాఫ్ట్‌వేర్ సర్వీసులు, మాల్స్, హోటల్స్, పర్యాటకం, హౌస్‌కీపింగ్, సెక్యూరిటీ వంటి రంగాల్లో లభిస్తున్నాయి. పారిశ్రామిక రంగంలో ఉపాధి రహిత అభివృద్ధి నిరుద్యోగాన్ని మరింతగా పెంచుతోంది. అందువల్ల నైపుణ్యాలు పొంది ఉద్యోగాలు చేయాల్సిన అవసరం లేదు యువకులు పారిశ్రామిక వేత్తలుగా మారి మీరే ఉద్యోగాలు ఇచ్చే స్థితికి ఎదగాలి అన్న కొత్త నినాదాన్ని కేంద్ర పాలకులు అందుకున్నారు. అందుకే 2009లో రూపొందించిన జాతీయ నైపుణ్యాభివృద్ధి విధానాన్ని 2015లో జాతీయ నైపుణ్యాభివృద్ధి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (పారిశ్రామికవేత్తల) విధానంగా మార్చివేసింది. ప్రతి యువకుడు బ్యాంకు లోన్లు తీసుకుని పరిశ్రమలు స్థాపించి ఇతరులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నది ప్రభుత్వ నినాదం. కానీ అందరూ పారిశ్రామిక వేత్తల యితే కార్మికులుగా పనిచేసేవారెవరో అది చెప్పడం లేదు. పోనీ నిరుద్యోగ యువత పారిశ్రామిక రంగంలో రాణిద్దామంటే వారికి పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు. బ్యాంకు రుణాలు పొందాలంటే వారివద్ద హామీ పెట్టడానికి ఆస్తులూ లేవు. చివరికి పాలకులు యువతకు ఇటు ఉద్యోగాలూ లేకుండా చేస్తోంది, ఇటు స్వయం ఉపాధి పొందడం వారికి కష్టమవుతోంది.

**ఎస్సీ, ఎస్టీల వెనుకబాటు**

రిజర్వేషన్లు ఉన్నప్పటికీ ఈ కాలంలో ఎస్సీ, ఎస్టీలు ఉద్యోగాలు పొందడంలో వెనుక బడిపోయారు. ఆర్థికావసరాల దృష్ట్యా ఎస్సీ, ఎస్టీలు ఏదో ఒక ఉపాధిలో చేరాల్సిన పరిస్థితుల వల్ల వారు తప్పని సరిగా ఉద్యోగాల చేస్తున్నప్పటికీ వారిలో అత్యధికం తాత్కాలిక, క్యాజువల్ ఉద్యోగాల్లో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

ఇక భౌగోళికంగా చూసినట్లయితే 2022లో రెగ్యులర్, ఫార్మల్, ఆర్గనైజ్డ్ రంగంలో ఉద్యోగాలు పొందిన వారిలో మధ్య భారత, తూర్పు భారతంలో కన్నా దక్షిణ, పశ్చిమ, ఈశాన్య ప్రాంతాల్లో ఎక్కువ మంది ఉన్నారని ఐఎల్‌ఓ నివేదిక తెలిపింది.

**పెరుగుతున్న శతకోటీశ్వర్లు**

మోడీ పాలనా కాలంలో ఒకవైపు నిరుద్యోగ సైన్యం విపరీతంగా పెరుగుతుంటే మరోవైపు శతకోటీశ్వరుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోంది. 2024 ఫోర్బ్స్ పత్రిక లెక్కల ప్రకారం ఒక్క సంవత్సరంలోనే భారత దేశంలో డాలరు శతకోటీశ్వర్లు (అంటే 8,000 కోట్ల కన్నా అధిక ఆస్తులు ఉన్న వారు) 25 మంది పెరిగారు. ఇప్పుడు దేశంలో శతకోటీశ్వరుల సంఖ్య 200కు చేరుకున్నది. ఆర్థిక సంక్షోభం, నోట్ల రద్దు, కోవిడ్, ద్రవ్యోల్బణం ఇవన్నీ సామాన్య ప్రజలను దెబ్బతీయొచ్చుగాక, నిరుద్యోగుల సంఖ్య పెరగొచ్చుగాక కానీ ధనికుల ఆదాయాలకు ఏమాత్రం ఢోకాలేకుండా మోడీ పాలన చూసుకుంటోంది.

అంబానీ లాంటి ధనికుల ఇళ్లలో జరిగే పెళ్లి వినోదాలు, విందుల్లో చాలా మంది నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన జరుగుతోందనీ, మోడీ వికసిత్ భారత్‌కు ఇంతకన్నా నిదర్శనమేముందని ఒక వ్యంగ్యాస్త్రం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. అవును కదా! పరిశ్రమల్లో ఉద్యోగాలు లేకపోయినా ధనికుల మోచేతి కింది నీళ్లు తాగి బ్రతికే అవకాశాలు కల్పిస్తున్నందుకు మోడీ ప్రభుత్వానికి ఈ దేశంలోని యువకులంతా కృతజ్ఞతలు తెలపాలి! ❊

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

# ప్రైవేటు విషకౌగిలిలో వైద్యరంగం



రచయిత మూడు దశాబ్దాల నుండి ప్రజా వైద్యరంగంలో పని చేస్తున్నారు

వందనా ప్రసాద్

విస్తారమైన ప్రజలతో కూడిన భారతదేశం వారసత్వంగా సంక్రమించిన ప్రజల ఆరోగ్య సంరక్షణ సమస్యల భారాన్ని మోస్తున్నది. దక్షిణ, ఆగ్నేయాసియా దేశాలలోనూ ఇదే పరిస్థితులు ఉన్నాయి. దారిద్ర్యం, ఆహార అభద్రత, మహిళల పట్ల తీవ్రమైన వివక్ష తదితరాలు ఈ ప్రాంతంలోని ప్రజలకు సంక్రమిస్తున్న ఆరోగ్య సమస్యలకు ప్రధాన కారకాలు.

నూతనంగా స్వాతంత్ర్యం సాధించుకున్న దేశంగా భారతదేశం ప్రజల అత్యవసర ఆరోగ్య సమస్యలను పరిష్కరించటం కోసం తగిన ప్రజారోగ్య విధానాన్నీ, కార్యక్రమాలను రూపొందించింది. 1946లో భోరే కమిటి నుండి 2010లో ప్రణాళికా సంఘం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి నిపుణుల కమిటి (హెచ్‌ఎల్‌ఇజి) వరకు వివిధ కమిటీలు రూపొందించిన నివేదికలలో ఈ అంశాలు భాగంగా ఉన్నాయి. వైద్యరంగంలో ఈ రోజు వరకు అమలులో ఉన్న వివిధ అంచెల నిర్మాణాన్ని ఈ కమిటీలు రూపొందించాయి. రోగాలను నయం చేయటంతో పాటు అనారోగ్యాన్ని నివారించటం, ఆరోగ్యాన్ని పెంపొందించే అంశాలకు కూడా ఈ కమిటీలు సమ ప్రాధాన్యత ఇచ్చాయి. ఆరోగ్యాన్ని పెంపొందించటంలో సామాజికాంశాల పాత్రను కూడా తమ నివేదికలలో ప్రముఖంగా పేర్కొన్నాయి. 1978లో ఆల్మాఅటా (ప్రస్తుత కజకస్తాన్‌లో ఉంది)లో జరిగిన సమావేశం ఇచ్చిన "అందరికీ ఆరోగ్యం" అన్న ఉత్తేజకరమైన నినాదం ఆరోగ్యాన్ని ప్రజల ప్రాథమిక హక్కుగా గుర్తింపజేయటంలో మరింత ముఖ్యమైన పాత్ర నిర్వహించింది. ఆరోగ్యాన్ని సమగ్రంగా పరిరక్షించటానికి ప్రాధాన్యత ఇవ్వటం మాత్రమే కాక, ప్రజల ఆరోగ్య పరిరక్షణ ప్రభుత్వ బాధ్యతగా కూడా నిర్ధారించింది. ఇందుకోసం విధానపరంగా, నిర్మాణపరంగా అవసరమైన మార్పులతో పాటు అత్యవసరమైన ఆర్థిక, మానవ వనరులను కేటాయించటం అవసరమని చెప్పింది.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు అవుతున్నది. 1980 తర్వాత ప్రజారోగ్యంపై ప్రభుత్వ విధానాలలో వ్యక్తమౌతున్న ధోరణులను, తిరోగమనాన్ని ఈ వ్యాసంలో పరిశీలిద్దాం. 2030 నాటికి పెట్టుకున్న మూడు లక్ష్యాలలో భాగమైన "మంచి ఆరోగ్యం, సుఖమైన జీవితం" అన్న దానిని సాధించటంలో దేశం ఎక్కడ ఉందన్నదో కూడా పరిశీలిద్దాం.

సమగ్రమైన ఈ లక్ష్యాలలో భాగమైన తల్లిపిల్లల మరణాలు, అంటువ్యాధులను అరికట్టటంలో (ఎస్‌డిజి 3.1, 3.2, 3.3) అభివృద్ధిని సాధించామన్న దానిలో సందేహం లేదు. మనం వివరాలను పరిశీలించినట్లైతే సంక్లిష్టతలు కనిపిస్తాయి. 1970లలో ప్రసవ సమయంలో తల్లుల మరణాలు లక్షకు 398గా ఉండగా, 2020 నాటికి 99కి తగ్గాయి. అలాగే 1992–93లో జరిగిన నేషనల్ ఫ్యామిలి హెల్త్ సర్వే–1 నుండి 2019–21 లో జరిగిన ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ 5వ సర్వే నాటికి పోషకాహారలోపంతో ఉన్న పిల్లలు గిడసబారిపోవటం 51.9 శాతం నుండి 34.1 శాతానికి, ఎత్తుకు తగిన బరువు లేనివారు 45.8 శాతం నుండి 29.4 శాతంకు తగ్గినట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. 1990–2019 మధ్య 30 సంవత్సరాల కాలంలో దేశంలో లక్షమంది పిల్లలకు మరణాలు 390 నుండి 223కు, టిబి వలన సంభవిస్తున్న మరణాలు 122 నుండి 36కు తగ్గాయని గ్లోబల్ బర్డన్ ఆఫ్ డిసీజ్ అంచనాలు వెల్లడిస్తున్నాయి. మొత్తంగా చూసినపుడు 1980 దశాబ్దంలో సగటు జీవిత కాలం 54 సంవత్సరాలు కాగా ప్రస్తుతం 70 సంవత్సరాలకు పెరిగింది.

ప్రపంచం అంతటా జరిగినట్లుగానే భారతదేశంలో కూడా అధిక బరువు, ఊబకాయం ఉన్నవారి సంఖ్య త్వరగా పెరగటం, ఫలితంగా సుగర్, బిపి లాంటి వ్యాధులు బాగా ఎక్కువ కావటంతో అంటువ్యాధులను అరికట్టటం, పోషకాహార లోపాన్ని తగ్గించటంలో సాధించిన ప్రగతి మరుగున పడిపోయింది.

జీవితకాలం పెరగటంతో పాటు క్యాన్సర్ లాంటి వ్యాధులు ఎక్కువ అవటం వలన వృద్ధాప్యానికి సంబంధించిన జబ్బులు కూడా పెరుగుతున్నాయి. ఈ అంశాలలో భారతదేశం సస్టైనబుల్ గోల్స్‌లో 3.4 నుండి 3.9 వరకు ఉన్న లక్ష్యాలను సాధించలేకపోయింది. 1990లో సుగర్ వ్యాధిగ్రస్తులు 5.5 శాతం ఉండగా, ఇపుడు 8–16 శాతంకు పెరిగింది– వాస్తవంలో ఈ సంఖ్య పెరగటం నాటకీయంగా జరిగింది–. ప్రస్తుతం 10 కోట్లమంది సుగర్ వ్యాధిగ్రస్తులతో ప్రపంచంలో అత్యధిక సుగర్‌వ్యాధి బాధితులు ఉన్న దేశంగా భారతదేశం ఉంది. వీటితో పాటు పర్యావరణం కలుషితం కావటం, వాయు కాలుష్యం వలన వ్యాధులకు గురవుతున్నవారిలో పేదలు, అట్టడుగు తరగుతులు, మహిళలు, పిల్లల సంఖ్య ఎక్కువగా ఉంటున్నది.

సాధించిన వాటిని పరిశీలిస్తే కొన్ని వాస్తవాలు వెల్లడౌతాయి. మొదటిది, సాధించిన వాటిలో సానుకూలమైన అంశాలు తక్కువగా ఉన్నాయి. దశాబ్దాల తరబడి వివిధ

ప్రణాళికలలో సాధించాలని పెట్టుకున్న లక్ష్యాలతో పోల్చుకుంటే సాధించినది మరీ తక్కువగా ఉన్నది. రెండవది, వర్గం, లింగం, కులం, గిరిజనులు, మైనారిటీల వారీగా సమాచారాన్ని విభజించి, ప్రత్యేకంగా మరీ బలహీనంగా ఉన్న, అశక్తులైన, వివిధ సంస్థల పర్యవేక్షణలో ఉన్న, వీధులలో నివసించే వారి పరిస్థితులను లోతుగా పరిశీలిస్తే నిర్ఘాంత పోయే వాస్తవాలు వెల్లడౌతాయి.

## వాస్తవాలను సేకరించలేదు

ప్రస్తుతం సమాజంలో అసాధారణంగా, ఏ మాత్రం ఆమోదయోగ్యం కానంతగా ఉన్న అసమానతలను వెల్లడించటానికి అవసరమైన వాస్తవాలను సేకరించలేదు. అందువలన విస్తృత అంశాల ప్రాతిపదికగా మాత్రమే చేసిన పరిశీలనలో అసమానతలు వెల్లడౌతున్నాయి. నీతి ఆయోగ్ 2019-20లో చేసిన 4వ రౌండ్ అధ్యయనం ద్వారా వివిధ అంశాలతో రూపొందించిన ఆరోగ్య సూచికలో, పెద్ద రాష్ట్రాలలో కేరళ, తమిళనాడు, తెలంగాణ పైస్థాయిలో ఉండగా, ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్‌లు అట్టడుగు స్థాయిలో ఉన్నాయి. ఈ సమ్మిళిత సూచికలోని వివరాలు కూడా తీవ్రంగా ఉన్న వ్యత్యాసాలను వ్యక్తం చేస్తున్నాయి. కేరళ 82 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, ఉత్తరప్రదేశ్ 31 పాయింట్లతో అట్టగుడున ఉన్నది.

వివిధ తరగతుల మధ్య జీవితకాల వ్యత్యాసం కూడా అసమానతలను వెల్లడిస్తున్నది. అతి తక్కువ సంపద మాత్రమే ఉన్న దిగువ 20 శాతం కుటుంబాలలోని పురుషుల జీవితకాలం అతి తక్కువగా, 62.2 సంవత్సరాలు మాత్రమే ఉండగా, పట్టణప్రాంతాలలో అత్యధికంగా సంపద ఉన్న పై 20 శాతం కుటుంబాలలోని మహిళలు అత్యధికంగా 77 సంవత్సరాలు జీవిస్తున్నారు. వీరి జీవితకాలంలో సగటున 15 సంవత్సరాల వ్యత్యాసం ఉన్నది. ప్రస్తుతం ధనికులలో సుగర్ వ్యాధి ఎక్కువగా ఉన్నది. అత్యంత ధనికులు దిగువస్థాయిలోని 20 శాతం పేదల కన్నా ఎక్కువ అవగాహనతో ఉంటూ, వ్యాధికి చికిత్స చేయించుకొంటూ, జబ్బును అదుపులో ఉంచుకొంటున్నారు.

“ వివిధ తరగతుల మధ్య జీవితకాల వ్యత్యాసం కూడా అసమానతలను వెల్లడిస్తున్నది. అతి తక్కువ సంపద మాత్రమే ఉన్న దిగువ 20 శాతం కుటుంబాలలోని పురుషుల జీవిత కాలం అతి తక్కువగా, 62.2 సంవత్సరాలు మాత్రమే ఉండగా, పట్టణప్రాంతాలలో అత్యధికంగా సంపద ఉన్న పై 20 శాతం కుటుంబాలలోని మహిళలు అత్యధికంగా 77 సంవత్సరాలు జీవిస్తున్నారు. ”

భారతదేశం అత్యంత తీవ్రమైన ఆరోగ్య సంక్షోభంలో ఉన్నదన్న అంశంలో ఏ మాత్రం సందేహం లేదు. దానిని పరిష్కరించటం కోసం ఎక్కువ నిధులను అందుబాటులో ఉంచటానికి అవసరమైన సమగ్రమైన, ప్రణాళికాబద్ధమైన, ఉన్నతమైన పర్యవేక్షణతో కూడిన తక్షణ జోక్యం అత్యవసరం. వ్యవస్థాగతమైన దృక్పథంతో దీనికోసం పనిచేయాలనే దానిలో ఏ మాత్రం సందేహం లేదు.

ఆరోగ్య విధానంలో వివిధ సమయాలలో చేసిన మార్పుల గురించిన వివరాలలోకి పోకపోయినప్పటికీ, గత కొన్ని దశాబ్దాల నుండి ఆధిపత్యం వహిస్తున్న దృక్పధం వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలను పరిశీలించటం అవసరం. ఇపుడు కేంద్రస్థానంలోకి వచ్చిన పదజాలం "యూనివర్సల్ హెల్త్ కవరేజ్" (ప్రజలందరికి ఆరోగ్య రక్షణ) దీనిని వ్యక్తం చేస్తున్నది. "ఆరోగ్యం, సంబంధిత అంశాలలో" ప్రభుత్వం ఒక్కటే అన్ని చేయాల్సిన అవసరం లేదనీ, వీటిని అందించటానికి గ్యారంటి కల్పించేదిగా, సహకరించేదిగా ఉంటే చాలని హెచ్‌ఎల్‌ఇజి నివేదికలో పేర్కొన్నది. మరో మాటలో చెప్పుకోవాలంటే ఆరోగ్యరంగానికి నిధులను ప్రభుత్వమే సమకూరుస్తున్నప్పటికీ, ప్రైవేటుగా వైద్యం అందించవచ్చు అన్నది దీని సారాంశం. క్రమంగా ఈ విధానాన్ని మరింతగా సమర్ధించటంతో పాటు ప్రైవేటు వైద్యానికి మద్దతు ఇవ్వటమే కాకుండా, దానిని చురుకుగా ప్రోత్సహిస్తున్నారు.

ప్రపంచంలో వైద్యాన్ని ఎక్కువగా ప్రైవేటీకరించిన దేశాలలో భారతదేశం కూడా ఉన్నది. ప్రైవేటు వైద్యరంగంపై ప్రభుత్వ పర్యవేక్షణ ఏ మాత్రం లేదు. పిఎంపిలు, ఆర్ఎంపిలతో సహా ఏ మాత్రం శిక్షణ లేకుండా వైద్యం చేసే వారి నుండి అన్ని వసతులు, సౌకర్యాలు ఉన్న సూపర్ స్పెషాలిటి కార్పొరేట్ ఆసుపత్రుల ఆధిపత్యంలో కొనసాగుతున్న ప్రైవేటురంగం 75 శాతం వైద్యసేవలను అందిస్తున్నది. ఈ విధంగా అత్యధికంగా ప్రైవేటీకరించబడిన ప్రైవేటురంగం ప్రజల చేత వైద్యంపై ఎక్కువ ఖర్చు పెట్టిస్తున్నది. అది ప్రజల పాలిటి విధ్వంసంగా మారి, వారిని దరిద్రంలోకి నెట్టివేస్తున్నది.

## వైద్యానికి అవుతున్న ఖర్చు

వైద్యానికి అవసరమైన మొత్తంలో 40 శాతం ప్రజలు తమ జేబులలో నుండి ఖర్చు చేస్తున్నారని జాతీయ శాంపుల్ సర్వే ఆఫీసు 2017-18లో అంచనా వేసింది. వైద్యంపై చేస్తున్న ఖర్చు 16 శాతం కుటుంబాలను ధ్వంసం చేస్తున్నది. ప్రజలు చేస్తున్న ఖర్చులలో వైద్యంపై చేసేది తలసరి 7.8 శాతం ఉండాలని నిర్దేశించగా, అది 13 శాతంగా ఉన్నదని ఈ మధ్య రూపొందించిన నివేదికలో నీతి ఆయోగ్ పేర్కొంది. ఆరోగ్యంపై చేసే విధ్వంసకమైన ఖర్చు (సిహెచ్ఇ)లో పేర్కొన్న 10 శాతం కన్నా ఇది ఎక్కువ. 2022-23లో చేసిన కుటుంబ వినిమయ ఖర్చు సర్వేలో గ్రామీణ ప్రాంతంలో 7.13 శాతం, పట్టణాలలో 5.91 శాతం ఆదాయాన్ని ఆరోగ్యంపై ఖర్చు చేస్తున్నారని పేర్కొంది. ఇది కొంత తక్కువ అయినప్పటికీ సగటు కన్నా ఇంకా చాలా ఎక్కువగానే ఉన్నది.

అందరికీ అందుబాటులో వైద్యం అందించటానికి బీమాను ప్రధానమైన సాధనంగా ఎంచుకోవటాన్ని హెచ్‌ఎల్‌ఇజి సరిగానే విమర్శించింది. దీని వలన ప్రాథమిక వైద్యంలో ప్రధానమైన రోగాలను నివారించటం, ఆరోగ్యాన్ని పెంపొందించటం అన్న లక్ష్యాలను నెరవేర్చటం సాధ్యం కాదని చెప్పింది. అయినప్పటికీ అందరికీ ఆరోగ్యం అన్న దానిని నేరవేర్చటం కోసం బీమా పథకాలను ప్రధానమైనవిగా అమలు చేస్తున్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రజలు తమ జేబుల నుండి ఖర్చు చేస్తున్నారన్న దానికి ప్రతిస్పందనగా ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం ప్రధానమంత్రి ఆరోగ్య యోజన (పిఎంజెఎవై)ను చూపిస్తున్నారు. సంవత్సర ఆదాయం 1.5 లక్షల రూపాయల కన్నా తక్కువగా ఉన్న కుటుంబాలకు 5 లక్షల రూపాయల ఆరోగ్య బీమాను కల్పిస్తున్నారు. వీరు ప్రభుత్వ ఆసుపత్రులు లేదా ఎంపిక చేసిన ప్రైవేటు ఆసుపత్రులలో వైద్యం చేయించుకోవచ్చు. ఈ

> **❝ ప్రైవేటురంగాన్ని "పరిశ్రమ" లాగా ప్రోత్సహించటానికి తీసుకొంటున్న చర్యలు ప్రజారోగ్యానికి తీవ్ర సవాళ్ళుగా పరిణమిస్తున్నాయి. ప్రస్తుతం జనాభాలో 40 శాతంగా ఉన్న 55 కోట్లమంది పిఎంజెఎవై పథకంలో నమోదు చేసుకున్నారు. కాని 1.5 లక్షల రూపాయల కన్నా తక్కువ ఆదాయంతో బతకటం అసాధ్యం అయినప్పటికీ, ఆదాయం ఎక్కువగా ఉన్నదన్న కారణంతో పట్టణ పేదలను ఈ పథకంలో నమోదు చేసుకోకుండా వదిలివేశారు. ❞**

మధ్యనే ఈ పథకాన్ని వృద్ధులందరికీ వర్తింపజేశారు.

### ఆరోగ్యంపై అతి తక్కువ ఖర్చు చేస్తున్న ప్రభుత్వం

జిడిపిలో 2.5 శాతం ఆరోగ్యంపై ఖర్చు చేస్తామని పదే పదే ప్రకటిస్తున్నప్పటికీ అంతకన్నా తక్కువగానే ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది. ప్రస్తుతం 2 శాతం కన్నా తక్కువ ఖర్చు చేస్తున్నది. వైద్యరంగానికి కేటాయిస్తున్న బడ్జెట్‌లో గణనీయమైన భాగం పిఎంజెఎవైకి పోతున్నది. నిధులు, సిబ్బంది కొరతతో సమ్మిళిత ప్రజారోగ్యరంగం కునారిల్లుతున్నది.

ఇటువంటి సవాళ్ళు ఎదురౌతున్న పరిస్థితులలో ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నచోట వాటితో పోటీపడుతూ ప్రభుత్వ వైద్యశాలలు పేషెంట్లను (ఎపిఎంజెఎవై నిధులను) ఆకర్షించవలసి ఉన్నది. వైద్యం నాణ్యతను, పరిధిని విస్తరించటానికి తగిన అవకాశాలు, ప్రోత్సాహం లేని పరిస్థితులలో వారు అతి పేదలు, సుదూర ప్రాంతాలలో ఉన్న వారికి సేవలను కొనసాగించాలి. మంచి వైద్యం అందుతుందన్న ప్రచారంతో ఆర్థికంగా పెద్ద భారం అవుతున్నప్పటికీ, ప్రైవేటు వైద్యం అందుబాటులో ఉన్నచోట ప్రజలు దానికే మొగ్గు చూపుతున్నారు. తమ జేబులో నుండి అత్యధికంగా ఖర్చు చేయటంతో ఆర్థిక విధ్వంసానికి గురవుతున్నారు.

పిఎంజెఎవై ద్వారా నిధులను ప్రైవేటురంగానికి తరలిస్తున్న ప్రభుత్వం ఇంకా అనేక విధాలుగా ((ప్రైవేటు వారి ప్రయోజనాలను పరిరక్షిస్తున్నది. ప్రైవేటు వారికి పన్ను రాయితీలు, గ్రాంటులు, ప్రభుత్వం, సేవాసంస్థల నుండి నిధులను అందిస్తున్నది. ప్రైవేటు ఆసుపత్రులకు రాయితీ ధరలకు భూములు ఇవ్వటానికి రాష్ట్రాల స్థాయిలో కూడా పథకాలు, కార్యక్రమాలు ఉన్నాయి. భవిష్యత్‌లో లాభాలు వస్తాయంటూ తాము వసూలు చేస్తున్న విపరీతమైన ఫీజులను సమర్థించుకొంటున్న మెడికల్ కాలేజిలు కూడా ఈ భూములు, రాయితీలు పొందే వాటిలో ఉన్నాయి.

ప్రైవేటురంగాన్ని "పరిశ్రమ" లాగా ప్రోత్సహించటానికి తీసుకొంటున్న చర్యలు ప్రజారోగ్యానికి తీవ్ర సవాళ్ళుగా పరిణమిస్తున్నాయి. ప్రస్తుతం జనాభాలో 40 శాతంగా ఉన్న 55 కోట్లమంది పిఎంజెఎవై పథకంలో నమోదు చేసుకున్నారు. కాని 1.5 లక్షల రూపాయల కన్నా తక్కువ ఆదాయంతో బతకటం అసాధ్యం అయినప్పటికీ, ఆదాయం ఎక్కువగా ఉన్నదన్న కారణంతో పట్టణ పేదలను ఈ పథకంలో నమోదు చేసుకోకుండా వదిలివేశారు.

ఈ విధంగా ఆరోగ్య పథకాలలో భాగస్వాములను చేస్తున్నప్పటికీ ప్రజలు ఆరోగ్యం కోసం తమ ఆదాయంలో ఎక్కువ భాగం ఖర్చు చేయటం (ఓఓపిఇ), తీవ్రంగా క్షీణిస్తున్న ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి చేస్తున్న ఖర్చులు (కెటాస్ట్రోఫిక్ హెల్త్ ఎక్స్‌పెన్సెస్) ఎక్కువగానే ఉంటున్నాయి. ప్రభుత్వ వైద్యం పొందుతున్న వారిని, ప్రైవేటు వైద్యం పొందుతున్న వారు ఆరోగ్యం కోసం తమ ఆదాయం నుండి ఖర్చు చేస్తున్న మొత్తాన్ని పోలిస్తే పిఎంజెఎవై పథకంలో చేరిన వారిలో మూడింట రెండు వంతులు క్షీణిస్తున్న తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవటం కోసం ప్రైవేటు ఆసుపత్రులలోనే వైద్యం చేయించుకొంటూ, పథకం ద్వారా వస్తున్న మొత్తం కన్నా నాలుగు రెట్లు అదనంగా చెల్లిస్తున్నారు.

పిఎంజెఎవైలో చేరి, తమ ఆరోగ్యరక్షణ కోసం ప్రైవేటు ఆసుపత్రులలో వైద్యం చేయించుకొంటున్న వారు క్షీణిస్తున్న తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవటం కోసం 2021లో 78.1 శాతం 2022లో 70.9 శాతం మొత్తాన్ని తమ ఆదాయం నుండి చెల్లించారని 2021-22లో ఛత్తీస్‌గఢ్‌లో జరిపిన అధ్యయనంలో వెల్లడైంది. ప్రభుత్వ ఆసుపత్రులతో పోలిస్తే ప్రైవేటు ఆసుపత్రులలో వైద్యం చేయించుకొంటున్న వారు తమ ఆదాయం నుండి 10 రెట్లు అదనంగా చెల్లిస్తున్నారు. పర్యవేక్షణ వ్యవస్థ బలంగా లేకపోవటం వలన సిజేరియన్ ఆపరేషన్‌లు (ప్రభుత్వ ఆసుపత్రులలో కన్నా ప్రైవేటు ఆసుపత్రులలో (ఐదు రెట్లు అదనంగా) చేస్తున్నారు. గర్భసంచిని తొలగించటం, గుండె ఆపరేషన్లు తదితరాలు అవసరం లేకపోయినా చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని లాభాలు చేకూర్చే పరిశ్రమగా భావిస్తున్న ప్రైవేటు వారికి ప్రజాధనం అధికంగా చేరటం మాత్రమే కాక, అవసరం లేకపోయినా వైద్యుల వద్దకు తిరగటం, మందుల వాడకం పెంచటంతో ప్రజల ఆరోగ్య ఖర్చులను పెరుగుతున్నది. ప్రైవేటు వైద్యం చేయించుకోలేని వారికి నాణ్యమైన వైద్యం అందించలేక పోవటం వలన తక్కువ ఆరోగ్యం ఉండి, వైద్యం అవసరాలు ఎక్కువగా ఉన్న పేదలకు అన్యాయం జరుగుతున్నది.

ఇది ఉభయులకూ విజయంగా కాక నిధులు, సిబ్బంది తక్కువగా ఉండి, డిమాండ్ సృష్టించటం కోసం నిధులను ఖర్చు చేయలేక సతమతమౌతున్న ప్రభుత్వ ఆసుపత్రులకు ఓటమిగా పరిణమిస్తున్నది. ప్రభుత్వ వైద్యరంగం విఫలమైతే అట్టడుగున ఉన్నవారికి సేవలందించటంలో విఫలమవటం మాత్రమే కాక, రోగాలను నివారించటం కోసం చర్యలు తీసుకోవటంపై కేంద్రీకరణ లేక అనారోగ్యాన్ని గణనీయంగా తగ్గించటం కోసం జరిగే పోరాటంలో కూడా వెనుకబడుతుంది. అదే సమయంలో అంతులేని ప్రైవేటు ఆరోగ్య పరిశ్రమ ధనదాహాన్ని తీర్చటానికి ప్రజా ధనాన్ని తరలించటం కొనసాగుతుంటుంది. పౌరులుగా మనం చెల్లిస్తున్న పన్నుల నుండి ప్రభుత్వం ప్రైవేటురంగానికి డబ్బు చెల్లిస్తున్నది. తర్వాత రోగులుగా మనం ప్రత్యక్షంగా ప్రైవేటు ఆసుపత్రులకు మళ్ళీ డబ్బు చెల్లిస్తున్నాం.

ఆరోగ్యం వ్యాపారం కాదు. భారతదేశం "ఆరోగ్య హక్కు"ను చట్టంగా చేయాలి. ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాలి. ప్రజలకు వైద్యం అందిస్తున్న ప్రభత్వ రంగంలో అవసరమైన మేరకు పెట్టుబడి పెట్టాలి. "పరిశ్రమ" విష కౌగిలి నుండి వైద్యాన్ని శాశ్వతంగా విముక్తి చేయాలి.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

## శామ్‌సంగ్ కార్మికుల సమ్మె విజయం:

# తమిళనాడు కార్మికోద్యమంలో నూతనోత్సాహం

**ఇళంగోవన్ రాజశేఖరన్**



రచయిత ఫ్రంట్‌లైన్ అసోసియేటర్ ఎడిటర్-కన్సల్టెంట్

చెన్నైకి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీపెరుంబుదూర్‌లోని శామ్‌సంగ్ కార్మికులు వేతనాల పెరుగుదల, పని పరిస్థితుల మెరుగుదల, తమ యూనియన్‌కు గుర్తింపు కోసం 2024 సెప్టెంబరు 9వ తేదీన సిఐటియు నాయకత్వంలో సమ్మె ప్రారంభించారు. నయా-ఉదారవాద విధానాల అమలు ప్రారంభమైన తర్వాతి కాలంలోని తమిళనాడు కార్మికోద్యమంలో తమ పోరాటం ఒక మైలురాయిగా నిలిచిపోతుందని ఆనాడు వారేమాత్రం ఊహించలేదు. 38 రోజులు కొనసాగిన సమ్మె 2024 అక్టోబరు 16వ తేదీన ముగిసింది. కార్మికుల పోరాటానికి ఆ ప్లాంట్ యాజమాన్యం దిగొచ్చి వారి సంఘానికి అధికారిక గుర్తింపు ఇచ్చింది. ఈ మేరకు ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను కార్మికులు 2025 జనవరి 27న అందుకున్నారు. ఇటీవలి కాలంలో ఎక్కువ రోజులు జరిగిన కార్మిక పోరాటంగా అది నిలిచిపోయింది. 2018లో రాయల్ ఎన్‌ఫీల్డ్ ఫ్యాక్టరీలో 50 రోజుల పాటు జరిగిన సమ్మె ఇటువంటి సుదీర్ఘ పోరాటాలలో చివరిది.

తమ సమస్యల పరిష్కారం కోసం ఇతర కంపెనిలలోని కార్మికులు ఆందోళనలు ప్రారంభించినట్లుగానే దక్షిణకొరియాకు చెందిన అతిపెద్ద ఎలక్ట్రానిక్ కంపెని శామ్‌సంగ్ కార్మికుల పోరాటం కూడా ప్రారంభమైంది. మొదట్లో సమ్మె చేస్తున్న కార్మికులు, వారి కుటుంబాలు, మద్దతుదారుల వరకే ఈ పోరాటం పరిమితమైంది. ప్రారంభంలో సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) మాత్రమే ఈ సమ్మెను బలపరిచింది. తమ ప్రధాన సమస్యలు పరిష్కారం అయే వరకు కార్మికులు సమ్మెను విరమించబోరని స్పష్టమైన తర్వాత తమిళనాడులోని పాలకపార్టీ అయిన ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె) మిత్రపక్షాలతో సహా వివిధ రాజకీయ పార్టీలు ఈ పోరాటాన్ని బలపరచటం ప్రారంభించాయి. దానితో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర కలవరపాటుకు గురయింది.

**క్లిష్టమైన పరిస్థితులు**

కార్మికులు చేస్తున్న ఈ పోరాటం కొద్దిరోజులలోనే రాష్ట్రంలో ప్రధాన సమస్యగా రూపు దాల్చింది. తమ రాష్ట్రంలో ఎటువంటి కార్మికుల ఆందోళనలు ఉండవని, పరిశ్రమలు శాంతియుతంగా నడుస్తాయని డిఎంకె నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు వాగ్దానం చేసింది. కాని ఈ పరిణామాలతో పెట్టుబడిదారులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టటానికి వెనుకాడుతారని, 2030 నాటికి రాష్ట్రాన్ని లక్ష కోట్ల డాలర్ల ఆర్థికవ్యవస్థగా మార్చాలన్న లక్ష్యానికి విఘాతం కలుగుతుందని ఆ పార్టీ భయపడింది. ద్రవిడియన్ తరహా అభివృద్ధిపై ఈ సమ్మె సందేహాలను రేకెత్తిస్తుందని కూడా డిఎంకె భయపడింది. సమ్మె విషయంలో ఒంటరిపాటైన డిఎంకె ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా ఈ సమ్మెను ముగించటం మంచిదని భావించింది. కార్మికులతో పాటు దాని మిత్రులలో కూడా అపోహలు కలగటానికి, ఘర్షణలు జరగటానికి ఈ తొందరపాటు కారణమైంది. సమ్మె సుదీర్ఘంగా సాగితే ఏ విధంగా స్పందించాలన్న అంశంపై సమ్మె ప్రారంభ సమయంలో ప్రభుత్వం ఏ మాత్రం ఆలోచించలేదని ఇపుడు స్పష్టమౌతున్నది. వాస్తవానికి సమ్మె ప్రారంభమైనపుడు డిఎంకె కార్మిక విభాగం "ది లేబర్ ప్రోగ్రెసివ్ ఫెడరేషన్ (ఎల్‌పిఎఫ్) సమ్మె చేస్తున్న కార్మికులను, సిఐటియును బలపరిచింది.

సమ్మె దీర్ఘకాలం సాగుతుండటంతో చివరకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రులను రాయబారులుగా పంపింది. పరిశ్రమల శాఖా మంత్రి టిఆర్‌బి రాజా, ఎంఎస్‌ఎంఇ పరిశ్రమల మంత్రి టిఎం అంబరాసన్, కార్మికశాఖా మంత్రి సివి గణేశన్.. ఈ ముగ్గురు మంత్రుల నాయకత్వంలో జరిగిన మొదటి త్రైపాక్షిక సమావేశం సమస్యను పరిష్కరించటంలో విఫలమైంది. ఈ సమయంలో ఎల్‌పిఎఫ్ సమ్మె చేస్తున్న కార్మికులకు నిశ్శబ్దంగా తన మద్దతును ఉపసంహరించుకున్నది. కార్మికులు కోరుతున్న అసాధ్యమైన డిమాండ్లను బలపరుస్తున్నదని, సమ్మె విరమించటాన్ని వ్యతిరేకిస్తున్నదని ఎల్‌పిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎం షణ్ముగం సిఐటియుపై ఆరోపణలు కూడా చేశాడు.

సమస్యను సక్రమంగా పరిష్కరించటంలో మంత్రుల కమిటీ విఫలమైందని స్పష్టమైంది. వేతనాలను పెంచుతామని, కార్మికులకు సదుపాయాలు కల్పిస్తామన్న కొన్ని హామీలను శామ్‌సంగ్ యాజమాన్యం నుండి తీసుకొని, సమ్మె ముగిసినట్లు ప్రభుత్వం హడావిడిగా ప్రకటించింది. సమ్మె చేస్తున్న కార్మికులు, సిఐటియు ఈ ఒప్పందాన్ని అంగీకరించలేదు. సిఐటియు నాయకత్వంలోని శామ్‌సంగ్ ఇండియా వర్కర్స్ యూనియన్ (ఎస్ఐడబ్ల్యుయు)ను రిజిస్టర్ చేయాలన్నది వారి ప్రధానమైన డిమాండ్. యూనియన్ పేరులో శామ్‌సంగ్ ఉంది కాబట్టి దీనిని అంగీకరించలేమని కంపెని యాజమాన్యం వ్యతిరేకించింది.

**కార్మికులకు బెదిరింపులు**

ఈ సమయంలో ప్రభుత్వం రెండవ తప్పు చేసింది. కార్మికులను బెదిరించటానికి ప్రభుత్వం పోలీసులను పంపింది. కార్మికులు నిరసన తెలిపే చోట వేసుకున్న టెంట్‌ను పీకివేసి, కొద్దిమంది కార్మికులను అరెస్టు చేయించింది. దీనితో అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. శామ్‌సంగ్ కంపెనీతో ప్రభుత్వం కుమ్మక్కై వ్యవహరిస్తున్నదని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇది తీవ్రమైన రాజకీయ పరిణామాలకు దారి తీస్తుందని సిఐటియు నాయకుడు ఎ సౌందర రాజన్ హెచ్చరించాడు. "శామ్‌సంగ్ కంపెనీలో జరుగుతున్న సమ్మె ఇతర పరిశ్రమలకు కూడా విస్తరిస్తుందని ప్రభుత్వం భయపడుతున్నట్లుగా ఉందని" ఆయన చెప్పాడు. రాజకీయంగా, ఇతరేతరంగా వస్తున్న ఒత్తిడులకు లొంగిపోకుండా సిఐటియు దృఢంగా నిలబడింది. శామ్‌సంగ్ కార్మికులు కూడా ఐక్యంగా, దృఢంగా నిలబడ్డారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఈ సమ్మె ముందునుయ్యి, వెనుకగొయ్యిగా మారింది. ఒకవైపున బహుళజాతి సంస్థలను సంతృప్తి పరచటం ద్వారా తమిళనాడు పెట్టుబడులకు

(మిగతా 35వ పేజీలో)

# పని గంటల పెంపు ఎవరి కోసం?


రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

**ఎ.కోటిరెడ్డి**

మోడి నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం కార్మికచట్టాలను రద్దుచేసి, పోరాటాల ద్వారా వారు సాధించుకున్న హక్కులను వమ్ముచేసి, పని భారాన్ని పెంచటం కోసం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను నోటిఫై చేయటానికి ప్రయత్నిస్తున్నది. మరోవైపున కార్మికులకు విశ్రాంతి, కుటుంబ జీవితం లేకుండా వారానికి 70, 90 గంటలు-రోజుకు 12 నుండి 15 గంటలు-పని చేయాలని, తద్వారా దేశం అభివృద్ధి చెందుతుందని, మన ఆర్థికవ్యవస్థ 5, 10 లక్షల కోట్ల డాలర్లకు పెరుగుతుందని ఊదరగొడుతున్నారు. ఈ విధంగా ప్రభుత్వం, బడా పెట్టుబడిదారులు కలిసి కార్మికులపై విపరీతమైన పని భారాన్ని మోపాలని ప్రయత్నం చేస్తున్నారు. కార్మికులతో పాటు ప్రజలను కూడా ఇందుకు సన్నద్ధం చేయటం కోసం వివిధ రకాలుగా ప్రచార కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.

బడా పెట్టుబడిదారులు ఒకరిని మించి మరొకరు పూనకం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. కార్మికులు వారానికి 70 గంటలు పని చేయాలని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి ప్రకటించాడు. సిఎన్‌బిసి-టివి 18 నిర్వహించిన గ్లోబల్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొన్న నారాయణమూర్తి "పని-కుటుంబ జీవితం మధ్య సమతూకం'' అన్నదానిపై తనకు నమ్మకం లేదని, ఎక్కువ గంటలు పని చేయాలనే నైతిక భావజాలం బలంగా ఉండాలని చెప్పాడు. అంకితభావం, కష్టపడి పని చేయటం దేశ అభివృద్ధికి అవసరమని, కాబట్టి కార్మికులు వారానికి 70 గంటలు పనిచేసి, దేశాభివృద్ధికి దోహదం చేయాలని వక్కాణించాడు. ప్రధాని మోడి వారానికి 100 గంటలు పని చేస్తున్నాడని, ఆయన మంత్రులు, ఉన్నతస్థాయి అధికారులు కూడా కష్టపడి పని చేస్తున్నారని, వారందరి పనిని మనం అభినందించాలని పేర్కొన్నాడు.

“అతని కంటే ఘనుడు ఆచంట మల్లన్న” అన్న చందంగా ఎల్ అండ్ టి ఛైర్మన్ సుబ్రహ్మణ్యన్ మరొక అడుగు ముందుకు వేసి, ఉద్యోగులు వారానికి 90 గంటలు పని చేయాలని చెప్పాడు. ఎంతసేపని మీరు, మీ భార్య ఒకరినొకరు చూస్తూ ఇంట్లో కూర్చుంటారు? అంటూ వ్యాఖ్యానించాడు. శని, ఆదివారాలలో కూడా తాను పని చేస్తున్నానని, ఉద్యోగుల చేత పని చేయించలేనందుకు విచారిస్తున్నానని, ఆదివారాలు కూడా పని చేయించగలిగితే సంతోషిస్తానని పేర్కొన్నాడు.

2020లో నారాయణమూర్తి ఆస్తులు 16,340 కోట్ల రూపాయలు కాగా, 2024కు 45,580 కోట్ల రూపాయలకు పెరిగాయి. ఆయన గత సంవత్సరం బెంగళూరులో అత్యంత ధనికులు మాత్రమే నివసించగలిగిన కింగ్‌ఫిషర్ అపార్ట్‌మెంట్స్‌లో 50 కోట్ల రూపాయలతో అత్యంత విలాసవంతమైన రెండవ ఫ్లాట్ కొన్నాడు. నారాయణమూర్తి గారి సంపద 2020-24 మధ్య నాలుగు సంవత్సరాలలో మూడు రెట్లు పెరిగితే ఆయన కంపెనీలో పనిచేసే కార్మికుల వేతనాలు సంవత్సరానికి 10 శాతం కూడా పెరగలేదు. ఎల్ అండ్ టి ఛైర్మన్ సుబ్రహ్మణ్యన్ సంవత్సరం జీతం 51 కోట్ల రూపాయలు. నెలకు 4.25 కోట్ల రూపాయలు. ఎల్ అండ్ టిలో పని చేస్తున్న ఉద్యోగుల సగటు జీతం కన్నా ఆయన జీతం 534.57 రెట్లు ఎక్కువ. 2023లో ఆయన జీతం 43 శాతం పెరగగా, ఉద్యోగుల జీతాలు 1.32 శాతం మాత్రమే పెరిగాయి. వేలకోట్ల రూపాయల సంపదకు అధిపతులైన వీరు కార్మికులు, ఉద్యోగులు మరిన్ని ఎక్కువ గంటలు పని చేయాలని ఉద్బోధిస్తున్నారు.

వీళ్ళ సంపదను మరిన్ని రెట్లు, మరింత వేగంగా పెంచటం కోసం కార్మికులు, ఉద్యోగులు ఎక్కువ గంటలు పని చేయాలా? దేశం అంటే నారాయణమూర్తి, ఆయన లాగా కార్మికుల, ఉద్యోగుల కష్టంతో సంపదలను ఇబ్బడిముబ్బడిగా పెంచుకొంటున్నవారేనా? ఉద్యోగులు, కార్మికులు కూడా వారు చెబుతున్న దేశంలో భాగంగా ఉన్నారా? ఉంటే వారి వేతనాలను పెంచటం, కుటుంబాలను అభివృద్ధిలోకి తీసుకురావటం గురించి వీరేనాడైనా మాట్లాడారా? తమ సంపద, వేతనాలు పెరిగిన నిష్పత్తిలోనే తమ కంపెనీలలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల జీతాలు పెంచాలని వీరు ఎప్పుడైనా భావించారా?

వీళ్ళిచ్చే హీనమైన వేతనాల కోసం కార్మికులు, ఉద్యోగులు దేశం -నారాయణమూర్తి, సుబ్రహ్మణ్యన్, ఇంకా ఇలాంటి వేలకోట్ల రూపాయల సంపద ఉన్నవారి కోసం కుటుంబ జీవితం లేకుండా పని చేయాలా? కార్మికులు, ఉద్యోగులు ఇలా పని చేస్తుంటే వీరు తమ సంపదలను వేలు, లక్షల కోట్లకు పెంచుకొంటూ, కార్మికులను మరింతగా దోపిడీ చేయటానికి, మరింగా సంపదలను పెంచుకోవటానికి “దేశాభివృద్ధి”ని అడ్డం పెట్టుకుంటారు.


కార్మికులు చట్ట ప్రకారం ఎనిమిది గంటలు పని చేస్తున్నారు. వారానికి ఆరు రోజుల పనిదినం కాబట్టి 48 గంటలు పని చేస్తున్నారు. సుబ్రహ్మణ్యన్ గారి సలహా

ప్రకారం 90 గంటల పని దినం ఆమోదిస్తే వారానికి 42 గంటలు అదనంగా పనిచేయాలి. ఇపుడు ఇద్దరు చేస్తున్న పని అపుడు ఒకరే చేస్తారు. అంటే ఇపుడు పనులలో ఉన్న వారిలో దాదాపు సగం మందిని తొలగించాలి. దానితో ఇపుడు ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగాలు రాకపోగా, ఉద్యోగాలలో ఉన్నవారిలో దాదాపు సగం మంది నిరుద్యోగులుగా మారతారు. దీని వలన ఎవరు ప్రయోజనం పొందుతారు? కార్మికులలో 50 శాతం నిరుద్యోగులవుతారు కాబట్టి వారికి తీవ్రనష్టం జరుగుతుంది. నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చే అవకాశాలు తగ్గటంతో వారికీ నష్టం జరుగుతుంది. కోట్లాది మందికి ఉద్యోగాలు పోవటంతో వారి కొనుగోలు శక్తి తగ్గుతుంది. ప్రజలకు ఆదాయాలు తగ్గటంతో సరుకులు అమ్ముడుపోక మాంద్యం నెలకొంటుంది. పరిశ్రమలు మూతపడతాయి. ప్రభుత్వ ఆదాయం, జిడిపి తగ్గుతాయి. ఈ విధంగా అన్ని తరగతులూ నష్టపోతారు. బడా పెట్టుబడిదారులు మాత్రమే లాభపడతారు. సగం మందికి వేతనాలు చెల్లించాల్సిన అవసరం లేకపోవటంతో వారి లాభాలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతాయి. వారానికి 90 గంటలు పనిచేయటంతో కార్మికులు, ఉద్యోగులు పది సంవత్సరాలలోనే అశక్తులై, రోగాల బారినపడి పనిచేయలేని స్థితికి చేరతారు. వారి సగటు జీవితకాలం 10 సంవత్సరాలకు పైగా తగ్గుతుంది. తమ లాభాలను మాత్రమే చూసుకుంటూ దేశాభివృద్ధిని, ప్రజల ఆరోగ్యాన్ని, ఉపాధిని దెబ్బతీసే వాదనలు చేస్తున్న వీరిని దేశభక్తులు అందామా? ఏమందాం?

కార్మికులు 70, 90 గంటలు పని చేయాలని చెబుతున్న బడా పెట్టుబడి దారులకు, పురాణాలలో చెప్పిన బ్రహ్మ రాక్షసులకు మధ్య ఏమైనా వ్యత్యాసం ఉందా? బ్రహ్మ రాక్షసులు తమ కంట పడిన మనుషుల రక్తం తాగి, మాంసాన్ని తినేసేవారు. తమ కంపెనీలలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల రక్తమాంసాలను ఇంకా పీల్చి పిప్పి చేయటానికి బడా పెట్టుబడిదారులు ఎక్కువ గంటలు పని చేయాలని డిమాండ్ చేస్తున్నారు. బ్రహ్మ రాక్షసులు చేసేది కంటికి కనిపిస్తుంది. బడా పెట్టుబడిదారులు చేసేది కంటికి కనిపించదు.

పెట్టుబడిదారులు సంపద సృష్టికర్తలని ప్రజలను నమ్మింపజేయటానికి ప్రధాని నరేంద్రమోడి తెగ కష్టపడుతున్నాడు. ఇపుడు పెట్టుబడిదారులు, మోడి వాదనల్లోని బండారం బయటపడింది కదా! పెట్టుబడి దారులే సంపద సృష్టిస్తుంటే కార్మికులు, ఉద్యోగులు ఎక్కువ గంటలు పని చేయటం ఎందుకు? చట్టపరంగా వారికి ఉన్న హక్కులను రద్దుచేయటం ఎందుకు? శ్రామికులే సంపదను సృష్టిస్తారని, దానిని కాజేసి పెట్టుబడిదారులు కోట్లకు పడగలెత్తుతున్నారని వారి మాటలు, చేతలు స్పష్టం చేస్తున్నాయి.

**“ పెట్టుబడిదారులు సంపద సృష్టికర్తలని ప్రజలను నమ్మింపజేయటానికి ప్రధాని నరేంద్రమోడి తెగ కష్టపడుతున్నాడు. ఇపుడు పెట్టుబడిదారులు, మోడి వాదనల్లోని బండారం బయటపడింది కదా! పెట్టుబడి దారులే సంపద సృష్టిస్తుంటే కార్మికులు, ఉద్యోగులు ఎక్కువ గంటలు పని చేయటం ఎందుకు? శ్రామికులే సంపదను సృష్టిస్తారని, దానిని కాజేసి పెట్టుబడిదారులు కోట్లకు పడగలెత్తుతు న్నారని వారి మాటలు, చేతలు స్పష్టం చేస్తున్నాయి. ”**




**8 గంటల పనిదినం కోసం 1856లో ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ఆర్మికులు నెలొల్పిన బ్యానర్**

**పోరాటాలతోనే పనిగంటలు తగ్గాయి**

కార్మికులకు ఎనిమిది గంటల పనిదినం పెట్టుబడిదారుల దయతో రాలేదు. పోరాటాల ద్వారా సాధించుకున్నారు. పెట్టుదారి విధానం ప్రారంభంలో పనిదినానికి పరిమితి లేదు. 24 గంటలూ కార్మికులను ఫ్యాక్టరిలలోనే ఉంచేవారు. కార్మికులు అక్కడే తిని, అక్కడే నిద్రపోయేవారు. నిద్రపోయేవరకు పనిచేస్తూనే ఉండేవారు. నిద్రలేవటంతోనే పని చేయటం ప్రారంభించేవారు. కార్మికులు ఇళ్ళకు పోవటానికి, పనికి విరామం ఇవ్వటానికి పెట్టుబడిదారులు అంగీకరించేవారు కాదు. కార్మికులు రోజుకు 20 గంటలు పని చేసినా పెట్టుబడిదారుల ధనదాహం తీరేది కాదు. అత్యంత హీనమైన వేతనాలతో అంతం లేకుండా పని చేయిస్తూ, కార్మికుల రక్తమాంసాలను పీల్చేవారు.

పెట్టుబడిదారులు చేస్తున్న ఈ దోపిడికి వ్యతిరేకంగా కార్మికులు పోరాటాలు చేశారు. మొదట్లో యంత్రాలే తమను పీడిస్తున్నాయని వాటిని ధ్వంసం చేశారు. అయినా దోపిడి తగ్గకపోయేసరికి పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాటాలు చేయటం ప్రారంభించారు. మొదట తాము పని చేస్తున్న పరిశ్రమ యజమానికి వ్యతిరేకంగా ఎవరికి వారుగా పోరాటాలు చేశారు. తర్వాత ఒక పరిశ్రమలో ఉన్న కార్మికులు ఐక్యమై పోరాటాలు చేశారు. అయినా దోపిడీ పోలేదు. పనిగంటలు తగ్గలేదు. వేతనాలు పెరగలేదు. అపుడు తమ అనుభవాల ద్వారా నేర్చుకొని, అన్ని పరిశ్రమలలో పని చేస్తున్న కార్మికులు ఐక్యమై సంఘటితంగా పోరాటాలు చేశారు. ఏ ఫ్యాక్టరికి ఆ ఫ్యాక్టరిలోని కార్మికులు పోరాడితే దోపిడి పోదని, అన్ని పరిశ్రమలలోని కార్మికులు ఐక్యమై

**" ప్రభుత్వం, బడా పెట్టుబడిదారులు కార్మికవర్గంపై చేస్తున్న ఈ దాడిని తిప్పికొట్టాలి. కార్మికవర్గాన్ని అణచివేయటం, వారు సాధించుకున్న చట్టాలను రద్దు చేయటంలో పాలకవర్గాలు సఫలమైతే ఇతర పీడిత ప్రజలపై దాడులను మరింత తీవ్రం చేస్తారు. ఇప్పటికే కార్మికులు సాధించుకున్న హక్కులను రద్దు చేయటానికి నాలుగు లేబర్ కోడ్‌లను ఆమోదించింది. ప్రజా పంపిణి విధానాన్ని బలహీనపరచటానికి, రద్దు చేయటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. "**

పోరాడితేనే హక్కులు సాధించుకోగలమని గుర్తించారు. ఆ విధంగా ట్రేడ్ యూనియన్లలో సంఘటితమై పోరాడటం నేర్చుకున్నారు. ఈ పోరాటాల క్రమంలోనే పనిదినం ఎనిమిది గంటలు మాత్రమే ఉండాలనే డిమాండ్ ముందు కొచ్చింది.

కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్‌లు కార్మికుల అదనపు శ్రమ నుండే పెట్టుబడిదారులకు లాభాలు వస్తున్నాయని వెల్లడించటం ద్వారా దోపిడి వ్యవస్థ గుట్టు రట్టుచేశారు. పెట్టుబడిదారి వ్యవస్థను కూల్చటం ద్వారా మాత్రమే కార్మికవర్గం దోపిడి నుండి విముక్తి చెందుతుందని స్పష్టం కావటంతో పెట్టుబడిదారి వ్యవస్థకు వ్యతిరేకంగా కార్మికవర్గ పోరాటాలు తీవ్రమైనాయి. దేశదేశాలలో కార్మికవర్గ ప్రతినిధిగా కమ్యూనిస్టు పార్టీలు ఏర్పాటు కావటంతో పోరాటాలు విస్తరించాయి. కార్మికవర్గం సంఘటితంగా పోరాటాలు చేయటంతో జీతాలు పెంచుకోవటంతో పాటు కొన్ని హక్కులు కూడా సాధించుకున్నది.

### సోషలిజంలోనే 8 గంటల పనిదినం చట్టం

కార్మికవర్గానికి ఎనిమిది గంటల పనిదినం ఉండాలని కార్మికసంఘాలు, కమ్యూనిస్టు పార్టీల నాయకత్వంలో జరిగిన పోరాటాలను మొదటగా సోవియట్ యూనియన్ సాకారం చేసింది. రష్యాలో బోల్షివిక్ విప్లవం విజయం సాధించిన తర్వాత ఎనిమిది గంటల పనిదినాన్ని చట్టబద్ధం చేశారు. 1917, నవంబరు 7వ తేదిన విప్లవం విజయం సాధించగా, నాలుగు రోజుల తర్వాత, నవంబరు 11వ తేదీన ఎనిమిది గంటల పని దినాన్ని చట్టంగా చేశారు. సంవత్సరం పాటు ఫ్యాక్టరిలలో పని చేసిన కార్మికులకు నెలరోజులు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని కూడా చట్టంలో పేర్కొన్నారు. కార్మికుల కుటుంబానికి అవసరమైన విధంగా కనీస వేతనాలను నిర్ణయించారు. కార్మికులు డిమాండ్ చేస్తున్న ఇతర హక్కులను కూడా చట్టబద్ధం చేశారు. రెండవ ప్రపంచయుద్ధం తర్వాత ఏర్పడిన సోషలిస్టు దేశాలు, చైనాలో కూడా సోవియట్ యూనియన్‌లో వలెనే ఎనిమిది గంటల పని దినాన్ని, ఇతర హక్కులను పొందుపరుస్తూ చట్టాలు చేశారు.

సోవియట్ యూనియన్, చైనా, ఇతర దేశాలలో ఏర్పడిన సోషలిస్టు ప్రభుత్వాలు అమలు జరిపిన ఎనిమిది గంటల పనిదినం, చట్టబద్ధమైన హక్కులు, కార్మికవర్గ అనుకూల విధానాలు, ప్రజా సంక్షేమ పథకాలు ప్రపంచ కార్మికవర్గానికి ఉత్తేజం కలిగించాయి. అన్ని దేశాలలో కార్మికులు ఎనిమిది గంటల పనిదినం, ఇతర హక్కుల సాధన కోసం పోరాటాలను ఉధృతం చేశారు. ఈ పరిణామాలు వివిధ దేశాలలోని పెట్టుబడిదారీ పాలకవర్గాలపై వత్తిడి తెచ్చి, కార్మికవర్గం చేస్తున్న అనేక డిమాండ్‌లను నెరవేర్చక తప్పని పరిస్థితులు కల్పించాయి. కార్మికుల డిమాండ్లను ఆమోదించకపోతే పోరాటాలు మరింత తీవ్రమై తమ వ్యవస్థకే ప్రమాదం వస్తుందని పెట్టుబడిదారులు గ్రహించారు. తప్పనిసరి పరిస్థితులలో పెట్టుబడిదారులు ఎనిమిది గంటల పని దినానికి అంగీకరించారు. స్వాతంత్ర్యానంతరం మనదేశంలో ఏర్పడిన ప్రభుత్వం కూడా ఎనిమిది గంటల పనిదినం, ఇతర హక్కులను చట్టబద్ధం చేసింది. ఎక్కువ దేశాలలో కార్మికులు పోరాటాల ద్వారా ఈ హక్కులను చట్టబద్ధం చేయించుకోవటంతో పాటు అమలు జరిపించుకున్నారు.

### సోవియట్ విచ్ఛిన్నంతో ఎనిమిది గంటల పనిదినంపై దాడి

1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావటం, సోషలిస్టు శిబిరం దెబ్బతినటంతో పెట్టుబడిదారులకు పట్టపగ్గాలు లేకుండాపోయాయి. అదే సమయంలో మనదేశంలో సరళీకరణ విధానాలను అమలు చేయటం ప్రారంభించారు. ప్రభుత్వం, పాలకవర్గాలు కార్మికవర్గ వ్యతిరేక ప్రచారాన్ని తీవ్రం చేశాయి. కార్మికవర్గం సాధించుకున్న హక్కులను హరించటం ప్రారంభించారు. రకరకాల పద్ధతులలో వారిపై దాడులు చేస్తున్న పాలకవర్గాలు, ఇపుడు ఏకంగా ఎనిమిది గంటల పని దినానికి ఎసరు పెట్టాయి. పని దినానికి పరిమితులు ఉండకూడదని, 70, 90 గంటలు పని చేయాలని ప్రచారం చేస్తున్నారు.

2010 తర్వాత మనదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం, ముఖ్యంగా సిపిఐ(ఎం) బలహీనపడటంతో కార్మికవర్గ వ్యతిరేకులకు పట్టపగ్గాలు లేకుండా పోయాయి. కార్మికవర్గం సాధించుకున్న హక్కులపై దాడులను తీవ్రం చేశారు. 18, 19వ శతాబ్దాలలో ఎటువంటి పరిమితులు లేకుండా కార్మికుల శ్రమను దోపిడి చేసిన పెట్టుబడిదారులకు, కార్మికులు సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని రద్దు చేసి, 90 గంటలు పని చేయించాలని ప్రచారం చేస్తున్న 21వ శతాబ్దంలోని బడా పెట్టుబడిదారులకు మధ్య దోపిడీ కాంక్షలో ఎటువంటి వ్యత్యాసం లేదు.

ప్రభుత్వం, బడా పెట్టుబడిదారులు కార్మికవర్గంపై చేస్తున్న ఈ దాడిని తిప్పికొట్టాలి. కార్మికవర్గాన్ని అణచివేయటం, వారు సాధించుకున్న చట్టాలను రద్దు చేయటంలో పాలకవర్గాలు సఫలమైతే ఇతర పీడిత ప్రజలపై దాడులను మరింత తీవ్రం చేస్తారు. ఇప్పటికే కార్మికులు సాధించుకున్న హక్కులను రద్దు చేయటానికి నాలుగు లేబర్ కోడ్‌లను ఆమోదించింది. ప్రజా పంపిణి విధానాన్ని బలహీనపరచటానికి, రద్దు చేయటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దళితులు, గిరిజనుల రక్షణ కోసం ఆమోదించిన అనేక చట్టాలను బలహీనపరచటానికి, రద్దు చేయటానికి ప్రయత్నాలను తీవ్రం చేశారు. రైతాంగానికి వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలను తెచ్చి రైతుల ఆందోళనతో తాత్కాలికంగా వెనక్కు తగ్గారు.

అందువవలన పనిగంటల పెంపుకోసం బడా పెట్టుబడిదారి వర్గం ప్రారంభించిన ప్రచారాన్ని తిప్పికొట్టాలి. నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా, ఎనిమిది గంటల పని దినాన్ని కొనసాగించటానికి, తాము సాధించుకున్న హక్కులను పరిరక్షించుకోవటానికి కార్మికవర్గం చేస్తున్న పోరాటాలకు పీడిత ప్రజలు మద్దతు ఇవ్వాలి. ❋

# చౌ ఎన్‌లై

(2వ పేజీ తరువాయి)

యుద్ధం (1950–1953) కాలంలో యుద్ధ విరమణ కోసం చర్చలు జరిపాడు. అలీనోద్యమానికి బాటలు పరిచిన బాండుంగ్ కాన్ఫరెన్స్ (1955)కి సంబంధించి ఆసియా, ఆఫ్రికా దేశాల సమావేశం నిర్వహించి చౌ తన దౌత్య నైపుణ్యాన్ని చాటాడు. దేశీయ ఆర్థిక సంస్కరణలను వేగంగా అమలుపరిచాడు. సాంస్కృతిక విప్లవం, గ్రేట్ లీప్ ఫార్వర్డ్ పేరుతో పార్టీలో అదివాద ధోరణులు జడలు విప్పినప్పుడు దానికి వ్యతిరేకంగా ఆయన తన శక్తి మేరకు అంతర్గత పోరాటం నడిపారు. పంచవర్ష ప్రణాళికల అమలుకు విశేషమైన కృషిచేశాడు.

**సాంస్కృతిక విప్లవ కల్లోలం**

మావో పట్ల విధేయత చూపుతూనే సిద్ధాంత విషయాల్లో ఖచ్చితంగా వ్యవహరించాడు చౌ ఎన్‌లై. ముఖ్యంగా సాంస్కృతిక విప్లవ ప్రతికూల కాలంలో మేధావుల్ని రక్షించడానికి అనేక ప్రయత్నాలు చేశాడు. కానీ తగినంతగా నిలబడలేదనే విమర్శ కూడా ఉంది. ఆ కాలంలో ఆయన కూడా బాధితుడే. పెట్టుబడిదారీ మార్గ వాదిగా చౌ పై ముద్ర వేసి గ్యాంగ్ ఆఫ్ ఫోర్ ప్రచారం చేసింది. 1970 సంవత్సరంలో ఆరోగ్యం క్షీణించినా చురుగ్గా పనిచేశాడు. 1972 సంవత్సరంలో ఆమెరికా అధ్యక్షుడు నిక్సన్‌తో దౌత్య చర్చలు జరిపి ఆయన చైనా పర్యటనకు మార్గం వేశాడు.

చైనా విప్లవంలోనూ, దేశాభివృద్ధి లోనూ కీలకమైన పాత్ర నిర్వహించిన చౌ ఎన్‌లై 1976 జనవరి 8న 77 సంవత్సరాల వయస్సులో కన్నుమూశారు. ఆయన కోరిక మేరకు చితాభస్మాన్ని ఆయన స్వంత ఊరులోని కొండలు, లోయల్లో చల్లారు. చైనా విప్లవ చరిత్ర లో చౌఎన్‌లై అంకితభావం, సమగ్రత, సమర్థయవంతమైన దౌత్య వ్యవహారాలకి ఒక చిహ్నంగా నిలిచారు. సిద్ధాంతం ఆచరణల మధ్య అంతరాన్ని తగ్గించడానికి, అంతర్గత సవాళ్లను చాకచక్యంగా పరిష్కరించడానికి విశేష కృషి చేసిన కమ్యూనిస్టు యోధుడు చౌఎన్‌లై. ❊

---

# తమిళనాడు కార్మికోద్యమంలో నూతనోత్సాహం

(31వ పేజీ తరువాయి)

స్వర్గధామంగా ఉందన్న సందేశాన్ని పంపాలని ప్రయత్నిస్తున్నాడు. మరోవైపున మిత్రపక్షాలు కూడా ఆయనను వ్యతిరేకించటం మాత్రమే కాకుండా, డిఎంకె కార్మికుల హక్కుల కోసం పోరాడుతుందన్న ఇమేజ్ కూడా దెబ్బతింటు న్నది. వివిధ తరగతుల నుండి వ్యతిరేకత పెరుగుతున్న క్రమంలో పునర్వ్యవస్థీకరించిన కమిటి ఆధ్వర్యంలో రెండవ సారి త్రైపాక్షిక సమావేశాన్ని నిర్వహించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రి స్థానంలో ప్రజా పనుల శాఖా మంత్రి ఇవి వేలును నియమించారు. యూనియన్‌ను రిజిష్టర్ చేయటం, వేతనాలను పెంచటం, కార్మికుల పని పరిస్థితులను మెరుగు చేయటం, కక్ష సాధింపు చర్యలకు పాల్పడకుండా ఉండటం ఈసారి అధికారికంగా కుదిరిన ఒప్పందంలో ఉన్నాయి. దానితో ఒత్తిడి నుండి బయటపడిన స్టాలిన్ ఎక్స్ ద్వారా ఈ ఒప్పందంపై ఆనందాన్ని వ్యక్తం చేశాడు.

**చట్టపరమైన సవాళ్ళు**

నూతనంగా ఏర్పాటైన ఎస్ఐడబ్ల్యుయును రిజిష్టర్ చేయాలని ఆదేశించాలని సంఘం ప్రధాన కార్యదర్శి పి ఎల్లెన్ మద్రాస్ హైకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటీషన్ ఈ మధ్యకాలంలో విచారణకు వచ్చింది. కేసులో తనను కూడా భాగస్వామిగా చేర్చాలని శామ్‌సంగ్ పిటీషన్ వేసింది. యూనియన్ పేరులో శామ్‌సంగ్ అని ఉండటాన్ని వ్యతిరేకిస్తూ, అది కంపెనికి ఉన్న పేరు, ప్రఖ్యాతులను దెబ్బతీస్తుందని శామ్‌సంగ్ దాఖలు చేసిన పిటీషన్‌లో పేర్కొంది. సమ్మె వలన కంపెని 10 కోట్ల డాలర్లను నష్టపోయిందని వారి తరపు లాయర్ జి రాజగోపాలన్ కోర్టులో వాదించాడు.

పిటీషనర్ల తరపున హాజరైన ఎన్‌జిఆర్ ప్రసాద్ ఇది ట్రేడ్‌మార్క్‌కు సంబంధించిన వివాదం కాదని, “వ్యాపారంలో తాము ప్రత్యర్థులం కాదని” చెప్పాడు. రిట్ పిటీషన్ కేవలం కార్మికసంఘం రిజిస్ట్రేషన్‌కు సంబంధించినదని, 1926లో ఆమోదించిన ట్రేడ్ యూనియన్ చట్టం కంపెని పేరును వినియోగించు కోవటాన్ని నిషేధించలేదని వాదించాడు. కోర్టు తదుపరి విచారణను నవంబరు 11వ తేదికి వాయిదా వేసింది.

**యూనియన్ గుర్తింపు డిమాండ్**

1926 కార్మిక చట్టం ప్రకారం తాము కొత్తగా ఏర్పాటు చేసుకున్న శామ్‌సంగ్ ఇండియా వర్కర్స్ యూనియన్ (ఎస్ఐడబ్ల్యుయు)ను రిజిష్టర్ చేయమని కార్మికులు డిమాండ్ చేశారు. కార్మికులు సంఘాన్ని ఏర్పాటు చేసుకొనే ప్రయత్నాలను శామ్‌సంగ్ ఇండియా కంపెని గత 17 సంవత్సరాల నుండి ప్రతిఘటిస్తున్నది. 2024 జూన్‌లో కార్మికులు ఎస్ఐడబ్ల్యుయును ఏర్పాటు చేసుకున్నారు. వారు యూనియన్‌ను సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు)కు అనుబంధం చేసి, 1926 కార్మికచట్టంలోని సెక్షన్ 8 ప్రకారం తమ యూనియన్‌ను రిజిష్టర్ చేయమని కోరారు. ఈ చట్టం ప్రకారం కార్మికులు పెట్టుకున్న దరఖాస్తు సక్రమంగా ఉన్నదని ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రార్ సంతృప్తి చెందితే యూనియన్‌ను రిజిష్టర్ చేయటం మినహా ప్రత్యామ్నాయం లేదు. కానీ శామ్ సంగ్ యాజమాన్యం యూనియన్‌ను గుర్తించ నిరాకరించి సమ్మె వరకు తీసుకువచ్చింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1)(సి) కార్మికులు యూనియన్ ఏర్పాటు చేసుకొనే హక్కును గ్యారంటి చేసింది. ఈ హక్కును అమలు చేయించుకోవటం ప్రాథమిక హక్కులలో ఒకటని రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 చెబుతున్నది. దీనిని ప్రాథమిక హక్కుగా పేర్కొని, కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసుకోవటానికి రాజ్యాంగం చట్టపరమైన రక్షణ కల్పించినప్పటికీ, కార్మికులు సంఘాన్ని ఏర్పాటు చేసుకోవటాన్ని శామ్‌సంగ్ యాజమాన్యం వ్యతిరేకిస్తున్నది. ట్రేడ్ యూనియన్‌ల రిజిస్ట్రార్ ఎస్ఐడబ్ల్యుయు దరఖాస్తు సక్రమంగా ఉన్నప్పటికీ యూనియన్‌ను రిజిష్టర్ చేయటానికి అంగీకరించకపోవటం ఆశ్చర్యం కలిగించింది. దీనితో యూనియన్‌ను రిజిస్టర్ చేసి, సర్టిఫికెట్ జారి చేయాల్సిందిగా రిజిస్ట్రార్‌కు ఆదేశాలివ్వాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో కార్మిక సంఘం కేసు వేసింది.


**కార్మికుల్లో విశ్వాసం పెంచిన సమ్మె**

శామ్‌సంగ్ కార్మికుల సమ్మె తమిళనాడులో కార్మికోద్యమ పునర్వికాసానికి, పోరాటాలకు దారితీస్తుందన్న భావన వ్యక్తమౌతున్నది. ఈ సమ్మె దోపిడీకి వ్యతిరేకంగా పోరాడగలమనే విశ్వాసాన్ని కార్మికులకు కలిగించింది. సిపిఐ(ఎం) కార్మికులతో సన్నిహితంగా ఉంటుందని, వారి పక్షాన నిలబడుతుందని మరొకసారి రుజువు చేసుకున్నది.

నయా–ఉదారవాద విధానాల అమలు వలన కార్మికులు తీవ్ర దోపిడికి గురవుతున్నారు. అభివృద్ధి అవుతున్న కృత్రిమ మేధ కార్మికులకు తీవ్రమైన సవాళ్ళు విసురుతున్న పరిస్థితులలో నైపుణ్యం లేని, నైపుణ్యం ఉన్న, సంఘటిత, అసంఘటిత కార్మికులు కూడా తీవ్రమైన అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. కార్మికసంఘాలు అత్యంత క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. పారిశ్రామికీకరణ, కార్మికుల హక్కులు, రెండింటినీ కాపాడుకోవటం కోసం వారు ఏనాటి కన్నా ఎక్కువగా కష్టపడి పని చేయాల్సివస్తున్నది. ❊

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 20, issue: 9 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# వ్యాధుల భారం భారత్‌లో ఎక్కువ




ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే భారత దేశ ప్రజలు వ్యాధుల భారాన్ని చాలా ఎక్కువగా మోస్తున్నారని ఇన్‌స్టిట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్ అండ్ ఇవాల్యుయేషన్ అనే సంస్థ తెలిపింది. ప్రపంచ జనాభాలో భారత దేశ జనాభా 17 శాతం కాగా ప్రపంచ వ్యాధుల భారంలో 20 శాతాన్ని భారత దేశం మోస్తున్నదని సంస్థ నివేదికలో తెలిపింది. దీనికి కారణం దేశంలో గుండెజబ్బులు, కాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు, మధుమేహం వంటి అంటురోగాలు కాని రోగాలు ఎక్కువగా ఉండడమేనని సంస్థ తెలిపింది. వీటితోబాటు ప్రపంచంలోనే అత్యధిక స్థాయిలో క్షయ రోగం భారత దేశంలో ఉండడం కూడా దేశంలో రోగాల భారత పెరగడానికి ఒక కారణం.

ఏ దేశంలోనైనా ప్రజల ఆరోగ్యాన్ని కొలవడానికి ఆ దేశ ప్రజల ఆయు:ప్రమాణం, మరణాల రేటును ప్రాతిపదికగా తీసుకుంటారు. కాని ఈ రకమైన కొలతలో ఆ దేశ ప్రజలు వ్యాధులతో ఎంతవరకు బాధపడుతున్నారు, వ్యాధుల వల్ల వారి జీవిత కాలం ఎంతవరకు తగ్గిపోతున్నది అన్న విషయాన్ని పరిగణలోకి తీసుకోరు.

దేశ ప్రజల మరణాల రేటు, వ్యాధుల బాధ రెంటినీ కలిపి చూస్తే ఆ దేశ ప్రజల ఆరోగ్యం గురించి మరింత సమగ్రమైన అవగాహన వస్తుంది. మరణాలు, వ్యాధులు రెంటినీ కలిపితే వచ్చేదే "వ్యాధుల భారం" (బర్డెన్ ఆఫ్ డిసీజెస్) దీన్ని పరిశోధకులు ఒక కొలమానంతో కొలుస్తారు. దాన్నే "డిసబిలిటీ అడ్జస్టడ్ లైఫ్ ఇయర్స్" (డాలీస్) అంటారు. జనాభా కోల్పోయిన ఆరోగ్యాన్ని కొలవడానికి డాలీస్‌ను యూనిట్‌గా తీసుకుంటారు. వివిధ దేశాల్లో వివిధ వ్యాధుల వల్ల వివిధ సెక్షన్ల ప్రజలపై పడిన భారాన్ని డాలీస్‌లో కొలుస్తారు. ఒక డాలీ అంటే కోల్పోయిన ఒక ఆరోగ్యకరమైన సంవత్సరం అన్నమాట. అనారోగ్యంతో గడిపిన లేక అనారోగ్యంతో చనిపోయిన ఏడాదిని ఒక డాలీగా పేరొంటారు. 1998లో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ యూనిట్‌ను రూపొందించింది.

భారత దేశంలో మొత్తం ప్రపంచ జనాభాలో 17 జనాభా మాత్రమే ఉన్నప్పటికీ వారు ప్రపంచ వ్యాధుల భారంలో 20 శాతాన్ని మోస్తున్నారు. అంటే దేశ జనాభా ఆరోగ్యంగా జీవించడం లేదన్నమాట.

ఈ వ్యాధుల భారానికి ప్రధాన కారణం గుండె జబ్బులు, పక్షవాతం, కాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు.

ప్రపంచంలో క్షయవ్యాధి భారంలో అత్యధిక భాగాన్ని భారత ప్రజలు మోస్తున్నారు. దేశంలో కూడా వివిధ ప్రాంతాల్లో ఈ భారం విభిన్నంగా ఉంది. ఆహారం సరిగ్గా లేకపోవడం, సరైన వ్యాయామం లేకపోవడం, పొగాకును అధికంగా వినియోగించడం, గాలి కాలుష్యం మొదలైనవి భారత ప్రజలపై వ్యాధి భారం పెరగడానికి కారణం. దేశంలోని వ్యాధుల భారంలో 15 శాతం శిశువులకు, తల్లులకు పౌష్టికాహారం లేకపోవడం వల్ల, 10 శాతం వాము కాలుష్యం వల్ల వస్తున్నది.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా రూ. **180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు ..............................................

వీధి ..............................................

గ్రామం ..............................................

మండలం లేదా పట్టణం ..............................................

జిల్లా ..............................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.